www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నిండుకుండల్లా శ్రీశైలం, సాగర్

గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల

శ్రీశైలంలో 6, నాగార్జునసాగర్‌లో 20 గేట్లు ఎత్తివేత 14

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి



ఆదివారం నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 20 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

సోమవారం | 21-10-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 186 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం; తిథి: పంచమి రా. 2.30 తదుపరి షష్ఠి; నక్షత్రం: రోహిణి ఉ. 6.50, మృగశిర తె. 5.51 వరకు వర్జ్యం: మ. 12.12-1.44; దుర్ముహూర్తం: మ. 12.22-1.08, మ. 2.41-3.27; అమృతఘడియలు: రా. 9.24-10.56; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.13; సూర్యాస్తమయం: 5.45 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

షర్మిలతో రాయబేరం

దిక్కుతోచక దిగొచ్చిన జగన్!

బెంగళూరు వేదికగా చర్చలు

ఆస్తుల పంపకంపై రాజీ

దాదాపు కుదిరిన ఒప్పందం





ఆస్తుల పంపిణీకి ఎట్టకేలకు జగన్ ఓకే

కాంగ్రెస్‌తో దోస్తీ కోసం చెల్లెలితో రాజీ

ఎన్నికల్లో ఘోర పరాజయం.. ఆ తర్వాతి పరిణామాలతో జగన్‌కు దిమ్మ తిరిగి బొమ్మ కనపడింది. దెబ్బకు వాస్తవంలోకి దిగొచ్చారు. తనకు రాజకీయ భవిష్యత్తు ఉండాలంటే నాలుగు మెట్లు దిగక తప్పదని గ్రహించారు. మరో దిక్కు కానరాక చెల్లి షర్మిలతో రాయ'బేరానికి' సిద్ధమయ్యారు. ఇన్నాళ్లూ ససేమిరా అంటూ వచ్చిన ఆస్తుల పంపిణీకి అంగీకరించారు. ఎందుకిలా? తెర వెనుక అసలు ఏం జరిగింది?

'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఇన్నాళ్లూ సొంత చెల్లి షర్మిలను నానా రకాలుగా వేధించిన వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ దెబ్బకు దిగొచ్చారు. ఆమెతో రాయ'బేరానికి' దిగారు. ఆస్తిలో వాటాలు పంచేందుకు అంగీకరించారు. వాస్తవానికి తన ఆస్తిలో కుమార్తె షర్మిలకు సమాన వాటా ఉండాలని వైఎస్ రాజశేఖరరెడ్డి పలుమార్లు చెబుతుండేవారు. కానీ ఆయన మరణానంతరం ఆమెకు వాటా ఇచ్చేందుకు జగన్ ససేమిరా అన్నారు. అంతేకాకుండా ఆమెను పలు రకాలుగా వేధించారు. ఇంటి నుంచి దాదాపు వెలివేశారు. ఇది సరికాదని వైఎస్ కుటుంబానికి సన్నిహితులైన చాలా మంది చెప్పి చూసినా జగన్ ఖాతరు చేయలేదు. తండ్రి వైఎస్ ఇచ్చిన మాటను నెరవేర్చాలని ఆయనకు ఎంతగా నచ్చజెప్పినా.. ఆస్తుల పంపిణీకి ససేమిరా అన్నారు. 2019 ఎన్నికల్లో జగన్ కోసం తీవ్రంగా శ్రమించిన షర్మిల.. జగన్ అసలు స్వరూపం అర్థమయ్యాక పోరాటం తప్ప మరో మార్గం లేదని గ్రహించారు. తన హక్కుల కోసం ఆమె ఒకరకంగా భారీ ధర్మ యుద్ధమే చేశారు. అలుపెరగని రీతిలో ఆమె చేసిన పోరాటం ఇప్పుడు ఫలితాలనిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

■ ఏపీలో అడుగుతో..

షర్మిల రాజకీయ రంగ ప్రవేశాన్ని జగన్ మొదట్లో అంతగా పట్టించుకోలేదు. ఆమె తెలంగాణకు పరిమితం కావడంతో తనకు వచ్చిన నష్టం ఏమీ లేదన్నట్లు ఉండిపోయారు. తన మొండి వైఖరిని కొనసాగించారు. కానీ మొన్నటి ఎన్నికలకు ముందు ఆమె ఏపీ రాజకీయాల్లో అడుగుపెట్టడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. ఏకంగా

మిగతా 13వ పేజీలో...

సాములోరి శిష్యుడు, నాటి సీఎం జగన్ పర్యాటకుల కోసం విశాఖ రుషికొండపై ఏడు నక్షత్రాల హోటల్, కన్వెన్షన్ సెంటర్, గదులు నిర్మిస్తామని మభ్యపెట్టి.. తన కుటుంబం కోసం విలాసంగా, విశాలంగా రాజభవనం నిర్మించుకున్నారు. ఇక సాములోరు ఏకంగా.. ఆధ్యాత్మికం పేరిట భారీగా ఆదాయార్జన బాట పట్టారు. బోర్డింగ్ హౌస్ పేరు చెప్పి.. భీమిలిలో సముద్రతీరం కనిపించేలా భారీ స్టార్ హోటల్ నిర్మించుకునేందుకు అనాడు సకల అనుమతులు పొందారు. తాజాగా బయటపడిన ఈ వ్యవహారాన్ని చూసి రెవెన్యూ శాఖ వర్గాలే విస్తుపోతున్నాయి.

ఆధ్యాత్మిక సేవకోసం అంటే ప్రభుత్వం కారుచౌకగా భూమిని కేటాయించడం సరైనదే. కానీ, ఆదాయార్జనను కూడా ఆ సేవలో కలిపేస్తే.. తక్కువ ధరకు భూమిని కట్టబెట్టాల్సిన అవసరం లేదు. కానీ, నాటి జగన్ సర్కారు మరీ అడ్డగోలుగా సాములోరి సేవలో తరించింది. ఎకరం రూ.కోట్లు విలువ చేసే భూమిని రూ.కొన్ని లక్షలకు కట్టబెట్టేసింది. ఆదాయార్జన కోసం ఆ భూముల్లో విలాసవంతమైన స్టార్‌హోటల్ కట్టుకునేందుకూ అనుమతి ఇచ్చింది. అయితే..హోటల్ అంటే అనుమతులు కష్టం అవుతాయని బోర్డింగ్ హౌస్ పేరిట నాడు బాగోతం నడిపించారు!

సాములోరికి స్టార్ హోటల్!

దీని మర్మమేమి సామీ..?

ఆధ్యాత్మిక సేవ అంటూ భీమిలిలో భూమి

ఆనక.. ఆదాయార్జనకు భారీ ఎత్తున ఏర్పాట్లు

జగన్ హయాంలో గుట్టుగా భూదందా

శారదాపీఠానికి నాడు రెవెన్యూశాఖ దాసోహం

సముద్రం కనిపించేలా స్టార్ హోటల్

బోర్డింగ్ హౌస్ ముసుగులో నడిచిన బాగోతం

ఎనిమిది అంతస్తుల్లో కడతామన్న పీఠం

ఎన్నికలకు ముందు దీనిపై జీవో కూడా జారీ

విస్తుపోతున్న రెవెన్యూ నిపుణులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

స్వాములు అంటే సర్వసంగ పరిత్యాగులు. ఆడంబరాలు, విలాసాలకు దూరంగా ఉంటారు. ఆశ్రమాలు ఏర్పాటు చేసుకొని ఆధ్యాత్మిక బోధనలతో ధర్మప్రచారం నిర్వహిస్తుంటారు. అయితే, స్వాములందు ఈ స్వామి వేరయా అన్నట్లు శారదాపీఠం సాములోరు అవతరించారు. తొలుత వేద విద్య కోసం అంటూ గత ప్రభుత్వాన్ని భూమిని కోరారు. ఆ తర్వాత ఆ భూమిని మార్పించుకొని నచ్చిన భూమిని తీసుకున్నారు. అయితే, ఆయన అక్కడితో ఆగలేదు... ఆధ్యాత్మికం పేరిట భారీగా సొమ్ములు సంపాదించుకునేందుకు, బోర్డింగ్ హౌస్‌ల పేరిట సముద్రతీరం కనిపించేలా

మిగతా 14వ పేజీలో...



ఆదివారం ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వేంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరిస్తున్న మంత్రి లోకేశ్

మరింత సాయం చేయండి

ఢిల్లీలో అమిత్‌షాతో లోకేశ్ భేటీ 13

రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని వినతి

విశ్వసనీయత @ 459 కోట్లు

నెలన్నర తర్వాతా వరదలా సాయం 14

వరదలోనూ వెంట ఉండే నాయకుడికీ

బురదలో దిగని నేతకీ తేడా చూసిన జనం

అందుకే దాతల నుంచి ఇంతటి స్పందన

జగన్ సర్కారు పాపం

పిల్లలకు శాపం

గతేడాది ఉన్నత విద్య విద్యార్థులకు మూడు క్వార్టర్ల ఫీజులు పెండింగ్

ఫీజులు కడితేనే పరీక్షలు రాయిస్తామని విద్యార్థులపై కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి

మొత్తం బకాయిలు 2,100 కోట్ల పైనే

వచ్చే నెలలోనే ఇంజనీరింగ్, డిగ్రీ పరీక్షలు

ఫైనలియర్ విద్యార్థులకు సర్టిఫికెట్లూ నిలిపివేత

తల్లిదండ్రులు అప్పులు చేసి మరీ చెల్లింపు

మరోవైపు వసతి దీవెన 1400 కోట్లు పెండింగ్

వేల కోట్లు పెండింగ్ పెడితే ఎలా అంటున్న కాలేజీలు

ఈ ఆర్థిక భారమంతా కూటమి ప్రభుత్వంపైనే



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

విద్యార్థులకు తాను మేనమామ లాంటి వాడినన్నారు. ఎంత ఖర్చయినా చదివిస్తానని బీరాలు పలికారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాలు ప్రవేశ పెట్టామని గొప్పలు చెప్పారు. ఇన్ని మాటలు చెప్పి.. చివరకు గతేడాది ఉన్నత విద్య విద్యార్థులకు మూడు క్వార్టర్ల ఫీజులు దాదాపు రూ.2100 కోట్లు బకాయి పెట్టారు. వసతి దీవెన కింద మరో 1400 కోట్లూ విద్యార్థులకు ఇవ్వలేదు. మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన నిర్వాకం ఇప్పుడు విద్యార్థులకు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వానికి భారంగా మారింది. ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని కాలేజీ యాజమాన్యాలు మొన్నటిదాకా విద్యార్థులకు కరాఖండీగా చెప్పేశాయి. చెల్లించని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఆపేశాయి. ఇప్పుడు కొత్త విద్యా సంవత్సరంలో ఫీజులు కడితేనే పరీక్షలు అంటూ కొత్త మెలిక పెడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, డిగ్రీ కోర్సులు చదువుతున్న విద్యార్థులపై యాజమాన్యాలు ఇలా తీవ్రస్థాయిలో ఒత్తిడి చేస్తున్నాయి. ప్రభుత్వం ఫీజులు విడుదల చేసిందా? లేదా? అనేది తమకు అనవసరమని, ఫీజులు కట్టి పరీక్షలు రాయాలని తేల్చి చెబుతున్నాయి. గత ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...



శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం

తిరుమలలో వైసీపీ ఎమ్మెల్సీ దందా 3

9 వీఐపీ బ్రేక్ టికెట్లు రూ.1.5 లక్షలకు విక్రయం!

ఈ నెల 19న భక్తులతో దర్శనానికి వచ్చిన శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం

క్యూలైన్‌లో డిక్లరేషన్‌పై సంతకం

భక్తుడి ఫిర్యాదుతో వెలుగుచూసిన బాగోతం

ఆమెతో పాటు ముగ్గురిపై కేసు నమోదు

నేడు అల్పపీడనం

రేపు వాయుగుండం, ఎల్లుండి తుఫాన్‌గా బలపడే చాన్స్ 14

24న ఒడిశా, బెంగాల్ మధ్య తీరం దాటే చాన్స్

గురువారం నుంచి ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

ఒడిశా, బెంగాల్‌ను అప్రమత్తం చేసిన ఐఎండీ

చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు హెచ్చరిక

కొనసాగుతున్న బాంబు బెదిరింపులు

ఒక్కరోజే 24 విమానాలకు హెచ్చరికలు

అన్నీ ఒట్టివేనని తనిఖీల్లో వెల్లడి

వారంలో 90కిపైగా విమానాలకు..

గంటలపాటు సర్వీసుల ఆలస్యం..

ప్రయాణికులకు ఇబ్బందులు 2

ఢిల్లీ సీఆర్పీఎఫ్ స్కూల్ వద్ద పేలుడు

ధాటికి ప్రహరీ గోడ ధ్వంసం.. దెబ్బతిన్న చుట్టుపక్కల భవనాల కిటికీలు, కార్ల అద్దాలు

2 కిలోమీటర్ల వరకు వినిపించిన శబ్దం

'క్రూడ్ బాంబు'గా పోలీసుల అనుమానం 2



యుద్ధానికి సిద్ధం కండి

తైవాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో సైన్యానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆదేశం 2

మహారాష్ట్ర ఎన్నికలకు బీజేపీ తొలి జాబితా

99 మంది అభ్యర్థులకు అవకాశం

వారిలో 71 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు

జాబితాలో ఉప ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తోపాటు పలువురు ప్రముఖులు 2

ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి ప్రణాళికలు లీక్

పెంటగాన్ నుంచి కీలక పత్రాలు బయటకు

ఇజ్రాయెల్ సన్నద్ధత వివరాలు బహిర్గతం

యాహ్యా సిన్వర్ మరో పాత వీడియో వైరల్

ఇజ్రాయెల్‌పై దాడికి గంట ముందుది

కొనసాగుతున్న బాంబు బెదిరింపులు

- ఒక్కరోజే 24 విమానాలకు హెచ్చరికలు
- వారం రోజుల్లో 90కిపైగా విమానాలకు



న్యూఢిల్లీ, అక్టోబరు 20: విమానాలకు బాంబు బెదిరింపుల పరంపర కొనసాగుతోంది. ఆదివారం దాదాపు 24 విమానాలకు బెదిరింపులు వచ్చాయి. వీటిలో ఇండిగో, విస్తారా, ఆకాశ ఎయిర్, ఎయిరిండియా మొదలైన కంపెనీలకు చెందిన దేశీయ, అంతర్జాతీయ సర్వీసులున్నాయి. వీటితో కలిపి గత వారం రోజుల్లో మొత్తం 90కిపైగా విమానాలకు బెదిరింపులు వచ్చాయి. ఇవన్నీ కూడా ఒట్టివేనని తేలింది. తనిఖీల్లో ఎలాంటి ప్రమాదకరమైన వస్తువులు కనిపించలేదు. అయితే, గమ్యస్థానానికి వెళ్లకుండా మార్గమధ్యంలోనే విమానాలను దింపివేయటం, తనిఖీలు చేపట్టటం కారణంగా సర్వీసులు పలు గంటలపాటు ఆలస్యమయ్యాయి. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఈ బెదిరింపుల పర్వం మొదలుకావటంతో.. వీటి వెనుక ఏదైనా రాజకీయ కుట్ర ఉందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ, ఉత్తరాది రాష్ట్రాల్లో వందలాది స్కూళ్లకు ఇదే తరహాలో బాంబు బెదిరింపులు వచ్చాయి.

ఢిల్లీ సీఆర్పీఎఫ్ స్కూల్ వద్ద పేలుడు



న్యూఢిల్లీ, అక్టోబరు 20: దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం కలకలం రేగింది. ప్రశాంత్ విహార్ సీఆర్పీఎఫ్ పాఠశాల ప్రహరీ గోడ వద్ద ఉదయం 7.50 గంటల సమయంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఎవరికీ ఎలాంటి హానీ జరగలేదు కానీ పేలుడు ధాటికి ఆ గోడ దెబ్బతినడంతో పాటు సమీపంలో ఉన్న కార్లు, భవనాల కిటికీలు పగిలిపోయాయి. చెవులు చిల్లులు పడేలా వచ్చిన శబ్దం దాదాపు రెండు కిలోమీటర్ల దూరం వరకు వినిపించింది. ఢిల్లీ పోలీసులతో పాటు ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ, సీఆర్పీఎఫ్ సిబ్బంది, బాంబు స్క్వాడ్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఇంకా అక్కడేమైనా పేలుడు పదార్థాలు ఉన్నాయోమో తనిఖీ చేయడానికి రోబోలను వినియోగించారు. ఫోరెన్సిక్ నిపుణులు అక్కడ తెల్లని పౌడర్ లాంటి పదార్థాన్ని గుర్తించి.. దాన్ని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. పేలుడుకు 'క్రూడ్ బాంబు' కారణమని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

లోకం తీరు



కశ్మీర్‌లో ఉగ్రదాడి

వైద్యుడు, ఐదుగురు వలస కార్మికుల కాల్చివేత

శ్రీనగర్, అక్టోబరు 20: జమ్మూ-కశ్మీర్‌లో ఆదివారం సాయంత్రం ఉగ్రవాదులు మళ్లీ తెగబడ్డారు. గందేర్‌బల్ జిల్లాలోని గగన్‌గిర్ వద్ద ఓ ప్రయివేటు కంపెనీ సిబ్బంది ఉంటున్న స్థావరం కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఓ వైద్యుడుతో పాటు, అయిదుగురు వలస కార్మికులు మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడడంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన ఈ కార్మికులు గగన్‌గీర్ నుంచి సోనామార్గ్ వరకు చేపడుతున్న జడ్-మోర్హ్ సొరంగం పనుల్లో పాల్గొంటున్నారు. శుక్రవారమే సోఫియాన్ జిల్లాలో బిహార్‌కు చెందిన వలస కార్మికుడిని కూడా ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఏప్రిల్ నెలలోనూ అనంత్‌నాగ్ జిల్లాలో పని చేస్తున్న ఓ వలస కార్మికుడిని ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారు. ఇందుకు తమదే బాధ్యత అని లష్కర్ ఎ తోయిబా ప్రకటించుకొంది. స్థానికేతర కార్మికులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. ఈ దాడి అమానుషమని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

తండ్రి అప్పు కట్టలేదని కుమార్తెపై అత్యాచారం

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు ఉత్తర తాలూకాలో అమానుష ఘటన చోటుచేసుకుంది. ఓ వ్యక్తి రుణం చెల్లించలేదని అతని మైనర్ కుమార్తెపై వడ్డీ వ్యాపారి అత్యాచారానికి ఒడిగట్టాడు. మాదనాయకనహళ్లిలో ఆదివారం ఈ దారుణ ఘటన జరిగింది. దీనిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి, నిందితుడిని వెంటనే అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు రవికుమార్ (39) వద్ద బాలిక తండ్రి రూ.70 వేలు అప్పు తీసుకుని రూ.30 వేలు తిరిగి చెల్లించాడు. రూ.40 వేలు అసలుతోపాటు వడ్డీ చెల్లించాల్సి ఉంది. ఆ మొత్తం వసూలు చేసుకునేందుకు తరచూ రవికుమార్ అతని ఇంటికి వెళ్లేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో వెళ్లి అప్పు చెల్లించాలని బాలికను బెదిరించాడు. అనంతరం అత్యాచారానికి పాల్పడ్డాడు.

మంత్రి దినేశ్ గుండూరావు క్షమాపణలు చెప్పాలి

- నోటీసులు పంపిన సావర్కర్ ముని మనవడు

బెంగళూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వినాయక దామోదర్ సావర్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలంటూ కర్ణాటక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావుకు సావర్కర్ ముని మనవడు సాత్యకి సావర్కర్ నోటీసులు పంపారు. ఇటీవల గాంధీ జయంతి రోజున బెంగళూరులో ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సావర్కర్ గోవధకు వ్యతిరేకం కాదని, ఆయన గొడ్డుమాంసం తినేవారని వ్యాఖ్యానించారు. సావర్కర్‌ను మహ్మద్ అలి జిన్నాతో పోల్చారు. దీంతో సాత్యకి సావర్కర్ నోటీసులు పంపారు. అందులో 15 రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నట్టు తెలిసింది.

యువత రాజకీయాల్లోకి రావాలి

ఇదో ఉద్యమంలా సాగాలి.. అప్పుడే అవినీతి అంతం.. పరివార్‌వాదంతో దేశానికి ముప్పు: మోదీ

వారాణసిలో శంకర నేత్రాలయం ప్రారంభం

- ఎన్‌డీఏ అంటే.. 'నరేంద్ర దామోదర్‌దాస్ కా అనుశాసన్': శంకరాచార్య



వారాణసిలో ఆర్‌జే శంకర నేత్ర వైద్యశాల ప్రారంభోత్సవంలో కంచి కామకోటి శంకరాచార్య విజయేంద్ర సరస్వతి, ప్రధాని మోదీ

వారాణసి, అక్టోబరు 20: దేశంలో కుటుంబ వారసత్వ రాజకీయాలు ఉండడం మంచిది కాదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అందువల్ల రాజకీయ నేపథ్యంలేని కుటుంబాలకు చెందిన యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. 'రాజకీయ వంశాలు' దేశ యువతకు నష్టం కలిగించాయని విమర్శించారు. ఆదివారం వారాణసిలో కంచిపీఠం నెలకొల్పిన ఆర్‌జే శంకర నేత్ర వైద్యశాలను ప్రారంభించడంతో పాటు, రూ.6,700 కోట్లతో చేపట్టిన వివిధ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. "పరివార్‌వాదులతో దేశానికి పెద్ద ముప్పు ఉంది. యువతకు అవకాశాలు ఇవ్వడంలో వారికి నమ్మకం లేదు. అందువల్లనే రాజకీయ నేపథ్యంలేని కుటుంబాలకు చెందిన లక్ష మంది యువత రాజకీయాల్లో పాల్గొనాలని ఎర్రకోట నుంచి పిలుపునిచ్చాను. దేశ రాజకీయాలను మార్చేందుకు, అవినీతిని, పరివార్‌వాద సిద్ధాంతాన్ని నిర్మూలించేందుకు దీన్ని ఉద్యమంలా చేపట్టాలి" అని అన్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ఆశ్రిత పక్షపాతాన్ని పోషిస్తున్నాయని విమర్శించారు. గతంలో వేల కోట్ల రూపాయల కుంభకోణాలు పత్రికల్లో పతాక శీర్షికలుగా ఉండేవని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెప్పారు. కాగా, ఈ సమావేశంలో కంచి కామకోటి పీఠం శంకరాచార్య జగద్గురు విజయేంద్ర సరస్వతి స్వామి ప్రసంగిస్తూ ప్రధాని మోదీ, ఎన్‌డీఏలను దేవుడు అనుగ్రహించాడని అన్నారు. ఎన్‌డీఏ అంటే 'నరేంద్ర దామోదర్‌దాస్ కా అనుశాసన్' (నరేంద్ర దామోదర్ దాస్ పరిపాలన) అని అభివర్ణించారు. తొలుత సంస్కృతంలో ప్రసంగాన్ని ప్రారంభించిన శంకరాచార్య మోదీ ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. అందరి సంక్షేమానికి కృషి చేస్తూ ప్రపంచంలోనే ఆదర్శ ప్రభుత్వంగా ఉంటోందని చెప్పారు. ఇటీవలి కశ్మీర్ ఎన్నికల ఫలితాలను కూడా ప్రశంసించారు. తనకు ప్రధాని మోదీతో చిరకాలంగా అనుబంధం ఉందని చెప్పారు. కోయంబత్తూరులో తొలుత నేత్ర వైద్యశాలను ప్రారంభించామని, ఇది 17వదని చెప్పారు. ప్రధాని మోదీ తన నియోజకవర్గమైన వారాణసిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్, విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆగ్రా, బగ్‌డోగ్రా, రేవా, అంబికాపూర్, సార్‌సావా విమానాశ్రయాల పనులకు కూడా శంకుస్థాపనలు చేశారు.

మహారాష్ట్ర ఎన్నికలకు బీజేపీ తొలి జాబితా విడుదల

ముంబయి, అక్టోబరు 20: నవంబరు 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ విడుదల చేసింది. ఆదివారం మధ్యాహ్నం విడుదల చేసిన ఈ జాబితాలో 99 మంది పేర్లు ఉన్నాయి. ఇందులో 71 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలే. మహారాష్ట్ర అసెంబ్లీలో 288 సీట్లు ఉండగా.. బీజేపీ 151 సీట్లకు పోటీ చేయనుంది. మిగిలిన సీట్లకు బీజేపీ మిత్రపక్షాలు శివసేన, అజిత్ పవార్ ఎన్సీపీ వర్గం పోటీ చేయనున్నాయి. బరిలో దిగనున్న ప్రముఖుల్లో ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, స్పీకర్ రాహుల్ నర్వేకర్ తదితరులున్నారు. బీజేపీ తొలి జాబితాలో 13 మంది మహిళలకు సీటు దక్కింది. అలాగే షెడ్యూల్ తెగలకు చెందినవారికి ఆరు, షెడ్యూలు కులాలకు నాలుగు సీట్లు కేటాయించారు.

రోడ్డు ప్రమాదాల్లో రోజుకు సగటున 474 మంది దుర్మరణం

న్యూఢిల్లీ, అక్టోబరు 20: దేశవ్యాప్తంగా రహదారులు నెత్తురోడుతున్నాయి. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల కారణంగా అనేక మంది మృత్యువాత పడుతున్నారు. గత ఏడాదిలో రోడ్డు ప్రమాదాల వల్ల 1.7 లక్షలకుపైగా మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి వివరాలను సమర్పించాయి. ఈ లెక్కన రోజుకు సగటున 474 మంది లేదా ప్రతి మూడు నిమిషాలకు దాదాపుగా ఒకరు మృత్యువాత పడినట్టు చెప్పవచ్చు. ప్రమాదాల వెనుక కారణాలు, సమస్యలను మదింపు చేయడానికి జాతీయ స్థాయిలో కేంద్రం రోడ్డు ప్రమాదాల గణాంకాలను క్రోడీకరించడం మొదలు పెట్టినప్పటి నుంచి గత ఏడాదిలోనే అత్యధికంగా రోడ్డు ప్రమాద మరణాలు సంభవించాయి. ఇక రోడ్డు ప్రమాదాల కారణంగా గాయాలపాలవుతున్న వారి సంఖ్యా పెరుగుతోంది. గత ఏడాదిలో దాదాపు 4.63 లక్షల మంది గాయాలపాలయ్యారు. 2022 సంవత్సరంతో పోల్చితే ఇది 4 శాతంకన్నా ఎక్కువ. కాగా రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం గత ఏడాదిలో రోడ్డు ప్రమాదాల మూలంగా జరిగిన మరణాలు 1.6 లక్షలకు పైనే ఉన్నాయి.

ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడి ప్లాన్లు లీక్

పెంటగాన్ నుంచి కీలక పత్రాలు బయటకు

టెల్ అవీవ్, అక్టోబరు 20: ఇరాన్‌పై ఇజ్రాయెల్ ప్రతిదాడికి ప్రణాళికలు బహిర్గతమయ్యాయి. పెంటగాన్ నుంచి రెండు కీలక పత్రాలు బయటకు వచ్చాయి. ఇజ్రాయెల్ బలగాల సన్నద్ధత వివరాలు ఈ పత్రాల ద్వారా వెల్లడైంది. అక్టోబర్ 1న ఇరాన్ 200 క్షిపణులతో దాడి చేశాక ఇజ్రాయెల్ ప్రతిదాడికి పెద్ద ఎత్తున సన్నద్ధమౌతున్నట్లు ఈ పత్రాల్లో ఉంది. ఇజ్రాయెల్ బలగాల సన్నద్ధతపై అమెరికా గూఢచార ఉపగ్రహాల సాయంతో నేషనల్ జియోస్పాటికల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ రూపొందించిన కీలక పత్రాలను ఇరాన్ అనుకూల టెలిగ్రామ్ ఛానళ్లలో పోస్ట్ చేశారు. అక్టోబర్ 15-16 తేదీల్లో ఇజ్రాయెల్ వైమానిక సేన సన్నాహాల వివరాలు ఇందులో ఉన్నాయి. దీనికి సంబంధించి న్యూయార్క్ టైమ్స్ ఓ కథనం ప్రచురించింది. దీంతో ఉలిక్కిపడిన అమెరికా ప్రభుత్వం కీలక పత్రాల లీకేజీ ఎలా జరిగిందనే విషయంపై ఉమ్మడి దర్యాప్తునకు ఆదేశించింది. కాగా, గాజాపై ఇజ్రాయెల్ తాజా వైమానిక దాడుల్లో 87 మంది చనిపోయారు.


యుద్ధానికి సిద్ధం కండి: జిన్‌పింగ్

బీజింగ్, అక్టోబరు 20: తైవాన్- చైనా మధ్య మరోసారి యుద్ధ వాతావరణం నెలకొనే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. యుద్ధానికి సిద్ధం కావాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ సైన్యానికి ఆదేశాలు ఇచ్చారని చైనా మీడియా సంస్థలు కథనాలు వెలువరించాయి. గురువారం పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్‌కు చెందిన బ్రిగేడ్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన ఆ వ్యాఖ్యలు చేసినట్లు పేర్కొన్నాయి. ఈనెల 14న తైవాన్ చుట్టూ చైనా యుద్ధ విమానాలు, డ్రోన్‌లు, యుద్ధ నౌకలు వంటి వాటిని మోహరించింది. ఈ నేపథ్యంలో జిన్‌పింగ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

గర్జించలేదు రష్యా..

ఉక్రెయిన్‌తో యుద్ధంలో లక్షలాది సైనికులను కోల్పోయిన పుతిన్

- యుద్ధం మొదలై 31 నెలలు దాటినా.. లొంగని ఉక్రెయిన్
- నాటో దేశాల అండ, టెక్నాలజీ సాయంతో రష్యాపై పోరు
- రష్యా భూభాగాన్నిసైతం ఆక్రమించుకున్న జెలెన్‌స్కీ సైన్యం
- నల్లసముద్రంలో రష్యా మోహరించిన యుద్ధనౌకల ధ్వంసం







బైబిల్ కథల్లో డేవిడ్ అండ్ గోలియత్ కథ చాలా మందికి తెలిసే ఉంటుంది! అత్యంత శక్తిమంతుడైన గోలియత్‌ను బాలుడైన డేవిడ్.. మట్టికరిపిస్తాడు! గోలియత్‌ను కొట్టడానికి డేవిడ్ దగ్గర పెద్దగా శస్త్రాస్త్రాలేమీ ఉండవు. కేవలం తన దగ్గరున్న ఒడిసెల(స్లింగ్)తో కొట్టి విజయం సాధిస్తాడు! అది కథ కావచ్చు. కానీ, ఇప్పుడు అలాంటిదే.. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ రూపంలో మన కళ్ల ముందు జరుగుతోంది. అత్యంత బలమైన సైనిక శక్తుల్లో ఒకటైన రష్యాను.. చిరుదేశమైన ఉక్రెయిన్ దీటుగా ఎదుర్కొంటోంది! రెండున్నరేళ్లకు పైబడి సాగుతున్న ఈ యుద్ధంలో.. రష్యా లక్షలాది మంది సైనికులను కోల్పోయింది! అంతేకాదు.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారి తన భూభాగాన్ని సైతం కోల్పోయింది.

- సెంట్రల్ డెస్క్

ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర మొదలై దాదాపు 30 నెలలు గడుస్తోంది! భౌగోళికంగా ప్రపంచంలోనే అతి పెద్ద దేశం (1,71,25,191 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం.. 16 దేశాలతో సరిహద్దులను కలిగి ఉంది).. 11.5 లక్షల సైనిక బలం, అణ్వాయుధాలు ఉన్న దేశం.. వచ్చి మీదపడిపోతే ఉక్రెయిన్ లాంటి చిట్టి దేశం ఎన్నాళ్లు పోరాడగలదని మొదట్లో చాలా మంది భావించారు! కానీ.. అలా అనుకున్నవారందరి అంచనాలూ తారుమారయ్యాయి! తనపై ముప్పేట దాడికి దిగిన అంత పెద్ద దేశాన్నీ ఉక్రెయిన్ ముప్పతిప్పలు పెట్టి మూడు సముద్రాల నీళ్లు తాగిస్తోంది. నాటో దేశాల సహకారంతో దెబ్బతీస్తోంది! అత్యుత్సాహంతో, ఆత్మవిశ్వాసంతో ఈ యుద్ధాన్ని మొదలుపెట్టిన రష్యా.. తానే ఎక్కువ నష్టాలను చవిచూస్తోంది. యుద్ధం మొదలైన తొలినాళ్లలో ఉన్న జోరు ఇప్పుడు లేదు. మూణ్నాలుగు రోజుల క్రితం ఉక్రెయిన్‌కు చెందిన 110 డ్రోన్లను నేలకూల్చినట్టు రష్యా ప్రకటించిందిగానీ.. తనకున్న పరిమిత వనరులతో వ్యూహాత్మకంగా పోరాడుతున్న జెలెన్‌స్కీ సైన్యందే పై చేయిగా ఉందనడంలో సందేహం లేదు. 2022 ఫిబ్రవరిలో మొదలైన ఈ యుద్ధంలో ఇప్పటిదాకా.. రష్యా సైనికులు 2 లక్షల మంది ప్రాణాలు కోల్పోగా 4 లక్షల మంది తీవ్రంగా గాయపడినట్టు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. అంటే చనిపోయినవారు, గాయపడ్డవారు అంతా కలిపి 6 లక్షల మందికిపైగా సైన్యాన్ని రష్యా కోల్పోయినట్టు లెక్క! ఈ నేపథ్యంలోనే.. పుతిన్ ఈ ఏడాది మేలో రక్షణ మంత్రి సెర్గి షోయిగును పదవి నుంచి తొలగించారు! కోల్పోయిన సైనికుల స్థానంలో కొత్తవారిని తీసుకునేందుకు.. రష్యా ఆర్మీ నియామక ప్రక్రియను వేగవంతం చేసింది. స్వచ్ఛందంగా సైన్యంలో చేరాలంటూ ప్రజలకు పిలుపునిస్తోంది. దేశమంతటా ఎక్కడపడితే అక్కడ.. సైనిక నియామకాలకు సంబంధించి 'సమాచార కేంద్రాల'ను ఏర్పాటు చేస్తోంది. రష్యాలో సైన్యంలో కాంట్రాక్ట్ పద్ధతిలో చేరాలనుకునేవారికి ఏడాదికి 30 లక్షల రూబుళ్ల నుంచి 53 లక్షల రూబుళ్ల (రూ.27 లక్షల నుంచి రూ.48 లక్షల) దాకా వన్‌టైమ్ చెల్లింపు చేస్తామని.. నెలవారీ జీతంగా ఇచ్చే 7 లక్షల రూబుళ్లకు ఇది అదనమని ప్రకటనలు చేస్తోంది. అంతకుముందు నెలవారీ వేతనం సగటున 63,060 రూబుళ్లుగా ఉండేది. అంతేనా.. 'రిఫర్ ఏ ఫ్రెండ్' ఆఫర్ కూడా నడుస్తోందక్కడ. అంటే, ఇప్పటికే సైన్యంలో చేరినవారు మరొకరిని చేరిస్తే.. వారికి బోనస్‌గా మరికొంత సొమ్ము ముట్టజెప్తున్నారు. మెట్రో స్టేషన్ల ముందు మొబైల్ రిక్రూట్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసి మరీ యువతను సైన్యంలోకి తీసుకుంటున్నారు. అలాగే.. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న నేరగాళ్లను, అండర్ ట్రయల్ ఖైదీలను సైతం సైన్యంలో చేర్చుకోవడానికి వీలుగా రష్యా చట్టసభ సభ్యులు ఒక బిల్లును ఆమోదించారు. యుద్ధంలో సాహసోపేతంగా పోరాడి పతకాలు సంపాదిస్తే.. వారిపైనున్న నేర రికార్డులను తొలగిస్తామని హామీ ఇచ్చారు.



ఉక్రెయిన్ సైన్యం

భారతీయులనూ మోసం చేసి..

సైనికుల కొరత నేపథ్యంలో.. విదేశీ యువకులను సైతం సైన్యంలో చేర్చుకోవడానికి రష్యా వెనుకాడట్లేదు. దీంతో కొందరు ఏజెంట్లు.. 'రష్యాలో హెల్పర్, సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగాలు.. నెలకు రూ.లక్షన్నర జీతం' అంటూ మోసపూరిత ప్రకటనలతో పలువురు భారతీయులను కూడా అక్కడికి తరలించిన సంగతి తెలిసిందే! అలా వెళ్లినవారిలో మన తెలుగువారు కూడా ఉన్నారు! తొలుతవారికి తుపాకులు కాల్చడంలో శిక్షణ ఇచ్చి.. రోజుకు 15 గంటలు పనిచేయించుకునేవారు. వారు తమ కుటుంబసభ్యులకు ఫోన్ చేసి గోడు వినిపిస్తే.. ప్రధాని మోదీ రష్యాకు వెళ్లినప్పుడు వారిని తిరిగి భారత్‌కు పంపించాలని కోరారు. దీంతో అక్కడి సైన్యం తొలి విడతగా 45 మంది భారతీయులను యుద్ధభూమి నుంచి వెనక్కి రప్పించి, భారత్‌కు పంపింది. మరో 40-50 మంది దాకా మనవాళ్లు ఇంకా అక్కడే ఉన్నారు.

రష్యా నష్టాలపై ఉక్రెయిన్ లెక్కలివీ..

యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటిదాకా రష్యా కోల్పోయిన సైనికులు, యుద్ధ ట్యాంకులు, యుద్ధనౌకలు, విమానాల సంఖ్యకు సంబంధించి 2024 అక్టోబరు 20న 'జనరల్ స్టాఫ్ ఆఫ్ ఉక్రెయిన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్' ఒక ప్రకటన చేశారు. దాని ప్రకారం..

6,78,520	రష్యా కోల్పోయిన సైనికులు
9,047	యుద్ధట్యాంకులు
18,111	ఆర్మర్డ్ ఫైటింగ్ వెహికల్స్
26,987	వెహికల్స్ అండ్ ఫ్యూయెల్ ట్యాంక్స్
19,565	ఆర్టిలరీ సిస్టమ్స్
1,232	మల్టిపుల్ లాంచ్ రాకెట్ సిస్టమ్స్
978	ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్
369	విమానాలు
329	హెలికాప్టర్లు
17,287	డ్రోన్లు
28	యుద్ధనౌకలు, ఓడలు
1	జలాంతర్గామి

భూభాగాన్నీ కోల్పోయి..

యుద్ధం మొదలైన తొలినాళ్లలో తన భూభాగంలోకి వచ్చిన రష్యన్ సేనలను వ్యూహాత్మకంగా నిర్వీర్యం చేసిన ఉక్రెయిన్.. ఈ ఏడాది ఆగస్టు 6 నుంచి రష్యా భూభాగాలను ఆక్రమించడం ప్రారంభించింది. 'ఆపరేషన్ వైట్ ట్రయాంగిల్' పేరుతో.. ఇప్పటిదాకా 1500 చదరపు కిలోమీటర్లకు పైగా రష్యన్ భూభాగాన్ని ఉక్రెయిన్ స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత.. ఇంత భారీగా రష్యా భూభాగం విదేశీ ఆక్రమణకు గురికావడం ఇదే మొదటిసారి. ఇదిలా ఉండగానే.. ఉక్రెయిన్ చేతికి నాటో దేశాల నుంచి ఎఫ్16 యుద్ధ విమానాలు అందడం మొదలైంది. నిజానికి.. ఉక్రెయిన్‌కు ఎఫ్-16లు ఇస్తే అది ప్రపంచయుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉందని అమెరికా, యూరప్ దేశాలు తొలుత కొంత సంశయించాయి. కానీ.. రష్యా ప్రస్తుత పరిస్థితిని బట్టి ఆ అవకాశం లేదని గ్రహించి ఇప్పుడు ఇవ్వడం మొదలుపెట్టాయి. రష్యావాటిని ఎంతవరకూ ఎదుర్కోగలదు? వాటికెలా ప్రతిస్పందిస్తుంది? అనే విషయాలను గమనించాక, తాను కూడా ఉక్రెయిన్‌కు ఎఫ్-16లు ఇవ్వాలని అమెరికా భావిస్తున్నట్టు సమాచారం. అమెరికా దగ్గర వాడని పాత ఎఫ్-16లు 700 నుంచి 900 దాకా ఉన్నాయి. వాటితోపాటు.. ఏఐతో పనిచేసే ఎఫ్-16లను కూడా ఉక్రెయిన్‌లో దించే ఆలోచనలో అమెరికా ఉన్నట్టు సమాచారం. ఇవి రిమోట్‌తో పనిచేస్తాయి. వాటిని ప్రత్యక్ష యుద్ధంలో పరీక్షించాలని అమెరికా భావిస్తోందని.. అందుకే ఉక్రెయిన్‌కు ఇచ్చే చాన్స్ ఉందని రక్షణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అవి రంగంలోకి దిగితే.. కథే మారిపోతుంది!!

బయటపడలేక.. లోపల ఉండలేక..

బాస్ఫరస్ జలసంధిని టర్కీ మూసేయడంతో నల్లసముద్రంలో ఇరుక్కుపోయిన రష్యా నౌకలు



రష్యా 'బ్లాక్ సీ ఫ్లీట్' పేరొందిన నౌకాదళంలో.. ఫ్రిగేట్లు, కార్వెట్లు, క్షిపణి ఓడలు, మైన్‌స్వీపర్లు ఇలా అన్నీ కలిపి 50 దాకా సర్ఫేస్ వార్‌షిప్పులు ఉంటాయి. వాటితో పాటు.. ల్యాండింగ్ షిప్స్ ఆయిలర్స్, టగ్స్, సర్వే, ఇంటెలిజెన్స్, ఆక్సిలరీ నౌకలు, ఆరు జలాంతర్గాములు ఉంటాయి. వాటన్నింటిలో కలిపి 25 వేల మంది దాకా సిబ్బంది పని చేస్తుంటారు. అంతటి అమేయశక్తినీ ఉక్రెయిన్ తన డ్రోన్, క్షిపణి దాడులతో వెనక్కి తగ్గేలా చేయగలిగింది. రష్యాకు చెందిన పలు పెద్ద నౌకలను ధ్వంసం చేసేసింది. మరి అంత నష్టం జరగకముందే రష్యా తన నౌకలను అక్కడి నుంచి వేరొకచోటకు ఎందుకు తరలించలేకపోయిందంటే.. దానికి కారణం టర్కీ. ప్రపంచపటాన్ని ఒకసారి పరిశీలిస్తే.. రష్యా, ఉక్రెయిన్, టర్కీ, బల్గేరియా, రోమేనియా, జార్జియా, మాల్డోవా దేశాల నడుమ ఒక బెలూన్ ఆకారంలో 'నల్ల సముద్రం' కనిపిస్తుంది. రష్యా నౌకలు మధ్యధరా సముద్రం గుండి ఇతర దేశాలతో వాణిజ్యసంబంధాలు నెరపాలంటే.. టర్కీ అధీనంలో ఉన్న బాస్ఫరస్, డార్డనెల్లెస్ జల సంధుల గుండానే జరపాల్సి ఉంటుంది. అసలు నల్ల సముద్రం నుంచి రష్యా నౌకలు బయటకు రావాలంటే ఆ జలసంధి గుండానే రావాలి. అంతటి కీలక జలసంధులను.. జెలెన్ స్కీ విజ్ఞప్తి మేరకు టర్కీ మూసేయడంతో రష్యాకు దెబ్బ పడింది.

నిప్పులు కక్కే డ్రాగన్ డ్రోన్లు



తమ దేశం మీద దండయాత్ర చేసిన రష్యాను నిలువరించడానికి ఉక్రెయిన్ ప్రధానంగా వాడుతున్నది.. డ్రోన్ టెక్నాలజీనే! యుద్ధం తొలి దశల్లో రష్యన్ యుద్ధ ట్యాంకులను పేల్చేయడానికి డ్రోన్లనే వాడింది. ఆ తర్వాత కూడా.. రకరకాల డ్రోన్లను వినియోగించింది. తాజాగా.. 'డ్రాగన్ డ్రోన్'లతో రష్యాకు దడ పుట్టిస్తోంది. చైనీస్ పురాణాల్లో ఉండే డ్రాగన్‌ల లాగా.. నిప్పులు కక్కే డ్రోన్లు ఇవి. యుద్ధరంగంలో శత్రువుల మీద, శత్రు భూభాగంలో.. 2,200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉండే థెర్మైట్‌ను (అల్యూమినియం పొడి, ఐరన్ ఆక్సైడ్‌ల మిశ్రమం) స్ప్రే చేస్తూ ముందుకు సాగిపోతాయి! ఆ డ్రోన్లు నిప్పులు కక్కిన దారిలో జీవం అంటూ ఏదీ మిగలదు! కన్నుమూసి తెరిచేలోపు అక్కడంతా కరిగిపోతుంది!! రైల్వే ట్రాకుల వెల్డింగ్ కోసం జర్మన్ కెమిస్ట్ ఒకరు 1890ల్లో ఈ థెర్మైట్‌ను అభివృద్ధి చేశారు. కానీ, జర్మనీ దీన్ని మొదటి ప్రపంచయుద్ధంలో బ్రిటన్‌పై దాడికి ఉపయోగించింది. రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ, దాని మిత్ర దేశాలు వినియోగించాయి. ఇప్పుడు అదే థెర్మైట్‌ను ఉక్రెయిన్. డ్రోన్ల ద్వారా వినియోగిస్తోంది.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, పక్కన డీఎస్పీ రాజేంద్రప్రసాద్

ప్రేమోన్మాది అరెస్టు

- మూడు ప్రత్యేక బృందాలతో గాలింపు
- 24 గంటల్లోనే అదుపులోకి.. రిమాండుకు తరలింపు
- ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచిన ఇంటర్ విద్యార్థిని
- నిందితుడిని ఉరి తీయాలి: బాధితురాలి తల్లిదండ్రులు
- పెళ్లి చేసుకోమన్నందుకే హత్య!
- పథకం ప్రకారమే దారుణం: ఎస్పీ

కడప క్రైం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రేమోన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన ఇంటర్ విద్యార్థిని(16) ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచింది. శనివారం కడప జిల్లా బద్వేలులో ఇంటర్ విద్యార్థినిపై నిందితుడు విఘ్నేశ్ పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. 80 శాతం గాయాలైన బాధితురాలిని కడప రిమ్స్‌కు తరలించగా అర్ధరాత్రి 2.30 గంటలకు మరణించింది. నిందితుడు విఘ్నేశ్‌ను 24 గంటల్లోనే అరెస్టు చేశామని కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం ఆయన మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. పెళ్లి చేసుకోవాలని బాలిక కోరడంతోనే పథకం ప్రకారం విఘ్నేశ్ ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించి దారుణంగా హత్య చేశాడని ఎస్పీ తెలిపారు. విఘ్నేశ్ ఇంటి సమీపంలోనే బాలిక కుటుంబం నివసిస్తోందని, ఐదేళ్ల నుంచి బాలికతో విఘ్నేశ్‌కు పరిచయం ఉందని చెప్పారు. కొన్ని కారణాల వల్ల ఇరువురు విడిపోయారని, నిందితుడు ఆరు నెలల క్రితం మరో యువతిని ప్రేమపెళ్లి చేసుకున్నాడని తెలిపారు. శుక్రవారం రాత్రి బాలికకు ఫోన్ చేసి కలవాలని ఉందని, నువ్వు రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడని, దీంతో బాలిక శనివారం బద్వేలు టౌన్‌కు వచ్చిందని వెల్లడించారు. ముందే పథకం రచించుకున్న విఘ్నేశ్.. బ్యాగులో పెట్రోల్ బాటిల్ పెట్టుకుని వచ్చాడని, ఇద్దరూ ఆటోలో సెంచురీ ప్లైవుడ్ ఫ్యాక్టరీ సమీపానికి వెళ్లారని, అక్కడ ఆటో దిగి అడవిలోకి వెళ్లారని, తరువాత బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పారు. తనను కూడా పెళ్లి చేసుకోవాలని బాలిక కోరడంతో నిందితుడు ఆమెపై పెట్రోలు పోసి నిప్పంటించి అక్కడి నుంచి పారిపోయినట్టు తెలిపారు. మూడు ప్రత్యేక బృందాలతో గాలించి ఆదివారం మధ్యాహ్నం కడప డీటీసీ వద్ద నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించామని చెప్పారు. నిందితుడు ఉపయోగించిన బాటిల్, లైటరు స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా.. అల్లారుముద్దుగా పెంచుకుని, ఉన్నత చదువులు చదివించాలనుకున్న తమ కుమార్తెను దారుణంగా హత్య చేసిన నిందితుడిని ఉరి తీయాలని బాలిక తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. నిందితుడికి కఠిన శిక్ష పడినప్పుడే తమ కుమార్తె ఆత్మ శాంతిస్తుందంటూ విలపించారు.

శిక్ష.. ఒక హెచ్చరికలా ఉండాలి!

- బద్వేల్ ఘటనపై అధికారులకు సీఎం సూచన
- ఇంటర్ విద్యార్థిని మృతిపై చంద్రబాబు విచారం
- ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరపాలని ఆదేశం

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా బద్వేల్‌లో ఇంటర్ విద్యార్థినిపై పెట్రోల్ పోసి, నిప్పంటించి, ఆమె మరణానికి కారణమైన నిందితుడిని వెంటనే శిక్షించేందుకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విద్యార్థిని మృతిపై ఆదివారం 'ఎక్స్' వేదికగా సీఎం విచారం వ్యక్తం చేశారు. 'ఈ ఘటన నన్ను ఎంతగానో కలచివేసింది. బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరం. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థిని ఒక దుర్మార్గుడి దుశ్చర్యకు బలైపోయింది. నిందితుడిని అరెస్టు చేశామని జిల్లా అధికారులు తెలిపారు. ఈ కేసులో వేగంగా విచారణ పూర్తి చేసి, నిందితుడికి మరణశిక్ష స్థాయి శిక్ష పడేలా చూడాలని అధికారులను ఆదేశించాను. మహిళలు, ఆడబిడ్డలపై అఘాయిత్యాలు చేసే వారికి ఈ ఘటనలో పడే శిక్ష ఒక హెచ్చరికగా ఉండాలని అధికారులకు సూచించాను. బాధిత కుటుంబానికి న్యాయం చేయడం అంటే హంతకుడిని త్వరగా, చట్టబద్ధంగా, కఠినంగా శిక్షించడమే. అందుకు ప్రత్యేక కోర్టులో ఫాస్ట్ ట్రాక్ విధానంలో కేసు విచారణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించాను' అని సీఎం వెల్లడించారు. కాగా, విద్యార్థిని మృతిపై బీసీ సంక్షేమశాఖ మంత్రి, కడప ఇన్‌చార్జ్ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాలిక కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

భారతీయ భాషల పునరుజ్జీవానికి కృషి

- వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు వెల్లడి
- నెల్లూరులో అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్



అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ సంస్థ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

నెల్లూరు(విద్య), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): భారతీయ భాషల పునరుజ్జీవానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని విక్రమ సింహపురి విశ్వ విద్యాలయం(వీఎస్‌యూ) ఉపకులపతి ఆచార్య సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. నెల్లూరులోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ సభ 33వ అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన ప్రసంగించారు. భోపాల్ కేంద్రంగా పని చేసే అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ సంస్థ భాషల పరిరక్షణకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. పలు భాషలు అంతరించిపోతున్న దశలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని అన్నారు. తాము కూడా విశ్వవిద్యాలయం తరఫున ప్రోత్సాహం అందించి అనువాద రచనలు చేసేందుకు సహకరిస్తామని తెలిపారు. డీకే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి మాట్లాడుతూ.. కళాశాలలో విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ సంస్థ ఏపీ అధ్యక్షుడు పెరుగు రామకృష్ణ మాట్లాడుతూ.. ఆంగ్ల మాధ్యమం ఆధిపత్యంతో భారతీయ భాషల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోందని తెలిపారు. దీనిని అధిగమించేందుకు భారతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన వార్షిక ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం ఐదు రాష్ట్రాల నుంచి వచ్చిన 30 మంది సాహితీవేత్తలకు సమన్వయశ్రీ, సాహిత్యశ్రీ, సంస్కృతి భూషణ్, భారత్ భాషా భూషణ్, సరస్వతీ సమ్మాన్, రాష్ట్ర భాషా గౌరవ్ సమ్మాన్ పురస్కారాలను అందజేశారు.

తిరుమలలో వైసీపీ ఎమ్మెల్సీ దందా

- 9 వీఐపీ బ్రేక్ టికెట్లు రూ.1.5 లక్షలకు విక్రయం
- ఈ నెల 19న భక్తులతో దర్శనానికి వచ్చిన శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానం
- క్యూలైన్‌లో డిక్లరేషన్‌పై సంతకం
- భక్తుడి ఫిర్యాదుతో వెలుగుచూసిన బాగోతం
- ఆమెతో పాటు ముగ్గురిపై కేసు నమోదు

తిరుమల/రాయచోటి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటికీ వైసీపీ నేతల అక్రమాలు మాత్రం ఆగడం లేదు. ఆ పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్సీ తిరుమల వీఐపీ బ్రేక్ టికెట్లను రూ.1.5 లక్షలకు విక్రయించిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. టీటీడీ విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన సాయికుమార్ తనతోపాటు తొమ్మిది మందికి వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు కావాలని చంద్రశేఖర్ అనే దళారీని సంప్రదించారు. ఈ క్రమంలో చంద్రశేఖర్.. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన ఎమ్మెల్సీ, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం పీఆర్వో కృష్ణతేజ ద్వారా తొమ్మిది వీఐపీ బ్రేక్ టికెట్లు, వేదాశీర్వచనంతో కలిపి రూ.1.5 లక్షలకు ఒప్పందం చేసుకున్నాడు. అయితే తొమ్మిది మందికి ప్రొటోకాల్ దర్శనాలు చేయించేందుకు ఎమ్మెల్సీ జకియా ఖానం కూడా వారితో కలిసి ఈ నెల 19వ తేదీ ఉదయం దర్శనానికి వచ్చారు. క్యూలైన్‌లో డిక్లరేషన్‌పై సంతకం చేసి దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో అధికంగా డబ్బులు తీసుకున్నారని గ్రహించిన సాయికుమార్.. చంద్రశేఖర్, కృష్ణతేజపై టీటీడీ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. ఎమ్మెల్సీ స్వయంగా దళారీలతో చేతులు కలిపి టికెట్లు విక్రయించినట్టు విచారణలో తేలింది. వెంటనే విజిలెన్స్ అధికారులు నివేదికను తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అందజేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి ఏ1గా చంద్రశేఖర్, ఏ2గా ఎమ్మెల్సీ జకియా ఖానం, ఏ3గా కృష్ణతేజను చేర్చారు. కాగా, ఎమ్మెల్సీ గతంలోనూ ఇదే విధంగా తనకు పరిచయం లేని వ్యక్తులను దర్శనాలకు తీసుకొచ్చినట్టు విజిలెన్స్ విచారణలో గుర్తించినట్టు సమాచారం.



జకియా ఖానం

ఆరోపణలు, కేసు వెనుక కుట్ర: జకియా ఖానం

ఈ వ్యవహారంతో తనకు సంబంధం లేదని జకియా ఖానం తెలిపారు. తనకు ప్రస్తుతం పీఆర్వోలు లేరని, గతంలో ఉన్న పీఆర్వో సక్రమంగా స్పందించకపోవడంతో అతన్ని తొలగించినట్టు తెలిపారు. అప్పటి నుంచి తన వ్యక్తిగత సహాయకుడే ఈ వ్యవహారాలను చూసుకుంటున్నట్టు వెల్లడించారు. గత నాలుగేళ్లుగా తాను ఏనాడూ నిబంధనలు అతిక్రమించలేదన్నారు. తన పరిచయస్తులు, స్నేహితులకు మాత్రమే తిరుమల దర్శనానికి లేఖలు ఇస్తున్నానన్నారు. కృష్ణతేజ, చంద్రశేఖర్, సాయికుమార్ ఎవరో తనకు తెలియదన్నారు. తనపై ఈ ఆరోపణలు, కేసు నమోదు వెనుక ఏదో కుట్ర ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఓ మైనార్టీ మహిళ ఉన్నత స్థానంలో ఉండటం సహించలేకే తనపై ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఏ పార్టీలో ఉన్నా.. నిజాయితీగా నడుచుకునే కుటుంబం తమదని జకియా ఖానం తెలిపారు.

వ్యవసాయానికి విజ్ఞానం తోడు కావాలి

- పరిశోధనల ఫలితాలు ల్యాబ్‌కే పరిమితం కాకూడదు
- విస్తృత స్థాయిలో రైతులకు చేరినపుడే సార్థకం
- 'రైతునేస్తం' పురస్కారాల ప్రదానోత్సవంలో వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య

విజయవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధనా ఫలాలు కేవలం ల్యాబొరేటరీలకు పరిమితం కాకుండా అవి మరింత విస్తృత స్థాయిలో రైతులకు చేరాలని, అప్పుడే నిజమైన రైతు విప్లవం జరుగుతుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. పరిశోధనల ఫలితాలను రైతుల దరికి చేర్చటానికి పత్రికలు, ప్రసార మాధ్యమాలు ఎంతో దోహదపడతాయని, వాటిని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్టులో రైతునేస్తం' వ్యవసాయ మాసపత్రిక 20వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు రైతులకు రైతునేస్తం పురస్కారాలు-2024 అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకయ్యనాయుడు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఓవైపు వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు, మెరుగైన పరిశోధనా ఫలితాలు వస్తున్నాయని, ఇదే సమయంలో మరోవైపు రైతుల సమస్యలను చూస్తుంటే బాధేస్తోందన్నారు. మన పండగ లు, ఆచార వ్యవహారాలన్నీ వ్యవసాయంతో ముడిపడి ఉంటాయన్నారు. రైతులు లేకపోతే ఎవరూ బతకలేరన్న విషయాన్ని గుర్తుంచుకుని అందరూ వ్యవసాయానికి, అన్నదాతలకు మద్దతు పలకాలన్నారు. దేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఆహార కొరత లేకుండా చేయగలిగే శక్తి రైతులకు ఉందన్నారు. వ్యవ సాయం మరింత విస్తృతం కావాలని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. ముఖ్యంగా యువత వ్యవసాయ రంగంలోకి అడుగులు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో కొందరు వ్యవసాయం మాని రచ్చబండలపై కూర్చుంటున్నారని, అది వారికి, సమాజానికి మంచిది కాదన్నారు. మాతృభాష లాగే వ్యవసాయాన్ని కూడా మరిచిపోకూడదన్నారు. వ్యవసాయానికి విజ్ఞానం తోడు కావాలని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలే కాకుండా.. ఇతర సంస్థలు, వ్యక్తులు కూడా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తల కృషిని బయటకు తీసుకొచ్చినప్పుడే వ్యవసాయ రంగానికి నిజంగా మేలు చేసిన వారవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతునేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణంతో బ్రౌన్ కీర్తి అజరామరం చేసిన జానమద్ది

- జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్

కడప (ఎర్రముక్కపల్లె), అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు సూర్యుడుగా కీర్తి గడించిన సీపీ బ్రౌన్‌కు స్మారక చిహ్నంగా గ్రంథాలయాన్ని నిర్మించి బ్రౌన్ కీర్తిని అజరామరం చేసిన మహోన్నత వ్యక్తి డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి శత జయంతి వేడుకలకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. తాను ఈ కార్యక్రమానికి రావడం హనుమచ్ఛాస్త్రి ఆశీర్వాదమేనని అన్నారు. గొప్ప గొప్ప వ్యక్తులకు రాయలసీమ జన్మస్థానమని, అలాంటి గొప్ప వ్యక్తుల్లో హనుమచ్ఛాస్త్రి ఒకరని తెలిపారు. శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 2003లో కడప వచ్చినప్పుడు జానమద్దితో ఏర్పడిన పరిచయాన్ని తర్వాత అనుబంధంగా మారిన తీరును వివరించారు. అనంతరం జానమద్ది సాహితీపీఠం ఆధ్వర్యంలో డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, గుండ్లూరు దత్తాత్రేయశర్మ, సీపీ బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ పార్వతి, అలపర్తి పిచ్చయ్యచౌదరి, డాక్టర్ గానుగపెంట హనుమంతరావు, ఇందిరా ప్రియదర్శిని, యలమర్తి మధుసూదనకు సాహితీ పురస్కారాలు అందించారు.



జస్టిస్ కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న జానమద్ది సాహితీపీఠం నిర్వాహకులు

మైత్రీ మూవీస్ అధినేత ఎర్నేని విరాళం 25 లక్షలు

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధికి దాతల నుంచి విరాళాలు కొనసాగుతున్నాయి. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం చంద్రబాబును కలిసి, మైత్రీ మూవీస్ అధినేత ఎర్నేని నవీన్ రూ.25 లక్షలు, డాక్టర్ సోమరాజు రూ.5 లక్షల చెక్కులు అందజేశారు.

అర్చకుల మధ్య ఆధిపత్య పోరుతో ఆలయానికి తాళాలు



కొత్తపల్లి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీచౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో స్వామికి సేవచేసే విషయంలో ఇద్దరు అర్చకుల మధ్య వివాదం తలెత్తింది. వీరి వైఖరితో ఆలయంలో కైంకర్యాలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈ దేవాలయంలో గతంలో పనిచేసిన రమేష్ అనే అర్చకుడికి, ప్రస్తుతం పనిచేస్తున్న రవితేజ అనే అర్చకుడికి మధ్య సేవల విషయంలో వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో రమేష్ గుడికి తాళాలు వేసి వెంట తీసుకెళ్లారని భక్తులు కొత్తపల్లి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సమస్య పరిష్కారం నిమిత్తం దేవదాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

పిడుగుపాటుకు రైతు, ఆవు మృతి

హిందూపురం అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మండలం పోచనపల్లిలో ఆదివారం పిడుగుపడి రైతు ఉప్పర లక్ష్మయ్య (65) మృతి చెందాడు. అతని పాడి ఆవు కూడా మరణించింది. లక్ష్మయ్య.. తన రెండు ఆవులను మేపేందుకు తీసుకెళ్లాడు. మధ్యాహ్నం వర్షం ప్రారంభమవడంతో ఇంటికి ప్రయాణమయ్యాడు. దారిలో పిడుగుపడడంతో లక్ష్మయ్య, ఓ ఆవు ప్రాణాలు కోల్పోయారు. మరో ఆవు మాత్రం సాయంత్రం ఇంటికి చేరుకుంది. లక్ష్మయ్య, మరో ఆవు రాకపోవడంతో కుటుంబీకులు గాలించగా, పొలాల్లో నిర్జీవంగా పడి ఉండడాన్ని గమనించారు.

కొత్త ప్రిన్సిపాళ్లకు శిక్షణ: ఇంటర్ విద్య కమిషనర్

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇటీవల పదోన్నతులు పొందిన కొత్త ప్రిన్సిపాళ్లకు ఇంటర్ విద్యామండలి శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించింది. ఈ నెల 15 నుంచి 29 వరకు 15 రోజుల పాటు మంగళగిరిలో ఏపీహెచ్ఆర్‌డీలో ఈ శిక్షణ నిర్వహిస్తోంది. ప్రతి బ్యాచ్‌కు 35 మంది చొప్పున ఈ తరగతులకు హాజరవుతున్నట్టు ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ కృతిక శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

పీఆర్‌సీ, ఐఆర్‌పై మంత్రివర్గం చర్చించాలి: ఏపీటీఎఫ్

వేతన సంఘం(పీఆర్‌సీ) పునర్వ్యవస్థీకరణ, ఉద్యోగులకు ఐఆర్‌పై చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీవీ ప్రసాద్, రాధాకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని మంత్రివర్గ భేటీలో చర్చించాలని విన్నవించారు. అలాగే సీపీఎస్ రద్దు అంశాన్ని కూడా అజెండాలో చేర్చాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

మాజీ ఎంపీ ఎంవీవీ ఇంట్లో ముగిసిన ఈడీ సోదాలు

- కీలక డాక్యుమెంట్లు, ఫైళ్లు స్వాధీనం

విశాఖపట్నం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విశాఖలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు ఆదివారం ముగిశాయి. వైసీపీ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నివాసం, కార్యాలయంతోపాటు ఆయన స్నేహితుడు, ఆడిటర్ గన్నమని వెంకటేశ్వరరావు(జీవీ) నివాసం, కార్యాలయంలో ఈడీ అధికారులు శనివారం ఉదయం సోదాలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఏకకాలంలో ఐదు చోట్ల జరిగిన తనిఖీలు ఆదివారం తెల్లవారుజాము మూడు గంటల వరకు ఏకధాటిగా కొనసాగాయి. ఈ సందర్భంగా మనీలాండరింగ్‌కు సంబంధించి కొన్ని కీలక డాక్యుమెంట్లు, ఫైళ్లను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకుని తీసుకెళ్లినట్లు తెలిసింది.

దివ్వల మాధురికి తిరుమల పోలీసుల నోటీసులు



దివ్వల మాధురి

టెక్కలి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సన్నిహితురాలు దివ్వల మాధురికి ఆదివారం తిరుమల పోలీసులు నోటీసులు జారీచేశారు. ఇటీవల తిరుమల మాడవీధుల్లో మాధురి ఫోటో షూట్స్, రీల్స్ చేశారని టీటీడీ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీంతో ఆదివారం తిరుమల వన్‌టౌన్ నుంచి వచ్చిన ఎస్సైలు దీపిక, రమేశ్‌బాబు.. టెక్కలిలోని అక్కవరం సమీపంలో శ్రీనివాస్, మాధురి నివాసం ఉంటున్న ఇంటికి వెళ్లి నోటీసులిచ్చారు. బీఎన్ఎస్ 292, 296, 300 తదితర సెక్షన్ల కింద ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- క్వారీ గోతుల్లో నీట మునిగి ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతి



దుర్గారావు, వెంకటేష్ రాజు

గన్నవరం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు ఇంజనీరింగ్ విద్యార్థులు ఆదివారం ఆటవిడుపుగా ట్రెక్కింగ్‌కు వెళ్లారు. మధ్యాహ్నం వరకూ సరదాగా గడిపారు. పక్కనే ఉన్న క్వారీ గోతుల్లోని నీటిలో స్నానం చేసేందుకు దిగగా, వారిలో ఇద్దరు మునిగిపోయి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం మండలంలోని మాదలవారిగూడెం లింగయాస్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఆరుగురు ఫైనలియర్ విద్యార్థులు ఆదివారం సరదాగా ట్రెక్కింగ్‌కు వెళ్లారు. గుట్ట ఎక్కి దిగడంతో అందరికీ చెమటలు పట్టాయి. పక్కనే ఉన్న తోకతిప్ప క్వారీ గోతుల్లో నీళ్లు ఉండటంతో స్నానం చేసేందుకు వెళ్లారు. కొద్దిసేపటికి ఇద్దరు మునిగిపోవటంతో ఆందోళనకు గురైన మిగిలినవారు కాపాడే ప్రయత్నం చేశారు. ఫలితం లేకపోవడంతో ఎన్డీఆర్ఎఫ్‌కు సమాచారం ఇచ్చారు. వారు వచ్చేసరికి ఇద్దరు మృతిచెందారు. సీఎస్‌ఈ ఫైనలియర్ చదువుతున్న ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం సుబ్బాల గ్రామానికి చెందిన పగడాల దుర్గారావు (21), ఏడీఎస్ ఫైనలియర్ విద్యార్థి తెలంగాణ రాష్ట్రం భువనగిరి జిల్లా యాదాద్రి మండలం రాజానగరం గ్రామానికి చెందిన జొగ్గరాజు వెంకటేష్ రాజు(22) ఈ ఘటనలో మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

'యోధ' ఆవిష్కరణ

హస్మిత ప్రచురణలు, హైదరాబాద్ విమెన్ రైటర్స్ ఫోరం, తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విజయ భండారు సంపాదకత్వంలో 'యోధ - మాతృత్వం: భిన్న వ్యక్తీకరణలు' పుస్తకావిష్కరణ సభ అక్టోబర్ 22 మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత ఓల్గా; ఆవిష్కర్త కె. శ్రీనివాస్; ముఖ్య అతిథి కొలకలూరి ఆశాజ్యోతి; గౌరవ అతిథులు సంధ్య, మామిడి హరికృష్ణ; పుస్తక పరిచయం గోపరాజు సుధ, అపర్ణ తోట, ఘంటశాల నిర్మల, రచన.

గిరిజ పైడిమర్రి

కవి సంధ్య స్వర్ణోత్సవం

'కవి సంధ్య' కవిత్వ పత్రిక 50 సంచికలు పూర్తి చేసుకున్న సందర్భంగా అక్టోబర్ 27 ఉ.10 గంటలకు యానాం గీతా భవన్‌లో స్వర్ణోత్సవ సభ జరుగుతుంది. ఈ సందర్భంగా స్వర్ణోత్సవ సంచిక ఆవిష్కరణ; వాడ్రేవు చినవీరభద్రుడు, పాయల మురళీకృష్ణలకు కవితా పురస్కారాలు; పదిమందికి సంధ్య ప్రతిభా పురస్కారాల ప్రదానం; శిఖామణి మలయాళ కవిత్వ గ్రంథావిష్కరణ; కవి సమ్మేళనం ఉంటాయి. సభలో మల్లాడి కృష్ణారావు, దీర్ఘాశి విజయ్ భాస్కర్, సి. మృణాళిని, వీరలక్ష్మీదేవి, ఆర్. సీతారాం తదితరులు పాల్గొంటారు.

కవి సంధ్య

రొట్టమాకురేవు కవిత్వ అవార్డు

రొట్టమాకురేవు కవిత్వ అవార్డు – 2024 సభ అక్టోబర్ 27 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత ప్రసేన్; ముఖ్య అతిథి కె. శివారెడ్డి; వక్తలు లక్ష్మీనరసయ్య గుంటూరు, పేర్ల రాము. షేక్ మహమ్మద్ మియా స్మారక అవార్డును ఏనుగు నరసింహారెడ్డి ('నీడలదృశ్యం'); పురిటిపాటి రామిరెడ్డి స్మారక అవార్డును అరుణ నారదభట్ల ('లోపలి ముసురు'); కె.ఎల్. నర్సింహారావు స్మారక అవార్డును తండా హరీష్ గౌడ్ ('గాలిలేని చోట'), సాంబమూర్తి లండ ('నాలుగురెక్కల పిట్ట') అందుకుంటారు.

యాకూబ్

'నానీ కిరణాలు' ఆవిష్కరణ

కంచనపల్లి రవికాంత్ కవితా సంపుటి 'నానీ కిరణాలు' ఆవిష్కరణ సభ అక్టోబర్ 27 ఉ.10గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి, ఆవిష్కర్త ఎన్. గోపి; అధ్యక్షులు ఎస్. రఘు; విశిష్ట అతిథి సూర్యా ధనంజయ్; గౌరవ అతిథి జి. శ్యాంప్రసాద్ లాల్; ఆత్మీయ వాక్యాలు తగుళ్ల గోపాల్, తండ హరీష్ గౌడ్.

బోధి ఫౌండేషన్

బొమ్మలు: అక్బర్

శ్రమ వెలిగించిన అక్షరం



రోజుకి పద్దెనిమిది గంటలు వంచిన నడుము ఎత్తకుండా పనిచేస్తూ శక్తిని హోటల్ పనికే ధారపోసిన ఆ భావుకుడు, పుట్టిన తర్వాత సరైన తిండీ, గుడ్డా ఎరగనని రాసుకున్నాడు. స్వతంత్రం వచ్చాక ఇలాగ ఉండదని ఆశించానని వాపోయాడు. కాఫీలు, బీడీలతోనే బతికిన శారద చిట్టచివరి వరకూ తన శక్తినీ, రక్తాన్నీ తెలుగు సాహిత్యం కోసమే ధారపోశాడు. ఇంతా చేసి అతడు బతికింది ముప్పై సంవత్సరాలు మాత్రమే.

తెలుగు సాహిత్యంలో చెరగని మహోన్నత చరిత్ర శారద. సరిగ్గా వంద సంవత్సరాల క్రితం తెలీని తేదీన తమిళనాడులోని పుదుకోట్టైలో పుట్టిన ఎస్. నటరాజన్ 88 ఏళ్ళ క్రితం 1937లో ఒక చలికాలం ఉదయం కడుపు చేత పట్టుకుని తెనాలిలో కాలుమోపాడు. అప్పటికే ఆంధ్రా ప్యారిస్‌గా ప్రసిద్ధి చెందిన తెనాలి శారదకి కూడా హోటల్ పనివాడిగా ఓ దారి చూపింది. ఆసక్తితో తెలుగు నేర్చుకున్నాడు. అనురక్తితో అభ్యుదయ సాహిత్యం చదువుకున్నాడు. అలా ఎందరో మిత్రుల్ని అక్కున చేర్చుకున్నాడు. స్వశక్తితో కలం పట్టి సగటు మనిషి పక్షం చేరాడు. ప్రజాపక్ష రచయితగా వందకి పైబడి కథలు, పదుల సంఖ్యలో నవలలు రాశాడు శారద అనబడే ఎస్. నటరాజన్.

తమిళనాడు ప్రభావంతో తెనాలిలో అప్పుడప్పుడే వెలుస్తున్న కాఫీ హోటళ్ళలో పనివాడిగా మొదలుపెట్టి అనేక అవతారాలు ఎత్తాడు. సర్వర్‌గా, వంట పనివాడిగా ప్రారంభించి ప్రెస్ వర్కర్‌గా పత్రికలు, పుస్తకాలు అమ్మడం; గారెల దుకాణం; మజ్జిగ వ్యాపారం వరకూ ఎన్నో పనులు చేసాడు. అంతేనా, 'ప్రజావాణి' పత్రిక నుంచి 'చంద్రిక' పత్రిక స్థాపన దాకా పాత్రికేయుడిగా సాహితీ ద్రష్టగా రూపొందాడు. అల్లూరి సీతారామరాజు, కన్నెగంటి హనుమంతుల జీవిత ఆదర్శాలతో ఏకంగా సినిమాలు తీయాలని తపించాడు. మొట్ట మొదటి హోటల్ వర్కర్ల సంఘం వ్యవస్థాపకుల్లో ఒకరయ్యాడు. కాంగ్రెస్‌తో మొదలై సోషలిస్టు, రాడికల్ హ్యూమనిస్టు ధోరణులను కూడా ప్రత్యక్షంగా చూసి స్వతంత్ర ఆలోచనాపరుడిగా కమ్యూనిజాన్ని ఎంచుకున్నాడు. తెలుగులో శ్రమజీవి వైపు నిల్చే రచనా వ్యాసంగాన్ని సృష్టించిన విశిష్టమైన దార్శనికుడిగా ఎదిగాడు.

రోజుకి పద్దెనిమిది గంటలు వంచిన నడుము ఎత్తకుండా పనిచేస్తూ శక్తిని హోటల్ పనికే ధారపోసిన ఆ భావుకుడు, పుట్టిన తర్వాత సరైన తిండీ, గుడ్డా ఎరగనని రాసుకున్నాడు. స్వతంత్రం వచ్చాక ఇలాగ ఉండదని ఆశించానని వాపోయాడు. కాఫీలు, బీడీలతోనే బతికిన శారద చిట్టచివరి వరకూ తన శక్తినీ, రక్తాన్నీ తెలుగు సాహిత్యం కోసమే ధారపోశాడు. ఇంతా చేసి అతడు బతికింది ముప్పై సంవత్సరాలు మాత్రమే. అందులోనూ అతడి రచనలు చేసిన కాలం మొత్తం ఏడేళ్ళే. అంత చిన్న వయసులో ఒకవైపు నిత్యం బతకడానికి పోరాటం చేస్తూనే మరోవైపు తెలుగు భాషా సాహిత్య సారస్వతాల్ని శ్రామిక వర్గ దృక్పథంతో నిరంతరం సుసంపన్నం చేసిన రచయిత మరొకరు లేరు.

అప్పటికే పాత్రికేయుడిగా తండ్రి వారసత్వం, తమిళ నాట వెలువడిన ఆంగ్ల అనువాద ప్రగతిశీల సాహిత్య ప్రభావం శారద మీద ఉంది. జీవితం నేర్పిన అసంఖ్యాక చేదు అనుభవాలు ఉన్నాయి. ఆదికాక చలం, కుటుంబరావు తదితర అభ్యుదయ రచయితల పుస్తకాలనీ చదివాడు. ఆ స్ఫూర్తితోనే 'ప్రపంచానికి జబ్బు చేసింది' అనే తొలి రచనతో ప్రజాశక్తిలో కలాన్ని ఝుళిపించి తనదైన గొంతుకతో నినదించిన శారద తన శరీరాన్ని తొలిచేస్తున్న మూర్ఛ జబ్బుకి బలై పోయాడు. అభ్యుదయ రచయితల సంఘంలో "రచనకు తగిన పారితోషికం పొందడం రచయిత హక్కు" అంటూ బహుశా మొట్టమొదటిసారిగా తీర్మానం పెట్టిన శారద అవే ఆర్థిక బాధలతో అస్తవ్యస్త సమాజంలో అసహాయంగా అశువులు బాసాడు.

"పత్రికలవారు కథలు రాస్తే ఇచ్చే డబ్బులు నా మూర్ఛ రోగాన్ని నయం చేసుకోడానికన్నా సరిపోతాయేమోనని సంతోషించాను. అదీ వట్టిదై పోయింది. ఈ పద్ధతిలో నేను స్వతంత్ర భారత పౌరుణ్ణని భావించలేకపోవడంలో నా తప్పేమీ లేదనుకుంటాను" అంటూ, సరిగ్గా 75ఏళ్ళ క్రితం 1949 ఫిబ్రవరిలో 'తెలుగు స్వతంత్ర' పత్రికలో 'నాదైన సమస్యలు' పేరిట శారద రాసుకున్న చివరి వాక్యాలివి. అసలా వ్యాసమే "నాకు అనిపిస్తుంది అప్పుడప్పుడు. ఈ చాకిరీ చేస్తూ ఇట్లా ఆలోచనలు చేస్తే తొరగా చచ్చిపోతానని," అంటూ ప్రారంభిస్తాడు. చనిపోయే నాటికి నిండు గర్భవతియైన భార్యా, ఇద్దరు పిల్లలు ఉన్న శారదకి మరణించిన తర్వాత కూడా తెలుగు సాహిత్యం, పాలకులు ఏమేరకు సముచిత స్థానం ఇచ్చారనేది ప్రశ్నార్థకమే.

వాస్తవ జీవన సమరం కావిస్తూ, దుర్భర దారిద్ర్యంతో సంఘర్షించాడు కనుకనే సమసమాజం కోసం స్వప్నించిన నిబద్ధత కలిగిన విప్లవ స్వాప్నికుడు కాగలిగాడు శారద. అందుకే వ్యవస్థలోని ఆధిపత్య రూపాలన్నింటినీ రచనలుగా మల్చి మానవ సంబంధాల్లోని అసమానతల్ని అక్షరీకరించాడు. దైనందిన జీవితంలోని ఒడిదుడుకుల్ని, సామాన్యులకి ఎదురయ్యే సమస్యలను నిజాయితీగా చర్చించాడు. ఒకనాటి తెలుగు సాహిత్య సాంస్కృతిక రాజకీయార్థిక సమాజానికి ప్రతిబింబంగా నిలిచే ఎన్నో రచనలు చేసాడు.

ప్రస్తుతం శారద సంతానం పెద్ద వాళ్ళయ్యారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆ మధ్య కొందరు ఔత్సాహికులు పూనుకుని శారద రచనలు ప్రచురించారు. కొన్ని విశ్వవిద్యాలయాల్లో శారద రచనలు విద్యార్థులకి పాఠ్యాంశంగా కూడా పెట్టారు. అయితే, తెలుగు భాషపై మక్కువతో తెలుగు సాహిత్యం మీద మమకారంతో తమిళ నాట పుట్టి మూడు పదుల వయసులోనే జీవన యవనిక నుంచి నిష్క్రమించిన ఒక యువ ఆలోచనాపరుడు, తత్వవేత్త, మేధావి, పాత్రికేయుడు, కథకుడు, రచయిత, వ్యాసకర్త, అన్నింటికీమించి తెలుగు భాషను గుండెల్లో పెట్టుకుని ప్రేమించిన నిష్కళంక శ్రమజీవిగానే శారదని గుర్తించడం సబబు. అంతకంటే ముఖ్యంగా, తెలుగు ప్రాంతంలో క్రియాశీల ఆరంభ సామ్యవాదుల్లో ఒకడిగా, కమ్యూనిస్టు కార్యకర్తగా జీవితాన్ని మల్చుకునే క్రమంలో ఆచరణలోనే అక్షర కక్ష్యల్ని చేధించిన అరుదైన యోధుడిగా శారదని స్మరించుకోడమే సముచితం.

శారద పుట్టిన సంవత్సరం 1924 అనీ 1925 అనీ వాదనలు ఉన్నాయి. చనిపోయింది మాత్రం 1955 ఆగష్టులో. ఆలూరి భుజంగరావు గారు రచించిన శారద జీవితచరిత్ర, ఆయన కథలతో కలిపి 'స్మృతి శకలాలు' పేరిట మొదటిసారి 40ఏళ్ళ క్రితం 1985లో, రెండోసారి పదిహేనేళ్ళ క్రితం 2009లో తెలుగులో వచ్చింది. ఆయన జీవితం, రచనల గురించి పరిశోధించి పట్టాలు పొందిన వాళ్ళు కూడా ఎందరో ఉన్నారు. అయినప్పటికీ అవిశ్రాంతంగా ఈ నేల మీద ఉవ్వెత్తున ఎగసిన శారద అక్షర ప్రభంజనాన్ని అంచనా వేయాల్సిన బృహత్కార్యం ఇంకా మిగిలే ఉంది.

(శారద శతజయంతి సందర్భంగా)

■ గౌరవ్
✆ 90320 94492



కలల్ని అంటుకడుతో...

ఏనాడూ అడగకండి
ఓ కామ్రేడ్ ఎలా చనిపోతాడని?
ఓ చెట్టులా,
ముందతన్ని ఇంటి నుండి పెకలించారు
వెలుతురూ వాన
మబ్బులూ గాలీ లేకుండా
అండాసెల్‌లో నిర్బంధించారు.
రాజ్యం చెట్టు
రసాన్ని పీల్చి పిప్పి చేసి
మాయమయ్యేలా చేస్తుంది.
రచయితలు తమ
మరణ యోగ్యతా పత్రాలను రాస్తారు
కొంచెం కొంచెంగా,
నెమ్మదిగా,
వైద్యపరంగా,
సూక్ష్మంగా.
వాళ్ళు ఒక చెట్టును చంపగలరు
కానీ
అతని చక్రాల కుర్చీ చక్రాలకు
అతని సిరాతో అంటుకట్టినట్టు
వేనవేలుగా విస్తరించిన వాటి వేర్లనెలా చంపగలరు?
కామ్రేడ్ మరణానికి ఎప్పుడూ దుఃఖపడకండి
చుట్టూ చూడండి
ఎల్లప్పుడూ చెట్టు తన ఆకులను
ఈలలా ఊదుతున్నట్టు
కనుగొంటారు మీరు
యుద్ధం ఇంకా నడుస్తూనే ఉంది
సాయిబాబా ఎన్నటికీ మరణించడు.

ఇంగ్లిష్ మూలం ■ మౌమితా ఆలం
తెలుగు అనువాదం ■ అరుణాంక్ లత
arunank.latha@gmail.com

నాకు విమర్శ కూడా సృజన ప్రక్రియే!

చదువు ముచ్చట

నండూరి రాజగోపాల్



ఈమధ్య చదివిన/ చదువుతున్న పుస్తకం?

'Post truth' అని లీ మెక్‌ఇంటైర్ పుస్తకం చదివాను. కె.ఎన్.వై. పతంజలినీ, వర్తమాన ప్రపంచాన్నీ, రచనలనీ ఈ కాన్సెప్ట్ నేపథ్యంలో అర్థం చేసుకోవడం, విశ్లేషించగలగడం నాకు బావుంది.

బాల్యంలో మొదటిసారి ఏ పుస్తకం ఇష్టంగా చదవటం గుర్తుంది?

బుచ్చి బాబు గారు బహుశా నేను మొదట చదివిన రచయిత. 1989లో నేను ఇంటర్‌లో ఉండగా తొలిసారి, ఆ తరువాత చాలాసార్లు ఆయన నవల, కథలు, వ్యాసాలు చదువుతూనే ఉన్నాను. ఈ సాహిత్య ప్రపంచంలోకి నన్ను తీసుకువచ్చిన రచయిత ఆయన.

మిమ్మల్ని వ్యక్తిగతంగా ప్రభావితం చేసిన రచయిత?

మళ్ళీ అదే సమాధానం. బుచ్చిబాబు గారు, ఇంకా పతంజలి శాస్త్రి గారు– ఈ ఇద్దరూ జీవితాన్ని ఎటువంటి పరదాలూ లేకుండా అన్ని వైపుల నుండి, అన్ని లోతుల నుండి చూడడం కొనసాగించారు. ఇప్పుడు కూడా పతంజలిశాస్త్రి గారు కథకి కొత్త సాంకేతికత, కొత్త భాష అద్ది నా లాంటి పాఠకులను విస్మయపరుస్తూనే ఉన్నారు.

తెలుగులో మీకు బాగా నచ్చిన విమర్శ పుస్తకం?

ఇది చెప్పడం కష్టం అండి. ఎందుకంటే నాకు వ్యక్తిగతంగా విమర్శ కూడా సృజన ప్రక్రియగా అనిపిస్తుంది. మనకు అరవైయ్యవ దశకం నుండి తొంభైయ్యవ దశకం వరకు వచ్చిన వ్యాస సంపుటాలు అన్నీ దాదాపు 'ఫార్ములా, దానికి వివరణ' లాగే వచ్చాయి. ప్రతిదానికీ ఏదో ఒక సిద్ధాంత నేపథ్యం ఉంది. ఇది తప్పని నేను అనడం లేదు. కానీ ఇది ఒక్కటే విమర్శ కాదు. వీరభద్రుడు గారి తొలి రెండు విమర్శ గ్రంథాలు 'సహృదయునికి ప్రేమలేఖ', 'సాహిత్యం ఎందుకు' ఈ రెండూ ఖచ్చితంగా ఆయా రచనలకు కొత్త పాఠకులను పరిచయం చేస్తాయి.

సాహిత్యంలో మీకు నచ్చిన కల్పిత పాత్ర?

భమిడిపాటి జగన్నాథ రావు గారి కథ 'మువ్వలు'లో ఒక రెండు నిమిషాలు వచ్చి వెళ్ళి పోయే పాత్ర ఒకటి ఉంది. కథ మొత్తాన్ని ఈ పాత్ర ప్రభావితం చేస్తుంది. ఒక అప్రధాన పాత్ర, జస్ట్ కాజువల్‌గా వచ్చినట్టుగా కనపడే ఈ పాత్ర అంటే నాకు ఇప్పటికీ ఫస్ట్ క్రష్ అంత ఇష్టం.



'వేలుపిళ్లై' రాసిన సి. రామచంద్రరావు గారిని కలిసి, 'మీరు మళ్లీ ఎందుకు కథలు రాయలేదు' అని అడగాలని ఉంది.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?

'వేలుపిళ్లై' రాసిన సి. రామచంద్రరావు గారిని కలిసి, 'మీరు మళ్లీ ఎందుకు కథలు రాయలేదు' అని అడగాలని ఉంది.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?

నేను మొదట్లో పుస్తకాల మీద వచ్చిన విమర్శను ముందు చదివి, ఆ తరువాత ఆ రచనలని చదివేవాడిని. ఇప్పుడు రచనలను ముందు చదువుతున్నాను. అంతే కాదు వర్తమాన కాలానికి సంబంధించి ఒక అలెర్ట్‌నెస్ కూడా ఇవాళ రచయితలకు, పాఠకులకు అవసరం. అందువల్ల సృజనాత్మక రచనలతో పాటు, ఇతర సామాజిక, రాజకీయ, ఆర్థిక, మత సంబంధిత గ్రంథాలు కూడా చదవాల్సిన అవసరం ఉందని గ్రహించాను. బహుశా ఇది చెయ్యకపోతే ఏ గ్రంథాన్ని మనం పూర్తిగా విశ్లేషించలేం.

(నండూరి రాజగోపాల్ విమర్శకుడు, 'చినుకు' పత్రిక సంపాదకుడు. ఆయన పుస్తకాలు– సాహిత్య పరామర్శ వ్యాసాల సంపుటి 'అనంతరంగాలు', సంపాదకీయ వ్యాసాల సంపుటాలు 'మొదటి పేజీలు', 'వర్తమానం'.)

I refuse to die

మరణించేది లేదని తెగేసి చెప్పాక
నా సంకెళ్ళు తెగాయి

జైలు బయటికి వచ్చి
విశాల మైదానాల్లో అడుగుపెట్టిన వెంటనే
గడ్డిపరకల్ని చూసి నవ్వాను

నా చిర్నవ్వును సహించలేక
మళ్ళీ సంకెళ్ళకు పనిచెప్పారు

మళ్ళీ మళ్లీ మృత్యువును తిరస్కరిస్తుంటే
నా జీవితమే వాళ్ళకి తలనొప్పిగా మారింది
విసుగెత్తి నన్ను వదిలేసారు.

మరోసారి ఆకుపచ్చలోయల్లోకి అడుగుపెట్టాను
పొడుస్తున్న పొద్దుకింద
తలెగరేస్తున్న గడ్డిపోచల్ని నవ్వుతూ పలకరించాను

చెరగని నా చిర్నవ్వు చూసి
వాళ్ళకి చిర్రెత్తుకొచ్చింది
మళ్ళీ అదే బందిఖానా

మళ్లీ అదే మరణాన్ని తిరస్కరించే మొండితనం
విచారించాల్సిన విషయం ఏంటంటే
నన్నెలా చంపాలో కూడా వాళ్ళకి తెలియదు

ఎందుకంటే
మొలకెత్తె గడ్డిపువ్వుల నవ్వడిని
ప్రేమించడం తెలుసు నాకు.

ఇంగ్లిష్ మూలం ■ జి.ఎన్. సాయిబాబా
తెలుగు అనువాదం ■ శివప్రసాద్

ప్రాంతాల్ని దాటిన నాటి సాహితీ సామరస్యం!

"నిజామ్ రాష్ట్రంలో కవులు పూజ్య"మని ముడుంబ రాఘవాచార్యులు దురహంకారాన్ని ప్రదర్శిస్తే, గోలకొండ కవుల సంచిక ద్వారా 'సురవరం' తెలంగాణ ప్రాంత సాహిత్య ప్రతాపాన్ని చూపించాడు. తెలంగాణ భాషను నిందించిన వారిని నిలదీయాల్సిందే. కానీ ఇక్కడ భాషా సాహిత్యాల గురించి సమున్నతంగా స్పందించిన వారిని కూడా యాది చేసుకోవాలి. సీమాంధ్ర ప్రాంతానికి చెందిన కొంతమంది పాతతరం కవి పండితులు, తెలంగాణ ప్రాంత భాషా సాహిత్యాల ఔన్నత్యాన్ని ప్రశంసించారు. ప్రాంతాలకు అతీతంగా తెలంగాణ సారస్వత ఘనతను కీర్తించారు.

"కోస్తాంధ్ర ప్రాంతానికి చెందిన ఎంతోమంది కవులు, పండితులు, సాంస్కృతిక కార్యకర్తలు తెలంగాణ వికాసానికి నడుం బిగించారు. ఇక్కడి సాంస్కృతిక ఉద్యమాలతో మమేకమయ్యారు" ('ఆత్మకథల్లో ఆనాటి తెలంగాణ') అని గుమ్మన్నగారి బాల శ్రీనివాస మూర్తి గుర్తు చేశాడు. "ప్రాణంబైనది తెల్గుగడ్డకు ధరా ప్రాలంబమౌనీ తెలంగాణము/ విన్నాణంబైన కవిత్వసంపదలకు" కేంద్రబిందువని ('కీర్తితోరణం') డెబ్బయ్యో దశకంలోనే ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి వ్యాఖ్యానించాడు. ఈ భూమిపై కాలుపెడితే శరీరము పులకరిస్తుందని తెలంగాణ, వరంగల్ ప్రాంత సాంస్కృతిక, చారిత్రక, కళా వైశిష్ట్యానికి ఆనాడే హనుమచ్ఛాస్త్రి కీర్తితోరణాలను అలంకరించాడు. "తెలుగు దేశ చరిత్రకు తెలంగాణ విత్తనమని" కొమర్రాజు లక్ష్మణరావు ఈ ప్రాంత ప్రాధాన్యతను ఎంతో దార్శనికతతో విశ్లేషించాడు.

ప్రాచీన కాలం నుండి తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల సాహిత్య స్వరూప స్వభావాలు విభిన్నంగా ఉన్నాయని పింగళి లక్ష్మీకాంతం 'రంగనాథ రామాయణం' పీఠిక (1942)లో పేర్కొన్నాడు. ఆంధ్ర ప్రాంతంలో మార్గ పద్ధతిలో, తెలంగాణలో దేశి పద్ధతిలో ప్రధానంగా కవితా సృజన సాగిందని, లక్ష్మీకాంతం వివరించాడు. భౌగోళిక కారణాల రీత్యా సంస్కృత సాహిత్యానుకరణం, తరువాత బెంగాల్ సాహిత్య ప్రభావం ఆంధ్రప్రాంత కవుల రచనల్లో కనిపిస్తుందని ఆయన వివరించాడు. "తమ ప్రాంతంలో మహోదారమైన జీవితములు గడిపిన వీరుల చరిత్రలే" ఇతివృత్తాలుగా మలుచుకొని, తెలంగాణ సాహిత్య కారులు తాతల నాటి తల్లి భాషలో రచనలు చేశారని తెలంగాణ భాషా సాహిత్యాల విశిష్టతను, విలక్షణతను, అందుకు గల కారణాలను పింగళి లక్ష్మీకాంతం సముచితంగా వివేచించాడు.

కృష్ణా జిల్లా నుండి వలస వచ్చిన శేషాద్రి రమణ కవులు తెలంగాణలో స్థిరపడి ఈ ప్రాంత చరిత్ర, సాహిత్య చరిత్ర, సంస్కృతుల పరిశోధనకు తమ జీవితాలను అంకితం చేశారు. "తెలంగాణ పరిశోధనోద్యమ, శేషాద్రి రమణ కవులు పర్యాయ పదాలు అన్నా అతిశయోక్తి కాదు" అన్న ('తెలంగాణ సాహిత్యవికాసం') కె. శ్రీనివాస్ మాటల్లో శేషాద్రి రమణకవుల అపురూపమైన పరిశోధనా కృషి అర్థమవుతుంది. వందేళ్ళ క్రితమే శేషాద్రి రమణ కవులు కాలికి బలపం కట్టుకొని తెలంగాణలో పర్యటించి నిజాము రాష్ట్రంలో పరిశుద్ధమైన ఆంధ్ర భాషా స్వరూపం కనిపిస్తుందని వేయి కన్నులతో పరిశీలించి, తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్రను తవ్వి పోశారు. 'నిజాం రాష్ట్ర కావ్య ప్రశంస' కావ్యంతో తెలంగాణ సాహిత్య వైభవానికి శేషాద్రి రమణ కవులు నీరాజనాలు పలికారు. 'పరిశోధనా వ్యాస మంజరి' గ్రంథం ద్వారా ఈ ప్రాంత చరిత్రపై కొత్త వెలుగులు ప్రసరించారు.

ఆదిపూడి సోమనాథరావు గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన కవి. వీరికి గద్వాల, మునగాల సంస్థానాలతోపాటు హైదరాబాద్ నగరంతో, శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయంతో ప్రగాఢ అనుబంధం ఉంది. "అచ్చ తెనుంగు కబ్బమునకాది పదంబయి పొల్చు భాగ్యమున్నెచ్చుగ గన్న దేశమిది". ఆది నుండి అచ్చ తెలుగు భాష తెలంగాణలో విలసిల్లిందని సోమనాథ రావు స్పష్టంగా ప్రకటించాడు. "ఉరుదు శారద యూరేగు ధరణి లోన/ తెలుగుబిబ్బోకవతి పేరు నిలుపుచున్న సరసులకు మీకు వలపుటంజలి ఘటింతు" ('మధుకణాలు' జాషువ సర్వలభ్య రచనల సంకలనం) అంటూ తెలంగాణ ప్రాంత సాహిత్యానికి, కవులకు జాషువ కితాబు ఇచ్చాడు. ఉర్దూ సాహిత్యం ఊరేగుతున్న ప్రాంతంలో, తెలుగు సాహిత్యానికి సేవ చేసే సరస సాహితీవేత్తలకు జాషువ 'వలపుటంజలి' ఘటించాడు. "తెలంగాణలో గొప్ప త్రోవలో కవితా సంచారము సాగుతుంది" అని పల్లా దుర్గయ్య పాలవెల్లి కావ్యానికి రాసిన ముందు మాటలో విశ్వనాథ ప్రశంసించాడు. "తెలంగాణలో మాట్లాడే తెలుగుభాషకు కొన్ని ప్రత్యేకతలు, కొంత వైశిష్ట్యము ఉన్నది" అని తెలంగాణ రచయితల మహాసభల్లో (1953) శ్రీశ్రీ సముచితంగా ప్రకటించాడు. మిగతా ప్రాంతాలవారు పరిహసిస్తారని సందేహించకుండా తెలంగాణ రచయితలు తమ ప్రాంత ప్రజల దైనందిన జీవిత భాషనే రచనలల్లో ప్రయోగించాలని సూచించాడు. తెలుగుకు వెలుగునిచ్చింది తెలంగాణ ప్రాంతమేనని అడవి బాపిరాజు విశ్వసించాడు.




సీమాంధ్ర ప్రాంతానికి చెందిన కొంతమంది పాతతరం కవి పండితులు ప్రాంతాలకు అతీతంగా తెలంగాణ సారస్వత ఘనతను కీర్తించారు. అలాగే అప్పటి నిజాం కాలం నుండి తెలంగాణ సాహితీవేత్తలు, సంస్థలు ఆంధ్ర ప్రాంత కవి పండితులను సమాదరించిన విషయం కూడా మరిచి పోలేనిది.

"చాలా మంచి తెలుగు పదాలు తెలంగాణ, రాయలసీమ గ్రామగ్రామాల్లో ఉన్నాయి. వాటిని సాదరంగా స్వీకరించి అందరూ అందుకొని ఉపయోగించాలి" (పందిరి మల్లిఖార్జున రావు శత జయంతి సంపుటం) అని జమ్మలమడుగు మాధవ రామ శర్మ కవి పండితులకు హితవు చెప్పాడు. ప్రకాశం జిల్లా ఏదుబాడు నుండి వచ్చి, నల్లగొండ జిల్లా చండూరులో స్థిరపడిన అంబటిపూడి వెంకట రత్నం ఈ ప్రాంత సాహిత్యానికి ఎనలేని సేవ చేశాడు. 'సాహితీ మేఖల' సంస్థను స్థాపించి, దాశరథి, దేవులపల్లి రామానుజరావు లాంటి కవుల గ్రంథాలను ప్రచురించాడు. నైజాము రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల కొత్త తరం కవులకు సాహితీమేఖల ఒక వేదిక లాగా ఉపయోగ పడిందని రామానుజారావు అభినందించాడు. జయధీర్ తిరుమలరావు సంపాదకత్వంలో వెలువడిన 'సురవరం ప్రతాపరెడ్డిగారి సన్నిధికి కవిపండితులు రాసిన లేఖలు' పుస్తకం చదివితే ప్రతాపరెడ్డితో, తెలంగాణతో అప్పటి సీమాంధ్ర ప్రాంత రచయితలకు ఉండే సాహిత్య అనుబంధం అవగతమవుతుంది. అయితే రాయప్రోలు సుబ్బారావు, కురుగంటి సీతారామయ్య ఎంతోకాలం తెలంగాణలో ఉన్నప్పటికి ఈ ప్రాంత భాషాసాహిత్యాలను గౌరవించ లేదని తెలంగాణవాదులు విమర్శించారు.

తెలంగాణలోని భాషా సాహిత్యాల విశిష్టతను అర్థం చేసుకోవడంతోపాటు ఇక్కడి పోరు తత్వానికి ఆంధ్ర ప్రాంతకవులు అక్షర జేజేలు పలికిన సందర్భాన్ని తలుచుకుంటేనే మహోన్నత స్ఫూర్తి కలుగుతుంది. "తెలంగాణ తెలంగాణ ధీరుల మొగసాల/ తెలంగాణ తెలంగాణ విప్లవోజ్వల గాథ" అని ఆవంత్స సోమసుందర్ సాయుధ పోరాటానికి 'వజ్రాయుధా'న్ని అందించాడు. "తెలంగాణ, గగనాన అరుణ తారై వెలుగు/ ఆ తార వెలుగులోనే మము నడుపుమో స్వాతంత్ర్య దేవీ" అంటూ పులుపుల వెంకట శివయ్య ఆదర్శనీయమైన ఈ ప్రాంత ఉద్యమ సోయిని అక్షర బద్ధం చేశాడు. ఆరుద్ర, గంగినేని, బొల్లిమంత శివరామ కృష్ణ, తుమ్మల వెంకట్రామయ్య తదితర అభ్యుదయ కవులెందరో తెలంగాణ పోరాటాన్ని కలమెత్తి గళమెత్తి గానం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా కొంతమంది సీమాంధ్రకవులు 'కావడి కుండలు' సంఘీభావ కవిత్వంతో జై కొట్టిన విషయం జగద్విదితం.

అప్పటి నిజాం కాలం నుండి తెలంగాణ సాహితీవేత్తలు, సంస్థలు ఆంధ్ర ప్రాంత కవి పండితులను సమాదరించిన విషయం కూడా మరిచి పోలేనిది. సీమాంధ్ర ప్రాంతానికి చెందిన దళిత, బహుజన కవుల గురించి సంగిశెట్టి శ్రీనివాస్ ఎన్నో వ్యాసాలు రాశాడు. ఆంధ్రాలో సాగిన సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, సాహిత్య ఉద్యమాలతో తెలంగాణ కవులు కలిసి నడిచి ప్రజాచైతన్యాన్ని ప్రజ్వలింప జేశారు. ఈ దిశగా ప్రత్యేకంగా అధ్యయనం జరగవలసిన అవసరముంది.

■ కోయి కోటేశ్వరరావు
✆ 94404 80274

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5




డ్రోన్లొచ్చాయ్!

ఆకాశం అదిరేలా రేపు, ఎల్లుండి డ్రోన్ షో

- బబ్బూరి గ్రౌండ్స్‌కు చేరిన 5 వేల డ్రోన్లు
- షోకు సిద్ధం చేస్తున్న నిర్వాహకులు
- సెన్సార్లు, బ్యాటరీలు తనిఖీ
- పూర్తి కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ద్వారా డ్రోన్ షో

వీక్షకుల కోసం పున్నమి ఘాట్‌లో గ్యాలరీలు ఏర్పాటు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడకు డ్రోన్లొచ్చాయ్.. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదు వేల డ్రోన్లు వచ్చాయ్. ఆకాశమే హద్దుగా మంగళ, బుధవారాల్లో షో నిర్వహిం చేందుకు డ్రోన్లన్నీ సిద్ధమయ్యాయి. ఆదివారం బబ్బూరి గ్రౌండ్స్‌కు పెద్ద ఎత్తున డ్రోన్ ఆపరేటర్లు చేరుకున్నారు. పూర్తి కంప్యూటరైజ్డ్ విధానంలో నడిచే ఈ డ్రోన్ షోకు డ్రోన్లను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. డ్రోన్లను సీరియల్ నంబర్‌గా వరుస క్రమంలో పెడుతున్నారు. డ్రోన్లలోని బ్యాటరీలను తీసి ఫుల్ చార్జింగ్ పెట్టడంతో పాటు వాటిని కూల్ చాంబర్లలో ఉంచుతున్నారు. మొత్తం ఐదు వేల డ్రోన్లలో ఏ ఒక్క డ్రోన్ కూడా షో సందర్భంలో ఇబ్బంది పెట్టకుండా ఉండటానికి వీలుగా వాటిని సంసిద్ధం చేస్తున్నారు. ఈ డ్రోన్లన్నీ కూడా పూర్తి సెన్సార్లతో కూడుకుని ఉంటాయి. ఒక డ్రోన్‌కు మరో డ్రోన్ టచ్ కాకుండా ఉంటాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ద్వారా సెన్సార్లకు వచ్చే సిగ్నల్స్ ఆధారంగా డ్రోన్లు ముందుకు కదులుతాయి. డ్రోన్ షోలో ప్రదర్శించే చిత్రాలను ముందుగా ప్రోగ్రామింగ్ చేస్తారు. సెన్సార్లకు వచ్చే సిగ్నల్స్ ద్వారా వెంటనే నిర్ణీత ప్రదేశాలలో డ్రోన్లు ఉంటాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ఇచ్చే ఆకృతిలో ఏ డ్రోన్ ఎక్కడ ఉండాలో సెన్సార్ల ద్వారా ఆయా డ్రోన్లకు సంకేతాలు అందుతాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ద్వారా ఆకాశంలో డ్రోన్లు చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. డ్రోన్లకు ఉండే సెన్సార్లు చాలా సున్నితంగా ఉంటాయి. సెన్సార్లు దెబ్బతింటే 'షో' కు ఇబ్బంది ఎదురవుతుంది. అందువల్ల సెన్సార్ల పనితీరును ఆదివారం డ్రోన్ ఆపరేటర్లు పరీక్షించారు. ఇలా ఐదు వేల డ్రోన్లకు సంబంధించిన సెన్సార్లను పరీక్షించారు.

వీక్షకుల కోసం ప్రత్యేక గ్యాలరీలు

డ్రోన్ షో ఈవెంట్‌కు భారీగా తరలివచ్చే సందర్శకుల కోసం మరో వైపు పున్నమి ఘాట్‌లో పెద్ద ఎత్తున గ్యాలరీల నిర్మాణం చేపడుతున్నారు. ఈ గ్యాలరీలలో భారీ సంఖ్యలో సీటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. వీవీఐపీలు, వీఐపీలు, సందర్శకుల కోసం వేర్వేరుగా గ్యాలరీలు సిద్ధం చేస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు

బబ్బూరి గ్రౌండ్స్‌లో వీక్షకులకు ఆనందాన్ని పంచేందుకు పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వీటి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు ముంబై డ్యాన్సర్లతో ప్రత్యేక షో నిర్వహించనున్నారు.



భళారే ఖిల్లా

కొండపల్లి కోటకు దశాబ్దాల చరిత్ర

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో ఒకటిగా గుర్తింపు

- కట్టిపడేస్తున్న ప్రకృతి అందాలు.. జలపాతాల హొయలు
- నాడు టీడీపీ పాలనలో రూ.10 కోట్లతో ప్రత్యేక హంగులు
- కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం వచ్చేనా!


పచ్చని చెట్లు.. ఎత్తైన కొండలు.. హొయలొలికే జలపాతాలతో ప్రకృతి ప్రేమికుల మనస్సు దోచుకుంటోంది కొండపల్లి ఖిల్లా. తెలుగు నాట ఎంతో ప్రాచుర్యం పొందిన గిరిదుర్గం దశాబ్దాల చరిత్రకు ఆనవాలుగా భాసిల్లుతోంది. శత్రుదుర్భేద్యమైన ఈ దుర్గం మూడంస్తుల రాతి బురుజు, భారీ ప్రాకారం, రాజమహల్, రాణి మహల్, నర్తనశాల, అంగడి, కారాగారం, ఆయుధాగారం, కొలనులు, కళాఖండాలు, వీరుపాక్షి దేవాలయం, లోతైన జలాశయం, ధాన్యాగారం ఇలా అనేక చారిత్రక ఆధారాలకు నిలయంగా కొనసాగుతోంది. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాల్లో ఒకటిగా వెలుగొందుతోంది. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం రూ.10 కోట్లు వెచ్చించి కోటకు కొత్త రూపు తీసుకువచ్చింది. పర్యాటకులు మెచ్చిన పచ్చని 'కోట'పై ప్రత్యేక కథనం.

8

వీఎంసీ నోటీసులు.. ఆడిట్ అలక!


స్టేట్ ఆడిట్ కార్యాలయం

దసరా ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయన్న ఆనందంలో ఉన్న దుర్గగుడి అధికారులకు ఇటు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, అటు ఆడిట్ శాఖ షాక్ ఇచ్చాయి. కోట్ల రూపాయల పన్నులు చెల్లించాలంటూ కార్పొరేషన్ అధికారులు నోటీసులు ఇవ్వగా, అమ్మవారి దర్శనం సరిగా చేయించలేదని పెట్టిన బిల్లులు చేయకుండా ఆడిట్ అధికారులు అలక వహించారు. దీంతో బిల్లులు అవ్వక, పన్నులు కట్టలేక దుర్గగుడి అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులు చొరవచూపి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



దుర్గగుడిపై రెండు శాఖల ముప్పేట దాడి

రూ.5.34 కోట్ల పన్ను కట్టాలని దుర్గగుడికి వీఎంసీ నోటీసు

మహామండపం, రాజగోపురానికి రూ. 2.36 కోట్లు

- సీవీ రెడ్డి చారిటీస్‌కు రూ.2.98 కోట్లు చెల్లించాలని స్పష్టం
- దసరాలో మమ్మల్ని పట్టించుకోలేదంటూ ఆడిట్ అధికారుల అలక
- దసరా బిల్లులు నిలిపివేత.. తలలు పట్టుకుంటున్న దుర్గగుడి అధికారులు

(విజయవాడ/వన్‌టౌన్-ఆంధ్రజ్యోతి) శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంపై రెండు ప్రభుత్వ శాఖలు ముప్పేట దాడికి దిగాయి. భారీ మొత్తంలో పన్ను బకాయిలు చెల్లించాలని దుర్గగుడికి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఆదివారం డిమాండ్ నోటీసులు ఇచ్చారు. సుమారు రూ.5.34 కోట్లు చెల్లించాలంటూ దుర్గగుడి ఈవో రామారావును నేరుగా కలిసి కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ సృజన, సర్కిల్ -1 సహాయ కమిషనర్ ఎలీనా ఈ నోటీసులు అందజేశారు. రాజగోపురం, మహామండపం నిర్మాణం చేసినప్పటి నుంచి పన్ను చెల్లించాలని నోటీసులో పేర్కొనడంతో దుర్గగుడి అధికారులు కంగుతిన్నారు. 2025 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరం వరకు రూ.2.36 కోట్లు బకాయిలు చెల్లించాని నోటీసులో తెలిపారు. వన్‌టౌన్ పాడి వీధిలోని సీవీరెడ్డి చారిటీస్‌కు చెందిన నిర్మాణాలకు 2011 నుంచి రూ.2.98 కోట్లు బకాయిలు ఉన్నాయని స్పష్టం చేశారు. గతేడాది సీవీరెడ్డి చారిటీస్ నిర్మాణాలకు సంబంధించి రూ.39 లక్షల పన్నును దుర్గగుడి అధికారులు చెల్లించారు. అనంతరం ఈ అంశాన్ని దేవదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆ సమయంలో దేవదాయశాఖ కమిషనర్ హిందూ ధార్మిక సంస్థలకు చెందిన నిర్మాణాలకు నోటీసులు ఇవ్వరాదంటూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజా నోటీసులు కలకలం రేపుతున్నాయి. వీఎంసీ అధికారులు ఆదివారం నోటీసులు జారీ చేసి మహామండపంలోని అన్ని అంతస్థులు, అక్కడ ఉన్న షాపులను పరిశీలించారు.

ఇంద్రకీలాద్రిపై ఇటీవల జరిగిన దసరా మహోత్సవాలలో తాము అమ్మవారి దర్శనానికి వస్తే రాచమర్యాదలు చేయలేదన్న కారణంగా విజయవాడ బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డిలో ఉన్న స్టేట్ ఆడిట్ కార్యాలయం అధికారులు దుర్గగుడికి సంబంధించిన బిల్లులు వేటినీ మంజూరు చేయకుండా నిలిపివేసినట్లు సమాచారం. ప్రీ ఆడిట్ చేయకుండా బిల్లులు తొక్కి పెట్టడంతో దసరా పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కాక ఆలయ అధికారులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దసరా మహోత్సవాలలో అమ్మవారి దర్శనం కోసం వీఐపీలకు టైం స్లాట్‌లను కేటాయించారు. వివిధ పాయింట్ల నుంచి వీఐపీలు వచ్చేందుకు ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేశారు. దీనిపై విస్తృత ప్రచారం కూడా చేశారు. అయితే దుర్గగుడికి చెందిన జమ్మిదొడ్డి కార్యాలయంలోనే ఉంటున్న స్టేట్ ఆడిట్ కార్యాలయం నుంచి కొందరు అధికారులు ఈనెల 10న అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. ఆడిట్ విభాగం కోసం ఒక కారును కేటాయించారు. అయితే మరో కారుకు కూడా పాస్ అడిగారు. దుర్గగుడికి వచ్చే వీఐపీల తాకిడి దృష్ట్యా రెండో కారుకు పాస్ ఇవ్వలేకపోయారు. ఈ నేపథ్యంలో 10న అమ్మవారి దర్శనం కోసం వచ్చిన ఆడిట్ అధికారులను ఓం టర్నింగ్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వారి వద్ద రూ 500 టికెట్లు కూడా లేకపోవడంతో దర్శనానికి అనుమతించలేదు. ఆడిట్ అధికారులు తాము నేరుగా వెళ్లాల్సిందేనని, తమకు ప్రొటోకాల్ వర్తిస్తుందని పోలీసులతో చెప్పారు. వారితో అరగంట పాటు వాగ్వాదం జరిగినా ఆడిట్ అధికారులు అక్కడే ఉండిపోయారు. ఇంతలో విషయం తెలుసుకున్న దుర్గగుడి అధికారులు వారి వద్దకు వచ్చి దగ్గరుండి అమ్మవారి దర్శనం చేయించారు. ఈ విషయంపై తీవ్ర మనస్థాపానికి గురైన ఆడిట్ అధికారులు ఇప్పుడు దుర్గగుడికి చెందిన దసరా బిల్లులను వేటినీ ప్రీ ఆడిట్ చేయకుండా నిలిపివేశారు. దుర్గగుడి అధికారులు అడుగుతున్నా సమాధానం ఇవ్వడం లేదు. పెద్ద మొత్తాలకు సంబంధించిన బిల్లులు ఆగి పోవడంతో దసరా పనులు చేసిన వాళ్లకు చెల్లింపుల కోసం తమపై ఒత్తిడి పెరుగుతోందని దుర్గగుడి అధికారులు చెబుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అమ్మవారి దర్శనానికి వస్తే రాచమర్యాదలు చేయలేదని..



భూమి, రైతుతోనే మానవాళి మనుగడ

- రైతునేస్తం అవార్డుల ప్రదానోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

6లో



స్వచ్ఛత జీవితంలో భాగం కావాలి

స్వచ్ఛతా హి సేవ వాక్‌థాన్‌లో హీరో సుధీర్‌బాబు

6లో

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు తల్లీకుమారుడు దుర్మరణం

తండ్రి, మరో కుమారుడికి గాయాలు

- గరికపాడు కేవీకే సమీపంలో ఘటన
- దుర్గమ్మను దర్శించుకుని హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదం
- విశాఖపట్నం వాసులుగా గుర్తింపు


ఘటనాస్థలంలో కార్లు

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా రెండు కారులు ఢీకొని తల్లీకొడుకు దుర్మరణం చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా గరికపాడు కేవీకే సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్టణానికి చెందిన ఇళ్ల నాగ వెంకట మల్లికార్జునరావు, భార్య నాగలక్ష్మి(55), కుమారులు శ్రీకాంత్(35), చైతన్యలతో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. కుటుంబసభ్యులతో కలిసి విశాఖపట్నం నుంచి రెండు రోజుల క్రితం విజయవాడలో బంధువుల ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయం దుర్గమ్మ దర్శనం చేసుకుని హైదరాబాద్ బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారును అదే మార్గంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న శ్రీకాంత్, నాగలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందారు. మల్లికార్జునరావు కుడికాలు విరిగిపోగా, చైతన్యకు స్వల్పగాయాల య్యాయి. సీఐ జానకీరాం, చిల్లకల్లు ఎస్సై శ్రీనివాస్ ఘటనాస్థలికి చేరుకుని వాహనాలను రోడ్డు పక్కకు నెట్టించి, మృతదేహాలను జగ్గయ్యపేట ప్రభు త్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు.


శ్రీకాంత్ మృతదేహం


నాగలక్ష్మి మృతదేహం

లెనిన్ సెంటర్ ఆక్రమణ

8లో



దుర్గమ్మ సన్నిధికి పోటెత్తిన భక్తులు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనం కోసం ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పోటెత్తారు. క్యూలలో బారులుతీరి మరీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో రద్దీ ఏర్పడటంతో శీఘ్ర దర్శనం కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

6లో



దుర్గమ్మ దర్శనం కోసం క్యూలలో వేచిఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనం కోసం ఆదివారం వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. క్యూలలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు. రద్దీ ఏర్పడటంతో శీఘ్ర దర్శనం కోసం అధికారులు ఏర్పాటు చేశారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు మొక్కులను తీర్చుకున్నారు. దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఈవో రామారావుతో కలిసి క్యూలో భక్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కల్పిస్తున్న సౌకర్యాలను గురించి భక్తులకు వివరించారు. సామాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.



ఆదివారం పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు, వేదపండితులు లోక కల్యాణం కోరుతూ సూర్యోపాసన సేవచేశారు. సూర్యనారాయణ స్వామి చిత్రపటానికి అర్చనలు చేశారు. అరుణ పారాయణం చేశారు. ఆలయంలో వృద్ధులు, దివ్యాంగులకు మెట్ల మార్గంలో ఏర్పాటు చేసిన వీల్‌ఛైర్ పనితీరును ఈవో రామారావు పరిశీలించారు.

సుబ్బారాయుడి సేవలో దేవదాయశాఖ అదనపు కమిషనర్



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు చంద్రకుమార్‌కు అందజేస్తున్న ఈవో

మోపిదేవి : దేవదాయ శాఖ అదనపు కమిషనర్ బి.చంద్రకుమార్ కుటుంబసమేతంగా మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు చంద్రకుమార్‌కు అందజేశారు.



కళాశాల వసతిగృహంలో భోజనాలను పరిశీలిస్తున్న న్యాయాధికారి

వసతిగృహాల్లో న్యాయాధికారి ఆకస్మిక తనిఖీ

అవనిగడ్డ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాలుగు వసతిగృహాలను అవనిగడ్డ న్యాయాధికారి బాబునాయక్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా? లేదా అన్న విషయమై రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అవనిగడ్డలోని బీసీ బాలికల వసతిగృహం, సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహం, బాలికల వసతిగృహాన్ని, కళాశాల విద్యార్థుల వసతిగృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహాల్లో మరుగుదొడ్లు సరిగా ఉన్నాయా, భోజన వసతి ఎలా ఉందనే విషయాలను పరిశీలించారు. వసతిగృహ భవనం శిథిలావస్థకు చేరిన విషయాన్ని పరిశీలించి సంక్షేమ అధికారిణి అనురాధను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట న్యాయవాదులు నరహరిశెట్టి ఈశ్వరరావు, చిట్టిప్రోలు ప్రసాద్, దామెర్ల నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సనకా రఘురామ్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పోలీసు అమరవీరుల ఉత్సవాలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల స్మారకోత్సవాలు సోమవారం నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఎస్పీ ఆర్. గంగాధరరావు తెలిపారు. సోమవారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో విధి నిర్వహణలో అసువులుబాసిన అమరవీరులకు నివాళులర్పిస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొంటారన్నారు. 22 నుంచి 31వ తేదీ వరకు పోలీసు స్టేషన్లలో ఆయుధాలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ నిర్వహిస్తామన్నారు. 24 నుంచి 27 వరకు సైబర్ నేరాలను అరికట్టడంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, కళాశాలలు, పాఠశాలల్లో పోలీసు అధికారులతో చర్చా వేదికలు, దేశభక్తిని చాటే చిత్రాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. 28 నుంచి 30వరకు పోలీసు బ్యాండ్ షోలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. 30న అమరవీరుల కుటుంబాలకు సన్మాన కార్యక్రమం చేపడతామన్నారు. 31న ఏక్‌తాదివస్ కార్యక్రమం కింద ఉదయం యూనిట్ రన్, సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

24 నుంచి ట్యాలీ ప్రైమ్ విత్ జీఎస్టీ కోర్సులో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్, సైబర్ గ్రామీణ కంప్యూటర్ శిక్షణా సంస్థలో ఈనెల 24నుంచి ట్యాలీ ప్రైమ్ విత్ జీఎస్టీ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు సంస్థ ఇన్‌చార్జి జి.అంకమ్మరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఫైనాన్షియల్ అకౌంటింగ్ సెక్టార్‌లో మెరుగైన ఉపాధి అవకాశాలు గల ఈ ట్యాలీప్రైమ్ కోర్సులో శిక్షణ పొందేందుకు బీకామ్/ఎంకామ్, బీబీఏ/ఎంబీఏ చదివి, 18నుంచి 35సం. మధ్య వయసుగల తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. కోర్సు కాలవ్యవధి రెండునెలలు, శిక్షణాకాలంలో అభ్యర్థులకు శిక్షణతోపాటు భోజన, వసతి సౌకర్యాలు పూర్తిగా ఉచితమన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందడంలో సంస్థ పూర్తి సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. ఉభయ తెలుగురాష్ట్రాల్లోని నిరుద్యోగయువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9100033552, 9440630051 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పాలకాయితిప్ప గేట్లు మూసివేత

కోడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : హంసలదీవి శివారు పాలకాయితిప్ప బీచ్ గేట్లు ఈ నెల 22వ తేదీ వరకు మూసివేస్తున్నట్టు మెరైన్ సీఐ సతీష్ రెడ్డి తెలిపారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి పాలకాయితిప్పకు వచ్చిన సందర్శకులకు ప్రస్తుతం వాయుగుండం ఉన్నందున బీచ్ గేట్లు మూసివేసినట్టు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి హంసలదీవికి వచ్చే సందర్శకులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.



పాలకాయితిప్ప వద్ద గేట్లు మూసి కాపలా ఉన్న మెరైన్ సిబ్బంది

భూమి, రైతుతోనే మానవాళి మనుగడ

» మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్య, స్వర్ణభారత్ ట్రస్టు ఛైర్మన్, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు

ఉంగుటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతితోపాటు భూమిని కాపాడుకుంటూ, రైతును రక్షించుకుంటూ, పర్యావరణ హితానికి కృషిచేసినప్పుడే మానవజాతికి మనుగడ వుంటుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు స్పష్టంచేశారు. వ్యవసాయరంగంలో అధునాతన శాస్త్రసాంకేతికతలను అందిపుచ్చుకునే విధంగా శాస్త్రవేత్తలు చొరవతీసుకోవాలని, వివిధ రకాల సామాజిక మాధ్యమాల ద్వారా వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులకు మరింత చేరువచేసి, నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు సాధించే దిశగా అన్నదాతలకు ప్రోత్సాహన్నందించాలన్నారు. రైతునేస్తం 20వ వార్షికోత్సవం సందర్భంగా ముప్పవరపు ఫౌండేషన్, రైతునేస్తం సంయుక్త ఆధ్వర్యంలో ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో జరిగిన రైతునేస్తం అవార్డుల ప్రదానోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన ప్రఖ్యాత వ్యవసాయశాస్త్రవేత్త పద్మశ్రీ అవార్డుగ్రహీత స్వర్గీయ ఐవీ సుబ్బారావు పేరిట ఏర్పాటుచేసిన అవార్డులను వ్యవసాయ అనుబంధరంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతుసాధికారసంస్థకు జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయడంతోపాటు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 20మంది ప్రకృతి వ్యవసాయ రైతులను సతీసమేతంగా ఘనంగా సత్కరించి పురస్కారాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కరోనా సమయంలో అన్ని రంగాలు స్తంభించినా, రైతన్నల కాడీ, మేడీ మాత్రమే పనిచేశాయనీ.. మనల్ని రక్షించేది వ్యవసాయం మాత్రమేనని రుజువైందని గుర్తుచేశారు. చదువుకున్న యువత పల్లెబాట పట్టాలన్న ఆయన యువతరం రాకతో వ్యవసాయరంగం అద్భుతాలు సాధిస్తుందన్నారు. గత 20ఏళ్లుగా రైతునేస్తం మాసపత్రిక ద్వారా వ్యవసాయరంగంలో అన్నదాతకు చేదోడుగా నిలవడమేగాక, ఏటా ప్రోత్సాహక అవార్డుల కార్యక్రమాలు, 500పైగా సదస్సులు, శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేసి లక్షలాదిమంది రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలమీద అవగాహన కల్పించేందుకు రైతునేస్తం ఎడిటర్ వేంకటేశ్వరరావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చెక్కభజనతో అందరినీ ఆకట్టుకున్న బాపట్ల జిల్లా మార్టూరు మండలం కొలలపూడి భజన బృందాన్ని ప్రత్యేకంగా అభినందించి రూ. లక్ష బహుమానం అందజేశారు. 'రైతునేస్తం' 20 ఏళ్లపండుగ పురస్కరించుకుని తీసుకువచ్చిన ఆరు పుస్తకాలను ఆవిష్కరించారు.

రైతునేస్తం సంపాదకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్లపల్లి వేంకటేశ్వరరావు మాట్లాడుతూ, గత 11సంవత్సరాలుగా రైతునేస్తం పత్రిక పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెద్దలు వెంకయ్యనాయుడు రావటం సంస్థ పూర్వజన్మ సుకృతమన్నారు. పల్లెల ప్రగతికి ప్రకృతి వ్యవసాయం దారిలో రైతులు సాగాలని, ఉత్పత్తుల మార్కెటింగ్‌కోసం కూడా మావంతు కృషిచేస్తామని చెప్పారు.

రాష్ట్ర రైతుసాధికార సంస్థ పక్షాన జీవన సాఫల్య పురస్కారం అందుకున్న సంస్థ వైస్‌ఛైర్మన్ టి.విజయకుమార్ మాట్లాడుతూ, ప్రగతికి ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్ఫూర్తితో మనరైతులు ఇతర దేశాలలో ప్రకృతి వ్యవసాయం మీద శిక్షణ, అవగాహన కల్పించే స్థాయికి ఎదగటం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో స్వర్ణభారత్‌ట్రస్ట్ ఛైర్మన్ కామినేని శ్రీనివాస్, ట్రస్ట్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛ బందరుకు కలిసి పనిచేద్దాం

» రోడ్లు శుభ్రం చేసిన మంత్రి రవీంద్ర, కూటమి నేతలు



చెరువు గట్టుపై ముళ్ల పొదలు తొలగిస్తున్న మంత్రి రవీంద్ర, కూటమి నేతలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఫొటోలకు ఫోజులిచ్చేవారు కాకుండా నిజంగా పనిచేసేవాళ్లు నాతో పనిచేసేందుకు రండి.. బంగారు, స్వచ్ఛ బందరుగా తీర్చిదిద్దుదాం.. అని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఆదివారం మూడు స్తంభాల సెంటర్ నుంచి చీపుర్లుపట్టి నేతలు రోడ్లు శుభ్రం చేశారు. పంపులచెరువు గట్టుపై పెరిగిన ముళ్ల పొదలను తొలగించారు. సుమారు నాలుగు గంటలపాటు జరిగిన శ్రమదాన కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, బీజేపీ ఇన్‌చార్జి సోడిశెట్టి బాలాజీ, కూటమి నేతలు కొట్టె వెంకట్రావు, మాదివాడ రాము, మోటమర్రి బాబాప్రసాద్, కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, అన్నం ఆనంద్, ఎండీ ఇలియాస్, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని, గనిపిశెట్టి గోపాల్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, మునిసిపల్ కమిషనరు బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. నగరంలో పారిశుధ్య కార్మికులతో కలిసి సమష్టిగా స్వచ్ఛ బందరు కార్యక్రమం చేపడతామన్నారు. జెడ్పీ సెంటర్‌ను శుభ్రం చేద్దామన్నారు. సీఎస్‌ఆర్ ఇతర నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. రూ.100 కోట్లతో పార్కులు, డ్రెయిన్లు, స్మశాన వాటికలు శుభ్రం చేద్దామన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు రూ.200లకే కుళాయి కనెక్షన్ అందిస్తున్నామన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

బాధితులకు అండగా ఉంటానని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం మంత్రి కార్యాలయంలో 14 మంది రోగులకు సీఎంఆర్‌ఎఫ్ నిధుల నుంచి రూ.29 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. పేదల వైద్య సేవలకు అండగా ఉంటామన్నారు. కిడ్నీ బాధితులకు డయాలసిస్, ఆసుపత్రిలో స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు మరువలేనివి..

బుడమేరు వరద బాధితులకు మునిసిపల్ కార్మికులు చేసిన సేవలు.. వారి కాళ్లు కడిగినా రుణం తీర్చుకోలేమని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వరద బాధితులకు సేవలందించిన 250 మంది పారిశుధ్య కార్మికులకు ఆదివారం పంపింగ్ హౌస్ వద్ద రూ. 5లక్షల విలువ గల దుస్తులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 250 మంది మునిసిపల్ కార్మికులకు తనవంతుగా పాదరక్షలు అందిస్తానన్నారు. పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. డంపింగ్ యార్డులో లక్ష టన్నులకు పైగా చెత్త పేరుకుపోయిందని, ఆరునెలల్లో ప్రత్యేక నిధులతో చెత్త సమస్యను తీరుస్తామన్నారు. సీఎం ఆదేశాలతో డంపింగ్ యార్డు స్థలంలో సుందరమైన పార్కు నిర్మిస్తామని, డంపింగ్ యార్డును రుద్రవరం తరలిస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



హైదరాబాద్ నగరంలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

తాడంకి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

» ఘనంగా స్కూల్ వందేళ్ల సంబరానికి ప్రణాళికలు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా తాడంకి జడ్పీ హైస్కూల్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న స్కూల్ పూర్వ విద్యార్థులంతా ఆదివారం వందేళ్ల సంబరాలపై సన్నాహక సమావేశం నిర్వహించారు. నగరంలోని తబలా హోటల్ జరిగిన ఈ కార్యక్రమానికి ఈ స్కూల్‌లో 50వ దశకంలో చదివిన వారు కూడా హాజరై పాత స్నేహితులతో కలిసి గత జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ సందడి చేసారు. ఈ స్కూల్‌లో 1953- 54లో పదోతరగతి బ్యాచ్‌కు చెందిన వ్యాపారవేత్త ప్రభాకరరావు, ప్రకాశరావులతోపాటు పూర్వ విద్యార్థులు రిటైర్డ్ డీఎస్పీ శాంతరామారావు, అనంత లక్ష్మి, ఎస్.వెంకటేశ్వరావు. పి.తిరుమల ప్రసాద్, వై.మస్తాన్‌రావు తదితరులు హాజరయ్యారు. జనవరి 12న తాడంకిలో జరిగే స్కూల్ వందేళ్ల ఉత్సవ వేడుకలకు స్నేహితులంతా తరలివెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ స్కూల్ లో చదువుకున్న ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ప్రముఖ వైద్యులు నోరి దత్తాత్రేయ తదితరులంతా వందేళ్ల సంబరాలకు హాజరుకానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



స్వచ్ఛత జీవితంలో భాగం కావాలి

» ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలి

» వాక్‌థాన్‌లో సినీహీరో సుధీర్ బాబు



వాక్‌థాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న హీరో సుధీర్‌బాబు

విజయవాడ సిటీలైఫ్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : "అందరి జీవితంలో స్వచ్ఛత ఒక భాగం కావాలి.. మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. ఇది నిత్య ప్రక్రియ.. నిరంతరం సాగాలి" అని సినీనటుడు సుధీర్‌బాబు అన్నారు. విజయవాడ ఆదాయపు పన్ను శాఖ 'స్వచ్ఛతా హి సేవ'లో భాగంగా ఆదివారం నిర్వహించిన 'వాక్‌థాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంజీ రోడ్డులో ఉన్న ఆదాయపన్ను శాఖ కార్యాలయం నుంచి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ మొగల్రాజపురంలోని ఆదాయపు పన్నుశాఖ కార్యాలయం వరకు సాగింది. మంచి లక్ష్యం కోసం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్ తరాల కోసం ఒక అడుగు ముందుకు వేసి ఇంటితోపాటు, పరిసరాలను, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. 'స్వచ్ఛతా హి సేవ' గురించి మన చుట్టుపక్కల వారికి, కుటుంబసభ్యులకు, స్నేహితులకు అవగాహన కల్పించాలని కోరారు. తాను పుట్టి పెరిగింది విజయవాడలోనే అని గుర్తుచేశారు. ఎంజీ రోడ్డులో ఉన్న డీఆర్‌ఆర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ నేర్చుకున్నానని చెప్పారు. ఎంజీ రోడ్డులో వాకింగ్, రన్నింగ్ చేసేవాడినని యువతరం నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. నగర వీధులు అప్పటికి, ఇప్పటికి చాలా క్లీన్‌గా కనిపిస్తున్నాయని కితాబిచ్చారు. విజయవాడ ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కమిషనర్ వీరేందర్ మెహెతా మాట్లాడుతూ, 'స్వచ్ఛతా హి సేవా రన్' ప్రచారంలో విద్యార్థులు పాల్గొనటం చాలా సంతోషదాయకమన్నారు. హైదరాబాద్ ఆదాయపు పన్ను శాఖ ప్రధాన కమిషనర్ సురేష్ బత్తిని మాట్లాడుతూ, ప్రధాని మోదీ చొరవను ముందుకు తీసుకెళ్లడం ప్రాముఖ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో విజయవాడ ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్లా, పెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డీజీ రాజేంద్రచౌదరి, గుంటూరు ఆదాయపు పన్నుశాఖ అదనపు కమిషనర్ సుప్రియ, విజయవాడ ఆదాయపు పన్నుశాఖ జాయింట్ కమిషనర్ అభినయ, ఆదాయపు పన్నుశాఖ అసిస్టెంట్ కమిషనర్ దోనేపూడి విజయ్ బాబు, ఆదాయపు పన్నుశాఖ అధికారులు శ్యామలాదేవి, ఈశ్వరరావు, రామ్ ప్రసాద్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.



పెడన రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పెడన చేనేత కుటుంబానికి చెందిన పుచ్చల వీర కోట సుబ్రహ్మణ్యం ఎంపికయ్యారు. విజయవాడలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సమావేశం నిర్వహించి, యువతను చైతన్యవంతులను చేయాలన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా కార్యదర్శి డి.దినేష్ బాబు, ఎం.శిరీషల నేతృత్వంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సుబ్రహ్మణ్యం 2001, 2002, 2003 సంవత్సరాలలో వరుసగా స్ట్రాంగ్‌మెన్ ఆఫ్ ఆంధ్రగా గెలుపొందారు. 2004లో జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలో ఛాంపియన్‌గా నిలిచారు. అంతర్జాతీయ పోటీలలో అవకాశం వచ్చినప్పటికీ ఆర్థిక సమస్యలతో వెళ్లలేకపోయానని సుబ్రహ్మణ్యం తెలిపారు.

29 నుంచి సమ్మెలోకి..

'వైద్య మిత్ర' కాంట్రాక్టు ఉద్యోగులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్య సేవా పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల పదోన్నతులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. 29 నుంచి సమ్మెలోకి వెళతామని ఏపీ వైద్యమిత్ర కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు వి.నాగరాజు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు.17 ఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. చనిపోయిన సిబ్బందికి రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియో, రిటైరయిన వైద్యసేవ సిబ్బందికి రూ.10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. 25న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తామని, 26, 27న నల్ల బ్యాడ్జీలతో హాజరవుతారని, 29 నుంచి సమ్మెలోకి దిగుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ కార్యదర్శి పోతురాజు, డెన్నీ పాల్, అనిత, పుష్పలత పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విజయవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేసినట్టు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు తెలిపారు. ఐజీఎం స్టేడియంలో పోలీసు అమరవీరుల సంస్మరణదినం నేపథ్యంలో అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో ఉంటున్నందున ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు తెలిపారు. అర్జీదారులు గమనించాలని కోరారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సత్యవతి తదితరులు

ఆయువు పాట పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రచయిత్రి చంద్రలత రచించిన పుస్తకాలు ఆయువు పాట, నీలంపురాశి పుస్తకాల ఆవిష్కరణ పరిచయ సభ నగరంలోని శిఖర పాఠశాలలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఆయువు పాట పుస్తకాన్ని ప్రముఖ కథా రచయిత్రి సత్యవతి ఆవిష్కరించారు. ఆయువు పాట పుస్తకాన్ని చినుకు రాజగోపాల్ సమీక్షించారు. తొమ్మిది దేశాల తొమ్మిది పాటలను తెలుగులోకి అనువదించిన తీరును, అందులోని భాషను రాజగోపాల్ వివరించారు. నీలంపు రాశి పుస్తకాన్ని గురించి బాలాంత్రపు ప్రసూన మాట్లాడుతూ, బ్రిటీష్ కాలంలో నీలిపంట ప్రవేశపెట్టడం, నిర్బంధంగా ఈ పంటను పండించాలని రైతుల మీద వత్తిడి తేవడం నీలి మందు విప్లవం స్వాంతంత్రోద్యమంలో ఈ ఉద్యమం తెచ్చిన మార్పును విశ్లేషించారు. వక్తలు చంద్రలత రచనా శైలి, ఆమె రచనల కోసం చేసే అధ్యయనాన్ని వక్తలు విశ్లేషణ చేశారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ చంద్రలత ఏ రచన చేసినా ఎంతో పరిశోధన చేసి ఒక విస్తృతమైన కాన్వాస్ తీసుకొని లోతైన అధ్యయనంతో రాస్తారని అన్నారు.

తరతరాల స్ఫూర్తి రాణి అహిల్యాబాయి

» కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ

విజయవాడ కల్చరల్ అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళాశక్తికి ధైర్యం, సామాజిక సేవలకు ప్రతీకగా నిలిచి, తన నిష్ఠత, దృఢత్వంతో పాలనలో పురోగతిని సాధించిన వీరమహిళ రాణి అహిల్యాబాయ్ హోల్కర్ అని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమన్వయ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన తరతరాల స్ఫూర్తి రాణి అహిల్యాబాయ్ పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అహిల్యాబాయ్ శాంతియుత పరిపాలన అందించడంలో సమానత్వాన్ని ప్రోత్సహించడంలో ప్రజల సంక్షేమానికి చేసిన కృషి దేశచరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆమె సత్రాలను పునరుద్ధరించిన పుణ్యశీలి అన్నారు. శివాజీ తల్లి జిజియాబాయ్, ఝాన్సీ లక్ష్మి గురించి మాత్రమే ఎక్కువ మందికి అవగాహన ఉందని , ఇంతటి గొప్ప చారిత్రక వైభవం కలిగిన అహిల్యాబాయ్ గురించి నేటి తరానికి తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. నాటి కాలంలోనే మహిళా సాధికారతను ప్రోత్సహించారని, తన బిడ్డకు కులాంతర వివాహం జరిపించి కులమత బేధాలకు అతీతంగా సమానత్వాన్ని సాటిందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షురాలు విజయభారతి మాట్లాడుతూ అహిల్యాబాయ్ హోల్కర్ మహిళా హక్కుల గురించి చారిత్రక నిదర్శనంగా నిలిచిందన్నారు. ఆమె భర్త మరణం తర్వాత సామ్రాజ్యాన్ని సమర్థంగా పాలించి, నేటి మహిళలకు నాయకత్వం, సామాజిక న్యాయం, ఆర్థిక స్వాతంత్ర్యం అనే హక్కుల్ని వినియోగించడంలో స్ఫూర్తినిచ్చిందన్నారు. మహిళలు తమ హక్కులను ఉపయోగించుకోవాలనీ పిలుపునిచ్చారు. సమస్యలు ఎదురైతే కేవలం పోలీస్ స్టేషన్‌కే పరిమితం కాకుండా మానవ హక్కుల కమిషన్‌ను సంప్రదించవచ్చునన్నారు. మానవ హక్కుల కమిషన్ దృష్టికి వచ్చిన చాలా ఫిర్యాదులపై త్వరితగతిన చర్యలు తీసుకున్నామన్నారు. పశ్చిమబెంగాల్, విశాఖపట్నం, కదిరి వంటి ఘటనల దృష్ట్యా తీసుకొన్న చర్యలను వివరించారు. ఐఏఎస్ అధికారిణి సృజన మాట్లాడుతూ అహిల్యాబాయ్ హోల్కర్ ఎందరో మహిళకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. సేవాతత్పరత, యుద్ధనీతి, ఆధ్యాత్మికత వంటి అనేక గొప్పపార్శ్వాలు ఆమెలో ఉన్నాయన్నారు. పుస్తకాన్ని విజయభారతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సహసంఘ సంచాలకుడు దూసి రామకృష్ణ, బొమ్మరాజు సారంగపాణి, సాహితీ నికేతన్ డైరెక్టర్ బి.పవన్ కుమార్, మహిళా సమన్వయ కన్వీనర్ ఎస్.మాధురి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



తూకాల్లో తేడాలుంటే వ్యాపారులపై చర్యలు

పటమట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతలు శాఖ ఆధ్వర్యంలో చేపల మార్కెట్ పరిసర ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేస్తామని, తూకాల్లో తేడాలుంటే వ్యాపారులపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ టీకే మునిరాజా హెచ్చరించారు. తూనికలు, కొలతలు శాఖ డిప్యూటీ కంట్రోలర్ కృష్ణచైతన్య ఆదేశాల మేరకు ఆదివారం పటమటలంక చేపల మార్కెట్‌లో మునిరాజా ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేశారు. చేపలు, రొయ్యలు వ్యాపారం చేసే ముగ్గురు మహిళా వ్యాపారులు పద్మ, సుబ్బులు, రాజేశ్వరిల తూకం యంత్రాల్లో లోపాలను గమనించి వారి కాటాలను సీజ్ చేశారు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మునిరాజా తెలిపారు.



ఎండకు ఎండుతూ..
వానకు తడుస్తూ

రమేష్ ఆస్పత్రి జంక్షన్ నుంచి రామవరప్పాడు సెంటర్ వరకు ఏలూరు జాతీయ రహదారి వెంబడి ప్రధాన సెంటర్లలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రామవరప్పాడు రింగ్ సెంటర్ వద్ద, ప్రభుత్వాస్పత్రి వద్ద ప్రయాణికులు నిలబడేందుకు షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ..బస్సుల కోసం పడిగాపులు పడుతున్నారు. బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని వారు కోరుతున్నారు.



రామవరప్పాడు రింగ్ సెంటర్ వద్ద షెల్టర్ లేకపోవంతో ఎండలో నిలబడ్డ ప్రయాణికులు

ప్రభుత్వాస్పత్రి వద్ద..

- బస్సుల కోసం ఎదురుచూపులు
- రామవరప్పాడు రింగ్, ప్రభుత్వాస్పత్రి వద్ద షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికుల అవస్థలు

(ఆంధ్రజ్యోతి-గుణదల, భారతీనగర్)
రామవరప్పాడు రింగ్ నుంచి ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నం వైపు వెళ్లే ప్రయాణికులు వేచి ఉండడానికి బస్‌షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. నిత్యం కొన్ని వందలమంది ఇక్కడ ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. అలాంటి రద్దీ ప్రదేశంలోనూ బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రభుత్వం చేయకపోవడం దారుణమని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. తక్షణమే రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద బస్‌షెల్టర్ ఏర్పాటు చేసి వృద్ధులు కూర్చునేందుకు వీలుగా అందులో సిమెంట్ సప్టాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రభుత్వాస్పత్రి వద్ద పడిగాపులే..

మహానాడు జంక్షన్ సమీపంలోని ప్రభుత్వాస్పత్రి జంక్షన్ వద్ద కూడా బస్ షెల్టర్ లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్సు వచ్చే వరకు చెట్ల నీడలో ఉంటూ పడిగాపులు కాస్తున్నారు. ఇక్కడ కూడా బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



మహానాడు రోడ్డులోని రామచంద్రనగర్‌కాలనీలో ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

భారతీనగర్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం మద్యంపై ఆదాయం సంపాదించాలనే లక్ష్యంతో విచ్చలవిడిగా నివాసాల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేసిందని, ఆ పొరపాటును కూటమి ప్రభుత్వం చేయొద్దని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మహానాడు రోడ్డులోని రామచంద్రనగర్‌కాలనీ మెయిన్‌రోడ్డులో నూతనంగా మద్యం షాపు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ శ్రీరామచంద్రనగర్, కాలనీ, సమీప కాలనీల మహిళలు దుకాణం వద్ద ధర్నా చేశారు. గతంలో ఈ రోడ్డులో మద్యం షాపు ఉండడంతో రాత్రి సమయంలో బహిరంగా మద్యం తాగడంతో పాటు మద్యం ఖాళీ సీసాలు రోడ్లపైనే పగలగొట్టేవారని, ఒంటరిగా మహిళలు వెళ్తుంటే మందుబాబులు అసభ్యకరంగా ప్రవర్తించేవారని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు తెలియజేసినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ పెద్దలు తమ బాధలు గుర్తించి నివాసాల మధ్య మద్యం షాపును ఏర్పాటు చేయొద్దని మహిళలు కోరారు.



స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న పవర్ మెక్ ప్రాజెక్ట్స్ చైర్మన్ సజ్జ కిషోర్, కమ్మ విద్యార్థి సహాయ సంఘం అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు

రూ.30 లక్షల ఉపకార వేతనాల పంపిణీ

మొగల్రాజపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సాయం అందుకున్న ప్రతి విద్యార్థి మంచి స్థానంలోకి రాగానే తమ లాంటి వారికి సాయం అందించాలని పవర్ మెక్ ప్రాజెక్ట్స్ చైర్మన్ సజ్జ కిషోర్‌బాబు సూచించారు. పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో కమ్మ విద్యార్థి సహాయ సంఘం 30వ స్కాలర్‌షిప్ వితరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కిషోర్‌బాబు పాల్గొన్నారు. జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే క్రమశిక్షణ, పట్టుదల, పరిశీలనాశక్తి ఉండాలని విద్యార్థులకు ఆయన సూచించారు. కుల, మత రహితంగా కమ్మ విద్యార్థి సహాయ సంఘం ద్వారా 400మంది విద్యార్థులకు రూ.30 లక్షల సాయాన్ని అందిస్తున్నామని సంఘం అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యదర్శి పర్వతనేని ప్రభాస్, ఉపాధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు, మలినేని రాజయ్య, ముత్తవరపు మురళీకృష్ణ, కోశాధికారి చనుమోలు కృష్ణారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత రొమ్ము కేన్సర్ నిర్ధారణ శిబిరం

పటమట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్ సందర్భంగా రూట్స్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమెరికన్ అంకాలజీ ఇనిస్టిట్యూట్, నాసా హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం సోమనాథ్ హాస్పిటల్స్‌లో ఉచిత రొమ్ము కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. కేన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.తేజస్విని మాట్లాడారు. రొమ్ములో నొప్పి, వాపు, గడ్డలు రంగుమారడం, చనుమొనల్లో మార్పు ఉంటే వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె సూచించారు. రొమ్ము కేన్సర్‌ను మొదట్లో గుర్తిస్తే పూర్తిగా నయం చేయొచ్చని, మామోగ్రామ్ అనే ఎక్స్‌రే ద్వారా గుర్తించడం సులభమని రూట్స్ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్ తెలిపారు. మహిళలకు బ్రెస్ట్ ఎగ్జామినేషన్ నిర్వహించి అవసరమైన వారికి మామోగ్రామ్ పరీక్షలు చేశారు.

ప్రమాదాలకు 'సిగ్నల్'



ట్రాఫిక్ సిగ్నల్ లేకపోవడంతో అస్తవ్యస్తంగా వెళుతున్న వాహనాలు

- రామవరప్పాడు రింగ్ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్ లేక తరచూ ప్రమాదాలు

(ఆంధ్రజ్యోతి-గుణదల): నిత్యం రద్దీగా ఉండే రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం లేదు. ప్రమాదాల కారణంగా ప్రతినెలా మరణాలు నమోదవుతున్నాయి. ప్రమాదాల జోన్‌లా మారిన ఈ సెంటర్‌లో విధులు నిర్వహించే ట్రాఫిక్ కానిస్టేబుళ్లకూ వాహనాలను క్రమబద్ధీకరించడం చాలా కష్టంగా ఉంది. పోలీసు అధికారులు తక్షణమే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఎనిమిదిసార్లు వరదలొస్తే
ఒక్కసారైనా ఆదుకున్నారా?

- మీరా మాపై విమర్శలు చేసేది
- వైసీపీని ప్రశ్నించిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో కృష్ణానదికి ఎనిమిదిసార్లు వరదలు వచ్చాయి. ఒక్కసారి కూడా బాధితులను ఆదుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు వరద బాధితుల గురించి ఆ పార్టీ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేసే నైతికత ఆ పార్టీకి ఉందా?' అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రశ్నించారు. 7వ డివిజన్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బుడమేరు వరదలోను, కృష్ణానది వరదలోను వేలాది మందికి సహాయం చేస్తూ రోజూ వరద ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడి వారికి అండగా ఉన్న సీఎం చంద్రబాబుపై వైసీపీ విమర్శలు సమంజసం కాదన్నారు. తన ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న వరద బాధితులను పరామర్శించని జగన్‌కు వరద బాధితులకు సాయంపై మాట్లాడే హక్కు లేదన్నారు. ఇళ్లు మునిగిన వారికి ఆర్థిక సాయం చేసిన ఘనత టీడీపీదేనన్నారు. మ్యాపింగ్ సరిగా లేక సహాయం అందలేదంటే ఆ పాపం వైసీపీదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి గురుప్రసాద్, నాగుమోతు రాజా, గౌతమ్, నాగేంద్ర, పడాల గంగాధర్, ఇంజన్‌రావు, పూర్ణ, వాసు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

పాయకాపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న యువకుడిపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పాయకాపురం ప్రజాశక్తినగర్‌కు చెందిన బాలిక(17) నగరంలోని కళాశాలలో ఇంటర్ చదువుతోంది. కండ్రిక ప్రాంతానికి చెందిన నవీన్(21) ప్రేమ పేరుతో బాలికకు మాయ మాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి, యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

కోపా కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

సత్యనారాయణపురం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా కాపు అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (కోపా)నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా డాక్టర్ దవులూరి కైలాసరావు, కార్యదర్శిగా దుత్తా రమేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి సంజీవ్, గళ్లా భాస్కరరావు, కోశాధికారిగా గాజుల రామారావు, సంయుక్తకార్యదర్శులుగా గోపిరత్నం ప్రసాద్, కోటి నాగయ్య, కార్యవర్గ సభ్యులుగా సత్యానందం, సుధాకర్, రామ్మోహనరావు, సత్యనారాయణ, వల్లభరావు ఎన్నికయ్యారు. పేద విద్యార్థులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అసోసియేషన్ సభ్యులతో కలిసి పనిచేస్తానని, నూతన భవనం సమకూర్చుకోవటానికి కృషిచేస్తామని నూతన అధ్యక్షుడు కైలాసరావు తెలిపారు.

నాణ్యత గల వస్తువులు
వినియోగదారులకు అందించడమే ధ్యేయం

- క్వాలిటీవాక్‌లో బీఐఎస్ జేడీ ఎం.రమాకాంత్‌సాగర్

లబ్బీపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు గల వస్తువులను అందుబాటులోకి తీసుకురావడమే భారతీయ ప్రమాణాల బ్యూరో ఉద్దేశమని బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ ఎం.రమాకాంత్‌సాగర్, డిప్యూటీ డైరెక్టర్ డి.వివేకవర్ధన్ రెడ్డి అన్నారు. బీఐఎస్ విజయవాడ బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బందరు రోడ్డులోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం నుంచి క్వాలిటీవాక్ నిర్వహించారు. పలు విద్యా, వినియోగదారుల సంస్థల నుంచి 400 మంది పాల్గొన్నారు. వస్తువుల కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయో లేదో చూసుకుని కొనాలని, నాణ్యతా లోపాలు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలని అందుకు నష్ట పరిహారం పొందడమే కాకుండా అటువంటి వస్తువుల విక్రయాలను నిరోధించవచ్చని తెలిపారు. సెక్షన్ ఆఫీసర్ ఎస్.వి.ఎస్.భావనారాయణ, ప్రమోషన్ ఆఫీసర్ డి.కృష్ణవీర్‌వర్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేయరూ

(ఆంధ్రజ్యోతి-ప్రభుత్వాసుపత్రి)
సర్వజన ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ వెనుక భాగంలో 100 మీటర్ల మేర మట్టి రహదారి అధ్వానంగా ఉంది. ఆదారి గుండానే బీఎస్సీ నర్సింగ్ స్కూల్ విద్యార్థులు, ఎంబీబీఎస్(పీజీ) వసతిగృహం విద్యార్థులు, డ్యూటీ నిర్వహించే జూనియర్ డాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటారు. అధ్వానపు రహదారిపై నానాపాట్లు, పీట్లు పడాల్సి వస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 100 మీటర్ల మేర సీసీ రహదారి వేయాలని వారు కోరుతున్నారు.



సిద్ధార్థ కళాశాలలో గోతులతో అధ్వానంగా ఉన్న 100 మీటర్ల మట్టి రోడ్డు

భళారే ఖిల్లా..!

కొండపల్లి కోటకు పూర్వ వైభవం వచ్చినట్టేనా..?

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఓ వెలుగు వెలిగిన ఖిల్లా
- లేజర్ షోలతో కోట, రాజుల చరిత్ర ప్రజలకు తెలిపిన చంద్రబాబు
- ప్రపంచ పర్యాటక కేంద్రాన్ని నిర్లక్ష్యం చేసిన మాజీ సీఎం జగన్

తెలుగు నాట ఎంతో ప్రాచుర్యం ఉన్న కొండపల్లి ఖిల్లా (గిరిదుర్గం) శత్రుదుర్భేద్యమైన దుర్గం. సహజ వనరులకు, ప్రకృతి సంపదకు పెట్టింది పేరు. కొండపల్లి ఖిల్లా పేరు చెప్పగానే ఎత్తైన భవనాలు, రాతి బురుజులు, రాజమహల్లోని పెద్ద కొలనులు, అడుగడునా రాజసం ఉట్టిపడేలా అలనాటి చారిత్రక కట్టడాలు, ఎన్నో కళాఖండాలు కళ్ల ముందు కదలాడుతుంటాయి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన కొండపల్లి కోట వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో ఆ ప్రాభవాన్ని కోల్పోయింది. కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో పర్యాటకులు లేక నిర్మానుష్యంగా మారి బోసిపోతోంది. - ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి


నిరుపయోగంగా లేజర్ షో ప్రదర్శించిన ప్రాజెక్టర్స్

2014 -19 మధ్య కొండపల్లి ఖిల్లాకు మహర్దశనే చెప్పాలి. నవ్యాంధ్ర ఏర్పడిన తర్వాత పురావస్తుశాఖ ఈ కోటపై దృష్టి సారించింది. అప్పటి, ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు రాజధాని అమరావతి పర్యాటకానికి పెట్టని కోటగా కొండపల్లి ఖిల్లాను తీర్చిందేందుకు, పర్యాటక ఆకర్షణ కేంద్రంగా మెరుగులు దిద్దేందుకు రూ.10 కోట్లు వెచ్చించి కోటకు కొత్తరూపు తెచ్చారు. కనుమరుగవుతున్న కోటకు తిరిగి జీవం పోశారు. ప్రపంచ పర్యాటక కేంద్రంగా కొండపల్లి కోటను తీర్చిదిద్దేందుకు ఉత్సవాలు నిర్వహించి అద్భుతంగా పునరుద్ధరించారు. రాజుల చరిత్రతో పాటు కోట చరిత్ర, విశిష్టతను తెలుపుతూ లేజర్ షో ప్రదర్శించారు. అందరి దృష్టి కొండపల్లి ఖిల్లాపై పడేలా చేయడమే కాక కోట అణువణువూ చూసేలా రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేశారు.

కళతప్పిన ఖిల్లా

వైసీపీ సర్కార్‌లో కొండపల్లి ఖిల్లా పూర్తి నిర్లక్ష్యానికి గురైంది. ఐదేళ్ల పాలనలో ఒక్క రూపాయి కూడా విదిల్చలేదు. దీంతో క్రమం క్రమంగా పర్యాటకులు ఖిల్లాను మర్చిపోయే పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్యకాలంలో ఎందరో విదేశీయులు సైతం కొండపల్లి ఖిల్లాను సందర్శించారు. అప్పట్లో పర్యాటకుల సందడితో కోటలో జాతర జరుగుతుందా అనిపించేలా పర్యటకులు వచ్చి పోతుండేవారు. చంద్రబాబు ప్రభుత్వం మారి 2019లో వైసీపీ రావడంతో కోటకు శని పట్టినట్టయింది. 2019-24 వరకు కోట దయనీయ స్థితికి చేరింది. కనీసం వసతులు లేక కునారిల్లింది. ఇప్పుడు ఎన్డీఏ ప్రభుత్వం రాకతో మళ్లీ కొండపల్లి ఖిల్లాకు పూర్వ వైభవం వస్తుందనే ఆశాభావాన్ని పర్యాటకులు వ్యక్తం చేస్తున్నారు. అప్పట్లో నిర్వహించిన లేజర్ షో ప్రాజెక్టర్లను అధికారులు ఇటీవల పరిశీలించినట్టు తెలుస్తోంది.



పర్యాటకులు లేక బోసిపోతున్న ఖిల్లాలోని కోట ప్రాంతం


పసరతో నిండిన కోనేరు నీరు

సమస్యల తిష్ట

ఖిల్లాకు వెళ్లే రహదారిపైకి చెట్లు చొచ్చుకొస్తున్నాయి. వర్షాలకు కొండ చరియలు విరిగి పడుతున్నాయి. దీంతో కొండపైకి వెళ్లే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. కొండపై ఉన్న టీవీ టవర్‌లో ఉద్యోగాలు వెళ్లేవారు సైతం రహదారి బాగోక ఇబ్బందులు పడుతున్నారు. ఇక కోట లోపలున్న లేజర్ షో ప్రాజెక్టర్స్ నిరుపయోగంగా ఉంది. సీసీ కెమెరాలు పని చేయడం లేదు. అత్త కోడళ్ల కోనేటిలో నీరు పూర్తిగా పాడైంది. కోటలో అనేక సమస్యలు తిష్ట వేయడంతో పర్యాటకుల సంఖ్య పడిపోయింది.

చూడదగ్గ ప్రదేశాలు



మూడంస్తుల రాతి బురుజు, కొండ చుట్టూ శత్రు దుర్భేద్యమైన ప్రాకారం, దర్బార్ నిర్వహించే రాజ్‌మహల్, రాణి పరిహారం నివాసం ఉండే రాణిమహల్, నర్తనశాల, అంగడి, కారాగారం, ఆయుధాగారం. కొలనులు, రాజమహల్‌పై తీర్చిదిద్దిన కళాకండాలు, వీరుపాక్షి దేవాలయం, ప్యాలెస్ సమీపంలో లోతైన జలాశయం, ధాన్యాగారం, ఇలా అనేక చూడదగ్గ ప్రాంతాలున్నాయి. అయితే ప్రస్తుతం ధాన్యాగారం గబ్బిలాలకు నిలయంగా మారింది. అక్కడ ఏదైనా చప్పుడయితే గబ్బిలాల గోలకు చెవులు చిల్లులు పడే పరిస్థితి.


రహదారిపైకి వచ్చేస్తున్న ముళ్ల పొదలు

ప్రయాణ సౌకర్యాలు మృగ్యం

కోటకు వెళ్లాలంటే 6 కిలో మీటర్ల మేర అటవీ మార్గంలో ఇరుకు రహదారిలో వెళ్లాల్సి ఉంది. ఇబ్రహీంపట్నం నుంచి నేరుగా కోటకు బస్సు లేదు. ప్రైవేటు వాహనాల్లో వెళ్లాలంటే అధిక భారం. సాయంత్రమైతే నిర్మానుష్యంగా ఉంటుంది.

కావాల్సిన సౌకర్యాలేంటి..!

కోటకు వెళ్లేందుకు గతంలో చంద్రబాబు హయాంలో రోప్ వే నిర్మాణానికి ప్రతిపాదనలు జరిగాయి. కానీ కార్యరూపం దాల్చలేదు. జాతీయ రహదారి నుంచి కోటకు లింక్ రహదారితో పాటు కొండపల్లి వైపు నుంచి కోటకు రోప్ వే నిర్మాణం చేయాలి. అంతేకాక ఖిల్లా సందర్శనకు వచ్చే వారికి ఫుడ్‌కోర్టులు, తాగునీరు, మరుగుదొడ్ల వంటివి కల్పించాలి. ఈ దిశగా ప్రభుత్వం, పురావస్తుశాఖ దృష్టి సారించి కోటకు పూర్వవైభవం తేవాలి.

కను విందు జలపాతాలు

కొండపల్లి అటవీ ప్రాంతంలో 11 పెద్ద జలపాతాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. వాటికి తెలుగులో నామకరణాలూ ఉన్నాయి. కొంగుధార (కొండపల్లి), నెమలిధార (మూలపాడు), క్షీరలింగ జలపాతం (మూలపాడు), మాదులమ్మ తీర్థం (దొనబండ), సప్తస్వర ధారలు (దొనబండ), చిట్టి తుంబురు కోన (దొనబండ), సీతాకోకలగుండం (మూలపాడు), వనమాలి జలపాతం (కొండపల్లి), బేబి చిత్రకూట్ (కొండపల్లి), జడల కొలను (కొండపల్లి)

కోట లోపలికి వెళ్లే దారి తెరవాలి
సయ్యద్ అహమ్మద్ కిర్మాని



అనారోగ్యంగా ఉన్న వారు మొక్కుకొని దర్గాలో పూజలు చేసి పాయసం చేసుకొని కోటలో ఉన్న గాలిబ్‌షహెద్ బాబాకు చెందిన గుర్రపు పాదాలు వద్ద కొంత పోసి తిరిగి దర్గా వద్దకు వచ్చి అందరికీ పంచుతాం. అయితే దర్గా వైపు నుంచి కోటకు వెళ్లేదారిని మూసివేశారు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అత్యంత లోతైన చెరువు పక్కనే ఉన్న చిన్న కాలిబాట ద్వారా కోటలోకి వెళ్లాల్సి వస్తుంది. దీంతో పిల్లలు, వృద్ధులు అందులో పడిపోతారేమోనని భయపడుతున్నాం. గేట్లు తెరిచి ఉంచి టికెట్ కౌంటర్ కూడా ఏర్పాటు చేస్తే మంచిది.


పున్నమి ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్ ధ్యాన చంద్

పున్నమి ఘాట్‌లో పరిశుభ్రతకు ప్రాధాన్యం

విద్యాధరపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పున్నమిఘాట్‌లో ఈనెల 22న నిర్వహించనున్న డ్రోన్ షో సందర్భంగా పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తున్నట్టు వీఎంసీ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. ఈ సందర్భంగా ఆయన పున్నమిఘాట్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. ఘాట్‌లో రైలింగ్ వద్ద పేరుకున్న చెత్తను, వ్యర్థాలను చూసిన తొలగించాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా నిర్దేశిత ప్రాంతాల్లో తాగునీటి పాయింట్లు, మొబైల్ టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాలన్నారు. అదనపు కమిషనర్ (ప్రాజెక్టులు) డాక్టర్ డీ చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీ ఎస్వీ ప్రసాద్, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ సురేష్‌బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్ (వర్క్స్) వీ సత్యనారాయణ, ఈఈ ఏఎస్ఎన్ ప్రసాద్, ఇన్‌చార్జ్ అమృత్ జాయింట్ డైరెక్టర్, యూసీడీ పీవో డాక్టర్ లత, పబ్లిక్ రిలేషన్ అధికారి రజియా షబీనా కమిషనర్ వెంట ఉన్నారు.

రేపటి నుంచి ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భారతతీయ నవీన క్రీడా ఉత్సవ్ (బాకు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతారామపురంలోని ఓ ప్రైవేటు స్కూల్ వేదికగా ఈ నెల 22 నుంచి 27 వరకు తొలి అంతర్జాతీయ ఫిడే చెస్ ఫెస్టివల్-2024 పేరిట ఫిడే చెస్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు స్కూల్ డైరెక్టర్ కే రాజేంద్ర తెలిపారు. ఈ మేరకు స్కూల్ ఆవరణలో ట్రోఫీలను, బ్రోచర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో తాము ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్నామని, తొలిసారి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీ విజయవాడ వేదికగా జరగడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. బాకు సెక్రటరీ విత్తనాల కుమార్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి ఆంధ్రా చెస్ అసోసియేషన్ సౌజన్యంతో ఫిడే రేటింగ్ చెస్‌ను నిర్వహిస్తున్నామని వెయ్యి మంది క్రీడాకారులు ఎంట్రీలు సమర్పించారన్నారు. ఈ టోర్నీలో రూ.15లక్షల ప్రైజ్‌మనీతో పాటు ట్రోఫీలను అందిస్తామన్నారు. టోర్నీ కన్వీనర్ షేక్ ఖాసీమ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉదయ్‌కుమార్, తాళ్ల నరేశ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు 22న ఉదయం పోటీలను ప్రారంభిస్తారని, ఇద్దరు గ్రాండ్‌మాస్టర్లు సప్తర్షిరాయ్ (2291 ఫిడే పశ్చిమబెంగాల్), ఎంఆర్ వెంకటేష్ (తమిళనాడు గ్రాండ్‌మాస్టర్) సహా 14మంది ఇంటర్నేషనల్ గ్రాండ్‌మాస్టర్లు విచ్చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ మందుల రాజీవ్ పాల్గొన్నారు.

సెంచరీలతో కదం తొక్కిన రేవంత్, హర్ష

సీకే నాయుడు క్రికెట్ మ్యాచ్‌లో పట్టుబిగించిన ఆంధ్ర -373/2

విజయవాడ స్పోర్ట్సు, అక్టోబరు 20: ఆకాశమే హద్దుగా ఆంధ్ర బ్యాటర్లు చెలరేగి సెంచరీలతో కదం తొక్కారు. దీంతో మూలపాడు వేదికగా బీసీసీఐ నిర్వహించిన సీకే నాయుడు ట్రోఫీ మల్టీ డేస్ అండర్-23 క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ప్రత్యర్థి జట్టు మేఘాలయపై తొలిరోజే పట్టుబిగించింది. మూలపాడు దేవినేని వెంకట రమణ గ్రౌండ్స్‌లో ఆంధ్రా-మేఘాలయ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన మేఘాలయ ఆతిథ్య జట్టు ఆంధ్రను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. తొలి వికెట్ పార్టనర్‌షిప్‌గా రేవంత్‌రెడ్డి (186 పరుగులు, 158 బంతుల్లో 19 ఫోర్లు,5 సిక్సర్లు), హర్షవర్ధన్ (149 నాటౌట్, 187 బంతుల్లో 10 ఫోర్లు, 7 సిక్స్‌లు) 324 బంతుల్లో 324 పరుగులను జోడించారు. దీంతో తొలిరోజు ముగిసే సమయానికి 373/2 నిలిచింది. సుబ్రహ్మణ్యం 26 పరుగులతో క్రీజులో ఉన్నారు. మేఘాలయ బౌలర్ సంతోష్ రెండు వికెట్లను తీశాడు.

వీబీఎఫ్ఎస్ అధ్యక్షుడిగా లక్ష్మయ్య

విజయవాడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ (వీబీఎఫ్ఎస్) 2024-25 సంవత్సరానికి కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. విజయవాడలోని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా కె.లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జక్కంపూడి ప్రసాద్, కార్యదర్శిగా టి.మనోహర్‌నాయుడు, సహాయ కార్యదర్శి కొండపల్లి రవి, కోశాధికారిగా జి.లక్ష్మి ఎన్నికయ్యారు. వర్కింగ్ కమిటీ సభ్యులు గోళ్ల నారాయణరావు, విశ్వేశ్వరరావు, కొల్లూరి, ఎ.భాస్కరరావు, బి.రవి కుమార్, కె.శ్రీనివాస్, వి.శ్రీనివాసరావు, ఎస్ఎస్ నాగిరెడ్డి, పి.సుబ్రహ్మణ్యం, జె.నరసింహమూర్తి ఎన్నికయ్యారు. ఈ ఏడాది నవంబరులో విశాఖపట్నంలో పుస్తక మహోత్సవం నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

- టీయూసీ నేత జార్జ్

ధర్నాచౌక్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక సంఘాల ఐక్యతతోనే హక్కులను సాధన జరుగుతుందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీ) కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చార్లెస్ జార్జ్ కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. టీయూసీ ఏపీ కమిటీ 5వ మహాసభ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ అనుకూల చట్టాలకు వ్యతిరేకంగా సంఘటిత ఉద్యమాల ఆవశ్యకత ఉందన్నారు. వ్యవసాయరంగంలోని నల్లచట్టాలు, పారిశ్రామికరంగంలోని నాలుగు లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎం.ప్రసాద్, పోలవరపు కృష్ణా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా, ఉపాధ్యాక్షుడిగా మరీదు మహేష్, సహాయకార్యదర్శిగా కంభంపాటి రాము, కోశాధికారిగా గానుగపాటి ప్రసన్నతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.


ఫించన్లు పంపిణీ చేస్తున్న సంఘం నేతలు

వృద్ధులు, వితంతువులకు పెన్షన్ల పంపిణీ

ధర్నాచౌక్, అక్టోబర్ 20 (ఆంధ్రజ్యోతి): తమ సంఘం ఆధ్వర్యంలో ప్రతినెలా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు అందజేస్తున్నామని వెలమ సంక్షేమ సంఘం నేతలు పేర్కొన్నారు. భవిష్యత్‌లో దీన్ని కొనసాగిస్తామన్నారు. గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయం వద్ద ఆదివారం పెన్షన్లు పంపిణీ చేశారు. సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఘంటా శ్రీనివాసరావు, సిరిపురపు కిరణ్‌కుమార్, కోశాధికారి గంటా శ్రీనివాసరావు, గంటా మల్లేశ్వరి, కొప్పిశెట్టి సీత రామారావు, నల్ల రామారావు, గొట్టపు గోవర్ధనరావు పాల్గొన్నారు.

కవి విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం కమ్మేశారు

లెనిన్ సెంటర్‌లోని కవి విశ్వనాథ సత్యనారాయణ విగ్రహం ఎదురుగా గతంలో ఒక వరుసలోనే 4 తోపుడు బళ్లుండేవి. ప్రభుత్వం మారగానే 3 వరుసలు పెంచి, దారి మూసేసి, 12 షాపులు పెట్టారు. పబ్లిక్ వెళ్లడానికి వీల్లేకుండా, విగ్రహానికి దారి లేకుండా చేశారు. పోనీ అవి పేదలవి అనుకుంటే పప్పులో కాలేసినట్టే. అధికార పార్టీకి చెందిన చోటామోటా నేతలు రోడ్డును ఆక్రమించి ప్లేస్‌లు విడగొట్టి, వేలాది రూపాయలు గుడ్‌విల్ తీసుకుని, అద్దెలకిస్తున్నారు.



నెలవారీ మామూళ్లు..

ఎన్నో ఏళ్లుగా పాతుకుపోయి హవా సాగిస్తున్న ఇద్దరు వ్యక్తులు దాదాపు 26 బళ్లు పెట్టి అద్దెలకిస్తూ, దందా కొనసాగిస్తున్నారు. ప్రజాప్రతినిధికి నెలవారీ మామూళ్లు చెల్లించాలంటూ దాదాగిరి చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆశ్చర్యం ఏమిటంటే ఒక్కడికి 16 బళ్లు, అతని బంధువుకు 10 బళ్లున్నాయి. వీటిని అద్దెకిచ్చి వసూలు చేస్తారు. ఇందుకోసం ఒక గుమస్తాను ఏర్పాటు చేశారని చిరువ్యాపారులు ఆరోపిస్తున్నారు. సకాలంలో అద్దె చెల్లించకపోతే బెల్ట్ తీసి బెదిరిస్తున్నారని ఎదురు తిరిగితే పోలీసు కేసులు బనాయిస్తున్నారని వాపోయారు.

లెనిన్ సెంటర్ ఆక్రమణ

- షాపుల కోసం నేతల పోటీ
- ప్రజల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు



ఆంధ్రజ్యోతి, గవర్నర్‌పేట: లెనిన్ సెంటర్ ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంది. కొత్త ప్రభుత్వం రాగానే కూటమి నేతలు లెనిన్ సెంటర్‌పై కన్నువేశారు. ఉన్న షాపులు తొలగింపునకు కుట్రలు చేస్తూనే కొత్త షాపుల ఏర్పాటుకు స్థలాన్ని కబ్జా చేస్తున్నారు. పాత నీరు పోయి కొత్తనీరు వచ్చిందన్న సామెతను నిజం చేస్తూ ప్రభుత్వం మారగానే కొత్త హాకర్లకు రేట్లు కట్టి స్థలాలు ఇస్తున్నారు. బళ్లు పెట్టిస్తున్నారు. పబ్లిక్‌కు అసౌకర్యం కలిగిస్తున్నా పోలీసు, మున్సిపల్ సిబ్బంది పట్టనట్టే వ్యవహరిస్తున్నారు. హాకర్లు పేరుతో ఒకవైపు, ఆటోస్టాండ్ పేరుతో మరోవైపు లెనిన్ సెంటర్‌ను పంచుకున్నారు.

బీసెంట్ రోడ్ బ్లాక్

తోపుడు బళ్ల పేరుతో ఆక్రమణదారులు లెనిన్ సెంటర్ నుంచి ఏలూరు రోడ్డుకు వచ్చే (సౌత్ ఇండియా షాపింగ్ మాల్ తూర్పువైపు) బీసెంట్ రోడ్డు వైపు వాహనాల రాకపోకలకు అవకాశం లేకుండా చేశారు. కేవలం నడకదారిని మాత్రమే మిగిల్చారు. అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు పబ్లిక్ స్థలాలు ఆక్రమించి, వీధి వ్యాపారులకు అద్దెలకిచ్చి, బతికేస్తున్నారని కార్మిక సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. చందన బ్రదర్స్ రోడ్డులో నూడిల్స్ బళ్ల వ్యాపారుల ఆగడాలకు అంతే లేదని, రోడ్డును ఆక్రమించడమే కాక వెనుక ఉన్న పార్కులో పీటలు, బల్లలు వేసి పెద్దపాటి హోటల్స్‌నే నడిపేస్తూ సందర్శకులు పార్కుకు వచ్చే పరిస్థితి లేకుండా చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వీరిదే హవా...

ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వీళ్లే ముందు ప్రజాప్రతినిధిని బుట్టలో వేసుకుని తమను కాపాడుకుంటారని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కండెలు అమ్ముకునే వారి నుంచి కూడా నేత బర్త్‌డే వేడుకలకు రూ.500 వసూలు చేస్తారని ఆరోపిస్తున్నారు. పోలీసు అవుట్ పోస్టులోనికి వెళ్లే దారిని కూడా ఆక్రమించి అద్దెలకిచ్చారు. సిటీ బస్సులు వెళ్లేందుకు దారి లేకుండా పూలకొట్లు, చెప్పులు షాపులు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తెస్తున్నారని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడం లేదని వారు వాపోతున్నారు.


సౌత్ ఇండియా షాపింగ్ మాల్ రోడ్డులో ఆక్రమణలు

యువత నైపుణ్యం పెంచుకోవాలి

- నైపుణ్యాభివృద్ధి సంస్థ సీఈవో గణేష్ కుమార్

విజయవాడ కల్చరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): యువతకు కావాల్సిన నైపుణ్యం పెంపొందించడంతోపాటు చక్కటి ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా స్కిల్ సెంటర్ సెంటర్ పనిచేస్తుందని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో జి. గణేష్ కుమార్ అన్నారు. ది ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతి చాప్టర్ ఆధ్వర్యంలో ఓ ప్రైవేటు హోటల్‌లో హెచ్ఆర్ కాంక్లేవ్ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గణేష్‌కుమార్ మాట్లాడుతూ వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, సరైన స్కిల్స్ లేని కారణంగా యువతను ఎంపిక చేయలేకపోతున్నామని ఆయా కంపెనీలు చెబుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ప్రత్యేకంగా యువతలో నైపుణ్యతను పెంపొందించేందుకు దేశంలోనే తొలిసారిగా స్కిల్ సెన్సెస్ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్టీపీఐ(సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా) విజయవాడ సెంటర్ జాయింట్ డైరెక్టర్ బి.వినయకుమార్ మాట్లాడుతూ ఇటీవల పెద్ద కార్పొరేట్ సంస్థలు వచ్చాయని, యువతకు ఉపాధి కల్పిస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడానికి ఈ సదస్సులు ఉపయోగడపతాయన్నారు. ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు దాసరి రామకృష్ణ మాట్లాడుతూ ఐటీ అసోషియేషన్ సంస్థ విద్యార్థుల్లో ముఖ్యంగా యువతలో స్కిల్స్‌ను పెంపొందించేందుకు, పరిశ్రమకు ఎటువంటి సిబ్బంది అవసరమో తెలియచేసేందుకు తొలిసారిగా హెచ్ఆర్ కాంక్లేవ్ నిర్వహించినట్టు తెలిపారు. హెచ్‌సీఎల్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శివప్రసాద్, ఐటీఏపీ చైర్మన్ ఇంద్రజిత్, అధ్యక్షురాలు లక్ష్మీ ముక్కవిల్లి పాల్గొన్నారు.

పాలవ్యాపారి అనుమానాస్పద మృతి

గుణదల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలవ్యాపారి అనుమానాస్పద స్థితిలో చనిపోయినట్టు పటమట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పటమట పంటకాల్వ రోడ్డులో తల్లి నాగమణితో కలిసి నివాసం ఉంటున్న ధూళిపాళ రామకృష్ణ (43) పాల వ్యాపారం చేసి జీవనం సాగిస్తుంటాడు. గత కొంతకాలంగా రామకృష్ణ ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు సమాచారం. సదరు మహిళ నమ్మకంగా ఉంటూ తరచూ నగదు తీసుకోవడం తిరిగివ్వకపోవంతో రామకృష్ణ అప్పులపాలయ్యాడు. దీంతో ఆ మహిళ రామకృష్ణను దూరంపెట్టడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం ఫ్యానుకు ఉరేసుకుని చనిపోయాడు. ఈనెల 11న నిడమానూరులోని బంధువుల ఇంటికి వెళ్లిన తల్లి నాగమణి తిరిగి అదేరోజు ఇంటికి చేరుకుంది. లోపలికి వెళ్లి చూడగా కుమారుడు విగత జీవిగా కనబడటంతో పటమట పోలీసులకు తెలిపింది. పటమట సీఐ పవన్ కి షోర్, ఎస్ఐ హరికృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పటమట సీఐ పవన్ కిషోర్ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి కార్మికుడు మృతి

విద్యాధరపురం,అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పుస్తకాల ప్రింటింగ్ యూనిట్‌ను వేరేచోటికి మారుస్తున్న క్రమంలో ఇనుప ర్యాక్‌లను మారుస్తుండగా విద్యుత్ తీగలు తగిలి కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. విజయవాడ రూరల్ కొత్తూరు తాడేపల్లికి చెందిన ఇస్లావత్ కొండకు శివకుమార్ (27), రాములు (23) సింగ్‌నగర్‌లోని పైపుల రోడ్డులో ఉన్న ఎస్ఆర్ పబ్లికేషన్స్‌లో ఏడేళ్లుగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకే విధుల్లోకి వచ్చారు. పైపుల రోడ్డు నుంచి కామకోటినగర్‌లోకి ప్రింటింగ్ యూనిట్‌ను మారుస్తున్న క్రమంలో కామకోటినగర్‌లో శివకుమార్ బీరువాలను దించుతుండగా వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు, అతడితో పాటు మరో కార్మికుడు నవీన్‌కు కూడా విద్యుత్ షాక్‌తగిలింది. కానీ శివకుమార్ అక్కడిక్కడే స్పృహ కోల్పోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న శివకుమార్ తండ్రి జరిగిన సంఘటనపై ఆరా తీశాడు. ఈ మేరకు తన కుమారుడు విద్యుత్ షాక్ తగిలి చనిపోయినట్టు భవానీపురం పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఎవరిపై తనకు అనుమానాలు లేవంటూ తెలిపాడు.

వృద్ధురాలి ఆత్మహత్య

కృష్ణలంక సుబ్బరాయనగర్ 5వ లైనుకు చెందిన ఆరేళ్ల సరస్వతి (70) ఆదివారం ఇంట్లో ఉరేసుకుని ప్రాణాలను వదిలింది. భర్త రామారావు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పట్నుంచి సరస్వతి మానసికస్థితి సరిగా లేక దిగులుతో ఉంటోంది. ఆమెకు నలుగురు కుమార్తెలు. ఒక కుమారుడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకులషెడ్డులో చీరతో ఉరేసుకుని మృతి చెందింది. ఆమె కుమారుడు నరేంద్ర కుమార్ కృష్ణలంక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
సోమవారం • 21 అక్టోబరు 2024
cinema@andhrajyothy.com



సెట్స్‌లోకి స్వాగతం

హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే' సీజన్ 4 త్వరలో ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన తొలి ఎపిసోడ్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా కనిపించనున్నారు. దీనికి సంబంధించిన షూటింగ్ ఆదివారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభమైంది. చంద్రబాబునాయుడుకు బాలకృష్ణ పుష్పగుచ్ఛం అందించి సెట్స్‌లోకి ఆహ్వానించారు. గతంలో అన్‌స్టాపబుల్ సీజన్ 3లో సైతం చంద్రబాబు పాల్గొన్నారు. ఇప్పుడు మరోసారి తన వ్యక్తిగత, రాజకీయ జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర అంశాలను ఆయన పంచుకోనున్నారు. 'అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే' సీజన్ 4లో తొలి ఎపిసోడ్ ఈ నెల 25న స్ట్రీమింగ్ అవనుంది.



చాలా నమ్మకంతో ఉన్నాను

విష్వక్‌సేన్

విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. నవంబర్ 22న విడుదలవుతోంది. ఆదివారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ సాగిన ట్రైలర్ ఆద్యంతం వినోదం పంచింది. విష్వక్‌సేన్ స్టైలిష్ నటనతో కట్టిపడేశారు. విలన్ పాత్రలో సునీల్ పలికించిన క్రౌర్యం అలరించింది. ఈ కార్యక్రమంలో విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'నన్ను ఇక్కడివరకూ తీసుకొచ్చింది ప్రేక్షకుల అభిమానమే. సినిమాపై చాలా నమ్మకంతో ఉన్నాను. సంభ్రమాశ్చర్యాలకు గురిచేసేలా సినిమా ఉండబోతోంది. శ్రద్ధా శ్రీనాథ్, మీనాక్షి చౌదరి అద్భుతంగా నటించారు' అని చెప్పారు. రవితేజ ముళ్లపూడి మాట్లాడుతూ 'ట్రైలర్‌లో కొంతే చూశారు. సినిమాలో చాలా కంటెంట్ ఉంది. ఇక నుంచి వరుస అప్డేట్స్ ఇస్తాం. ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని కోరారు. రామ్ తాళ్లూరి మాట్లాడుతూ 'ప్రేక్షకులకు ట్రైలర్ నచ్చినందుకు ఆనందంగా ఉంది. సినిమా కూడా మాస్ కా దాస్ రేంజ్‌లో ఉంటుంది. థియేటర్లలో మాస్ జాతర ఖాయం' అన్నారు. కథలో కీలకమైన పాత్ర నాది, దర్శకుడు సినిమాను తెరకెక్కించిన తీరు అద్భుతం అని శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

ఆ తప్పులన్నీ మోహన్‌లాల్‌కు తెలుసు



నటి, పృధ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక సుకుమారన్ హేమ కమిటీ నివేదిక, నటుడు మోహన్‌లాల్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. "అమ్మ (మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్)లో ఏ సమస్యపై నోరు మెదపని వారికే ప్రాముఖ్యత ఎక్కువ. పేదరికంలో ఉన్న కళాకారులకు ఇచ్చే పథకాల్లోనూ అవకతవకలు జరిగాయి. ఈ సంస్థలో జరిగే తప్పులన్నీ మోహన్‌లాల్‌కు తెలుసు. అమ్మలో పక్షపాతం రాజ్యమేలుతోంది" అని ఆరోపించారు. అలాగే లైంగిక వేధింపులు ఎదుర్కొన్న నటి భావన గురించి మాట్లాడుతూ "ఆమె లైంగిక వేధింపులు ఎదుర్కొన్న విషయం నూటికి నూరు శాతం వాస్తవం. ఏడేళ్లు గడిచినా ఈ విషయంలో ఆమెకు ఇంకా న్యాయం ఎందుకు జరగట్లేదు. ఆమెకు సత్వర న్యాయం జరగాలి" అని డిమాండ్ చేశారు.

హీరో లేకుండా హిట్ కోసం

ఓ పక్క హీరోలతో ఆడిపాడుతూనే.. వారికి ధీటైన పాత్రల్లోనూ నటిస్తున్నారు నేటితరం కథానాయికలు. మహిళా ప్రాధాన్య కథలతో వచ్చే సినిమాల సంఖ్య ఇండస్ట్రీలో గతంలో కన్నా ఎక్కువగానే ఉంది. దర్శకులు కూడా హీరోయిన్ల కోసం సరికొత్త పాత్రలు సృష్టిస్తున్నారు. లీడ్ రోల్‌లో నటిస్తూ సినిమా భారాన్నంతా తమ భుజాలపైనే మోస్తున్న టాలీవుడ్ కథానాయికల గురించి తెలుసుకుందాం.













ఒకప్పుడు వరుస సినిమాలు చేసి అగ్రనటిగా వెలుగొందిన నటి సమంత. ఇప్పుడు ఆమె నటించిన వెబ్‌సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్ 'హనీబన్నీ' స్ట్రీమింగ్ అవనున్న సంగతి తెలిసిందే. అలానే ఆమె ఓ నూతన ప్రాజెక్ట్‌లోనూ నటిస్తున్నారు. మహిళా ప్రాధాన్యమున్న 'మా ఇంటి బంగారం' అనే సినిమాలో ఓ శక్తిమంతమైన ఇల్లాలి పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాతో సామ్ నిర్మాతగా కూడా మారారు. సమంత పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రకటించారు. ఆమె ఇది వరకే మహిళా ప్రాధాన్యం ఉన్న 'యశోదా', 'శాకుంతలం' చిత్రాల్లో నటించారు.

ప్రతీకారంతో స్వీటీ

సినిమాల్లో మహిళా ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఊపు తెచ్చారు అనుష్క శెట్టి. 'బాహుబలి'లో దేవసేన, 'వేదం'లో సరోజ పాత్రలు అలాంటివే. ఆమె అలాంటి పవర్‌ఫుల్ పాత్రలు పోషిస్తూనే 'అరుంధతి', 'రుద్రమదేవి', 'భాగమతి' 'సైజ్ జీరో' లాంటి మహిళా ప్రాధాన్య చిత్రాల్లోనూ నటించారు. ఆమె ప్రస్తుతం క్రిష్ దర్శకత్వంలో 'ఘాటి' అనే సినిమాలో నటిస్తున్నారు. ఓ మహిళ జీవితంలో తనకెదురైన గడ్డు పరిస్థితులను ఎలా ఎదుర్కొన్నారనేది ఆసక్తికరంగా ఉండనుంది. ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

రివాల్వర్ తో 'మహానటి'

'మహానటి' చిత్రంతో అందరి చేత శభాశ్ అనిపించుకోవడమే కాక జాతీయ స్థాయిలో ఉత్తమ నటి అవార్డును సొంతం చేసుకున్నారు కీర్తి సురేశ్. ఆ తర్వాత ఆమె 'మిస్ ఇండియా', 'గుడ్ లక్ సఖి', 'రఘు తాత' వంటి మహిళా ప్రాధాన్య చిత్రాల్లో నటించారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో వరుణ్ ధావన్ సరసన 'బేబీ జాన్' చిత్రంలో నటిస్తున్నారు. దీంతోపాటు 'రివాల్వర్ రీటా'లో నటిస్తున్నారు. ఇటీవలే ఆమె పుట్టినరోజు సందర్భంగా విడుదలైన టీజర్‌లో ఆమె పూర్తి మాస్ పాత్రలో కనిపించారు.

ఒకేసారి రెండు చిత్రాల్లో...

హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాల విషయంలో రష్మిక మందన్న ఓ అడుగు ముందే ఉన్నారు.ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'గర్ల్ ఫ్రెండ్', 'రెయిన్‌బో' చిత్రాలు రెండూ ఆ కోవకు చెందినవే. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రాలతో పాటు 'కుబేర', 'సికందర్', 'ఛావా' వంటి సినిమాల్లో కథానాయికగా వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారీ బ్యూటీ. మరోవైపు 'పుష్ప 2'లో ఆమె పోషిస్తున్న శ్రీవల్లి పాత్ర కూడా మొదటి భాగం కంటే మరింత శక్తిమంతంగా ఉండనున్నదట.

తొలిసారి...

'సార్' సినిమాలో 'మాస్టారు మాస్టారు' అంటూ యువకుల హృదయాలను కొల్లగొట్టిన నటి సంయుక్త. ఆమె తొలిసారి ఓ మహిళా ప్రాధాన్యం ఉన్న సినిమాలో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించారు. సామాజిక, రాజకీయ అంశాలే ప్రధానంగా తెరకెక్కుతోందీ సినిమా.

ట్రావెల్ నేపథ్యంలో..

ఇటీవలే 'టిల్లు స్క్వేర్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. ఆమె 'సినిమా బండి' ఫేమ్ ప్రవీణ్ కాండ్రేగుల దర్శకత్వంలో 'పరదా' అనే సినిమాలో నటిస్తున్నారు. ఈ ట్రావెల్ బేస్డ్ చిత్రంలో 'హృదయం' ఫేమ్ దర్శనా రాజేందర్ కూడా కీలక పాత్రలో మెరుస్తున్నారు.

పంథా మార్చి...

ఇప్పటివరకూ గ్లామర్ పాత్రలతో ప్రేక్షకులను అలరించిన తమన్నా.. తన పంథా మార్చి మొదటి సారి మహిళా ప్రాధాన్యత ఉన్న ఓ పాత్రను పోషిస్తున్నారు. 'ఓదెల 2' చిత్రంలో ఆమె శివశక్తి అనే నాగసాధువు పాత్రను పోషిస్తున్నారు. ఈ మధ్యే విడుదలైన ఆమె లుక్ అందర్నీ ఆకట్టుకుంది.

ఎనిమిదేళ్ల ప్రయాణం..

'మ్యాడ్' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్నారు అనంతిక సనీల్‌కుమార్. ఫణీంద్ర నార్సెట్టి దర్శకత్వంలో ఆమె ఓ విమెన్ ఓరియెంటెడ్ చిత్రం '8 వసంతాలు'లో నటిస్తున్నారు. ఇందులోని 'శుద్ధి అయోధ్య' పాత్ర కోసం ఆమె మార్షల్ ఆర్ట్స్‌లోనూ శిక్షణ పొందారు.

వీరితో పాటు మంచు లక్ష్మీ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'ఆది పర్వం'.. శ్రద్ధాదాస్ నటిస్తున్న 'త్రికాల'.. ప్రియమణి నటిస్తున్న 'క్యూజీ గ్యాంగ్'.. హన్సిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న హారర్ థ్రిల్లర్ 'గాంధారీ'.. వంటి చిత్రాలు కూడా కథానాయిక ప్రాధాన్యం ఉన్నవే.

తెలుగులో కొత్త టైటిల్?

హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా నటిస్తున్న హిందీ చిత్రం వార్-2. ఇప్పటికే ఎన్టీఆర్‌పై కొన్ని సన్నివేశాలను తెరకెక్కించారు. మరో కొత్త షెడ్యూల్ కోసం ఎన్టీఆర్ ముంబై వెళ్లారు. ఈసారి హృతిక్, ఎన్టీఆర్‌లపై ఓ పాట చిత్రీకరించబోతున్నట్లు వార్తలొస్తున్నాయి.



ఈ పాట ఇండియన్ స్ర్కీన్‌పై ఓ అద్భుతం అనుకొనే రీతిలో ఉండబోతున్నట్లు టాక్. కాగా, ఈ సినిమాకు సంబంధించి మరో వార్త చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రానికి తెలుగులో ఓ కొత్త టైటిల్‌ని నిర్ణయించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 'యుద్ధభూమి' అని పేరు పెడతారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యన పాన్ ఇండియా సినిమాలకు దేశ వ్యాప్తంగా ఒకే టైటిల్ చెలామణిలో ఉంటోంది. ఒకే టైటిల్ ఉంటే, అన్ని భాషల్లోనూ త్వరగా రీచ్ అవుతుందన్నది దర్శక నిర్మాతల ఆలోచన. అందుకే కొన్ని తమిళ సినిమాలు తమిళ టైటిల్‌తోనే దేశ వ్యాప్తంగా విడుదల అవుతున్నాయి. ఇలాంటి తరుణంలో 'వార్-2' కు తెలుగులో వేరే టైటిల్ పెడతారా? అన్నది వేచి చూడాలి.

ఎవర్నీ కలవకూడదనుకున్నా



గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి వరుస బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో భారీ భద్రత మధ్య బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ బిగ్ బాస్ షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ షూట్‌కి సంబంధించిన ఒక ఎపిసోడ్ శనివారం ప్రసారమైంది. ఈ సందర్భంగా సల్మాన్ ఖాన్ చేసిన కొన్ని కీలక వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'నేను ఈ రోజు ఇక్కడికి రాకూడదనుకున్నా. అస్సలు రావాలనిపించలేదు. మీతో పాటు ఎవరినీ కలవకూడదనుకున్నా. వృత్తి పట్ల ఉన్న నిబద్ధత వల్ల ఇక్కడికి వచ్చాను' అని సల్మాన్ అన్నారు. అయితే ముందు ఉన్నంత యాక్టీవ్‌గా ఈ ఎపిసోడ్‌లో సల్మాన్ కనిపించలేదు.

ఆ ప్రచారంలో నిజం లేదు

సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమాలో విలన్‌గా నటించడం కోసం కొంత కాలం నుంచి సైఫ్ అలీఖాన్‌తో పాటు ఆయన భార్య కరీనాని మూవీ మేకర్స్ సంప్రతించారని, దానికి వారు కూడా సానుకూలంగా స్పందించారని వార్తలొచ్చాయి. అయితే తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కరీనా మాట్లాడుతూ..అవి జస్ట్ రూమర్స్ అని కొట్టి పారేశారు. తమదైన విలక్షణ నటనతో బాలీవుడ్‌ని దశాబ్దాల నుంచి ఏలుతున్న ఈ జంట..సందీప్ రెడ్డి సినిమాలో చేయడం లేదని క్లారిటీ రావడంతో అభిమానులు నిరాశకు గురయ్యారు.



శంకరన్ నాయర్ పాత్రలో అక్షయ్ కుమార్



బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్, దర్శకుడు, నిర్మాత కరణ్ జోహార్ కాంబినేషన్‌లో మూడో చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాలో అక్షయ్ కుమార్ కేరళకు చెందిన ప్రముఖ రాజకీయ నేత, బారిస్టర్, సంస్కర్త అయిన సి.శంకరన్ నాయర్ పాత్రలో నటించనున్నారు. 'ద కేస్ దట్ షూక్ ద ఎంపైర్' నవల ఆధారంగా ఈ సినిమాని రూపొందిస్తున్నారు. జలియన్ వాలా భాగ్ మారణకాండ నేపథ్యంలో సాగే చిత్రమిది. కరణ్ జోహార్‌కు చెందిన ధర్మ ప్రొడక్షన్స్ తాజాగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ సినిమా పోస్టర్‌ని షేర్ చేస్తూ, విడుదల తేదీని ప్రకటించింది. ఈ చిత్రానికి కరణ్ సింగ్ త్యాగి దర్శకత్వం వహించనున్నారు. అక్షయ్ కుమార్‌తోపాటు ఆర్. మాధవన్, అనన్య పాండే నటిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 14న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.

ఇన్ ప్రోగ్రెస్

పెళ్లి పుస్తకం అంత హిట్ అవుతుందన్నారు

రమేశ్ చెప్పాల



'ప్రతి మనిషి జీవితంలో పుట్టుక, పెళ్లి, మరణం మూడు ప్రధాన ఘట్టాలు. పెళ్లి కుదిర్చేటప్పుడు రెండువైపులా కుటుంబాలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాన్ని లగ్గం సినిమా ద్వారా చూపించబోతున్నాం' అని దర్శకుడు రమేశ్ చెప్పాల అన్నారు. సాయిరోనక్, ప్రగ్నా నగ్ర జంటగా నటించిన ఈ చిత్రానికి వేణుగోపాల్ రెడ్డి నిర్మాత. ఈనెల 25న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రమేశ్ చెప్పాల సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు. తెలంగాణ సంస్కృతిలో 'లగ్గం' అనేదానికి ప్రత్యేక స్థానం ఉంది. దీనిచుట్టూ ఉన్న భావోద్వేగాలను తెరపైకి తీసుకురావాలనుకున్నాను. 'లగ్గం' అనే టైటిల్ చెప్పగానే అందరూ బావుందన్నారు. రాజేంద్ర ప్రసాద్ 'ఇది 'పెళ్లి పుస్తకం' అంత పెద్ద హిట్ అవుతుంద'న్నారు. క్లైమాక్స్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. లగ్గం అరిటాకులో విందు భోజనంలా ఉండబోతోంది' అని చెప్పారు.

హాస్యం అలరిస్తోంది



రామ్ కార్తీక్, కశ్వి హీరో హీరోయిన్లుగా మనోజ్ పల్లేటి దర్శకత్వం వహించిన 'వీక్షణం' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆదివారం యూనిట్ సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. మనోజ్ పల్లేటి మాట్లాడుతూ "వీక్షణం' చిత్రానికి వస్తున్న ఆదరణతో చాలా సంతోషంగా ఉంది. కామెడీ సన్నివేశాలను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. మేం ఊహించిన దానికన్నా పెద్ద విజయాన్ని ప్రేక్షకులు అందించారు' అని చెప్పారు. రామ్ కార్తీక్ మాట్లాడుతూ 'నా తొలి చిత్రానికి ఇంత మంచి స్పందన దక్కడం ఆనందాన్నిచ్చింది. మా సినిమాకు మంచి రివ్యూలు వచ్చాయి. వసూళ్లు నిలకడగా కొనసాగుతున్నాయి. ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలుపుతున్నాను' అన్నారు. ప్రేక్షకులకు మా సినిమా నచ్చితే మరో నలుగురికి చెప్పి ప్రోత్సహించండి అని నిర్మాత కోరారు.

ఏక్తా కపూర్‌పై పోక్సో కేసు



ప్రముఖ బాలీవుడ్ నిర్మాత ఏక్తా కపూర్‌పై పోక్సో కేసు నమోదైంది. ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆల్ట్ బాలాజీలో ప్రసారమవుతోన్న 'గందీ బాత్ సీజన్-6'కు సంబంధించి ముంబయి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సిరీస్‌ను బాలాజీ టెలిఫిల్మ్ లిమిటెడ్ బ్యానర్‌పై తెరకెక్కించారు. ఇందులో మైనర్ బాలికలకు సంబంధించిన అసభ్యకరమైన దృశ్యాలను చూపించారన్న ఆరోపణలతో పోక్సో కింద ఆమెతోపాటు తల్లి శోభా కపూర్‌పై కేసు నమోదైంది. కాగా, ఏక్తాకపూర్ ఈ ఏడాది లవ్, సెక్స్ ఔర్ ధోఖా-2 సినిమాకు నిర్మాతగా వ్యవహరించారు.

'ఆటో' ఎగుమతుల్లో 14% వృద్ధి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో భారత్ నుంచి ఆటోమొబైల్ ఎగుమతులు 14% పెరిగి 25,28,248కి చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో ఎగుమతైన వాహనాల సంఖ్య 22,11,457 యూనిట్లు. ప్రధానంగా ప్రయాణికుల వాహనాలు, ద్విచక్ర వాహనాల ఎగుమతులు మొత్తం ఎగుమతుల్లో వృద్ధికి దోహదపడ్డాయి. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలు కరెన్సీ విలువ క్షీణత ప్రభావం నుంచి బయటపడడంతో ఎగుమతులు పునరుజ్జీవం సాధించాయని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	515
వరంగల్	502	గోదావరి	515
చిత్తూరు	548	విశాఖపట్నం	510
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	130
వరంగల్	120	గుంటూరు	130
కరీంనగర్	120	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	129
కర్నూలు	120	నెల్లూరు	129
విశాఖపట్నం	120	అనంతపురం	129
గోదావరి	130		

రూ.6,000 కోట్ల ప్రిఫరెన్షియల్ ఇష్యూకి గ్రీన్‌సిగ్నల్

రిలయన్స్ ఇన్‌ఫ్రా

న్యూఢిల్లీ: ప్రిఫరెన్షియల్ ఇష్యూ ద్వారా రూ.6,000 కోట్లు సమీకరించేందుకు అనిల్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ ఇన్‌ఫ్రా సిద్ధమైంది. పోస్టల్ బ్యాలెట్ ద్వారా జరిగిన ఓటింగ్‌లో 98 శాతానికి పైగా వాటాదారులు ఇందుకు ఆమోదం తెలిపారు. ప్రిఫరెన్షియల్ ఇష్యూ, క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) మార్గంలో షేర్లు, వారెంట్లు జారీ చేయడం ద్వారా కంపెనీ ఈ నిధులు సమీకరించనుంది. గత నెల 19న జరిగిన భేటీలో కంపెనీ డైరెక్టర్ల బోర్డు కూడా ఇందుకు ఆమోదం తెలిపింది. ఇందులో రూ.3,014 కోట్లు ప్రిఫరెన్షియల్ ఇష్యూ/వారెంట్ల ద్వారా, రూ.3,000 కోట్లు క్యూఐపీ ద్వారా సేకరిస్తారు. ఈ నిధులను వ్యాపార విస్తరణ, వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం రిలయన్స్ ఇన్‌ఫ్రా వినియోగించనుంది.

శ్రీరామ్ లిక్విడ్ ఫండ్

శ్రీరామ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్.. శ్రీరామ్ లిక్విడ్ ఫండ్‌ను ప్రారంభిస్తోంది. ఇది ఓపెన్ ఎండెడ్ లిక్విడ్ పథకం. ఈ ఫండ్ నవంబరు 4న ప్రారంభమై అదే నెల 8న ముగియనుంది. సాంప్రదాయ పొదుపు ఖాతాలకు ప్రత్యామ్నాయంగా ఇన్వెస్టర్లకు నిలకడైన రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను రూపొందించింది. డెట్, మనీ మార్కెట్లలో ఏ1 ప్లస్ రేటెడ్ ఉన్న ఇన్‌స్ట్రుమెంట్స్‌లోనే ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ సగటు మెచ్యూరిటీ కాలం 91 రోజులుగా ఉంది.

ట్రస్ట్ ఎంఎఫ్ స్మాల్ క్యాప్ ఫండ్

ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్.. స్మాల్‌క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్‌కు నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 టీఆర్ఐ ఇండెక్స్ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. సిప్ రూపంలో కూడా కనీసం రూ.1,000 పెట్టుబడిగా పెట్టాల్సి ఉంటుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 25.

ఆరు నెలల్లో మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి
రూ.30,350 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) తొలి ఆరు నెలలు మిడ్ అండ్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌కు పెద్దగా కలిసి రాలేదు. ఈ ఏడాది ఏప్రిల్-సెప్టెంబరు మధ్య కాలంలో మదుపరులు ఈ ఫండ్స్‌లో రూ.30,350 కోట్లు మదుపు చేశారు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.2,582 కోట్లు తక్కువని మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమకు ప్రాతినిధ్యం వహించే అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) తెలిపింది. ఈ ఫండ్స్‌లో ఏదో గూడుపుఠానీ జరుగుతోందని సెబీ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం. గత ఆరు నెలల్లో మిడ్ అండ్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి వచ్చిన పెట్టుబడుల్లో రూ.14,756 కోట్లు మిడ్ క్యాప్ ఫండ్స్‌లోకి, రూ.15,586 కోట్లు స్మాల్ క్యాప్ ఫండ్స్‌లోకి వచ్చాయి. అయితే ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో మిడ్ అండ్ స్మాల్ క్యాప్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలతో పోలిస్తే 20 నుంచి 24 శాతం అధికంగా పెరిగాయి. దీంతో సెబీ జర జాగ్రత్త అని హెచ్చరించినా, ఇన్వెస్టర్లు మిడ్ అండ్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌లో ఇంకా భారీగానే మదుపు చేస్తున్నట్టు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. మార్కెట్లో దిద్దుబాటు జరిగితే తప్ప ఈ పెట్టుబడుల జోరుకు బ్రేక్ పడదని భావిస్తున్నారు.

నవంబరు 1న ముహూరత్ ట్రేడింగ్

ఈ సంవత్సరం దీపావళి రోజు జరిగే 'ముహూరత్' ట్రేడింగ్ సమయం ఖరారైంది. ఆ రోజు అంటే నవంబరు 1న సాయంత్రం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు ఈ ట్రేడింగ్ జరుగుతుందని స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వేర్వేరు ప్రకటనల్లో తెలిపాయి. ఆ రోజు నుంచి హిందూ కాలమానం ప్రకారం కొత్త సంవత్సరం 'సంవత్ 2081' ప్రారంభం కానుంది. ఆ రోజు జరిగే ముహూరత్ ట్రేడింగ్.. మదుపరులు, బ్రోకర్లకు భోగ, భాగ్యాలు ప్రసాదిస్తుందని మార్కెట్ వర్గాల నమ్మకం. ఏటా దీపావళి రోజు మార్కెట్లకు సెలవైనా, ఆ రోజు సాయంత్రం ఒక గంటసేపు ముహూరత్ ట్రేడింగ్ పేరుతో లాంఛనప్రాయంగా ట్రేడింగ్ నిర్వహిస్తారు. ఈ సంవత్సరం దీపావళి రోజు సాయంత్రం 5.45 నుంచి 6 గంటల వరకు ప్రీఓపెనింగ్ సెషన్ ఉంటుంది. ఆ రోజు సాయంత్రం ఆరు నుంచి ఏడు గంటల మధ్య ఈక్విటీ, కమోడిటీ డెరివేటివ్స్, కరెన్సీ డెరివేటివ్స్, ఈక్విటీ ఎఫ్ అండ్ ఓ సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ బారోయింగ్ విభాగాల్లో ముహూరత్ ట్రేడింగ్ జరగనుంది.

పీఎస్‌యూ షేర్లలో ట్రేడింగ్ వద్దు

» అధికారులకు దీపమ్ ఆదేశాలు

ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) షేర్లు వేటిలోనూ ట్రేడింగ్ చేపట్టరాదని ప్రభుత్వ పెట్టుబడులు, నిర్వహణ శాఖ (దీపమ్) తన అధికారులను ఆదేశించింది. దీనికి సంబంధించి ఒక అంతర్గత నోట్ జారీ చేసింది. పీఎస్‌యూలకు సంబంధించిన కీలక సమాచారం ఈ అధికారులకు అందుబాటులో ఉండే అవకాశం ఉన్నందున దీపమ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు భావిస్తున్నారు. దీపమ్‌లో చేరే అధికారులు తమ పోర్టుఫోలియోలోని పీఎస్‌యూ కంపెనీల షేర్ల వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని కూడా కోరింది. ఈ కంపెనీల షేర్లను వీరు దీపమ్ ఉన్నతాధికారుల అనుమతి పొందిన తర్వాత మాత్రమే విక్రయించాలని కూడా స్పష్టం చేసింది. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో పనిచేసే దీపమ్.. పీఎస్‌యూల్లో ప్రభుత్వ ఈక్విటీ మూలధన నిర్వహణ, వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణను పర్యవేక్షిస్తుంటుంది. ఈ నేపథ్యంలో దీపమ్ ఉన్నతాధికారులు ఈ సర్క్యులర్ జారీ చేయడం విశేషం.

బిల్డర్ల ఆగడాలకు చెక్ పెట్టండి

» ప్రభుత్వానికి ఎఫ్‌పీసీఈ వినతి

న్యూఢిల్లీ: పెరిగిపోతున్న బిల్డర్ల అక్రమాలకు చెక్ పెట్టాలనే వాదన మరింత ఊపందుకుంది. ఇందుకోసం 2019 నాటి 'వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం' పరిధిలోనే 'స్థిరాస్తి' రంగానికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని నివాస గృహాల కొనుగోలుదారులకు ప్రాతినిధ్యం వహించే 'ఫోరమ్ ఫర్ పీపుల్స్ కలెక్టివ్ ఎఫర్ట్స్ (ఎఫ్‌పీసీఈ) ప్రభుత్వాన్ని కోరింది. ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు అభయ్ ఉపాధ్యాయ కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి నిధి ఖరేకి దీనికి సంబంధించి ఒక లేఖ రాశారు. బిల్డర్ల అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఈ మార్గదర్శకాలు తప్పనిసరి అని ఆయన తన లేఖలో స్పష్టం చేశారు. ప్రస్తుతం వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం కింద వినియోగదారుల ఫోరమ్స్‌లో దాఖలవుతున్న ఫిర్యాదుల్లో పది శాతం స్థిరాస్తి రంగానికి సంబంధించిన ఫిర్యాదులనే విషయాన్ని ఉపాధ్యాయ గుర్తు చేశారు.

25,200 ఎగువన బుల్లిష్

(అక్టోబరు 21-25 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 25,212-24,568 పాయింట్ల మధ్యన కదలాడి 110 పాయింట్ల నష్టంతో 24,854 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,200 పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,830, 24,954, 25,039, 25,381 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50, 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 25,200 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 24,550
నిరోధ స్థాయిలు : 25,050, 25,150, 25,250 (24,950 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 24,650, 24,550, 24,450 (24,750 దిగువన బేరిష్)

25,000 స్థాయి కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో మరింత కరెక్షన్‌ను కొనసాగించినప్పటికీ శుక్రవారం బలమైన రికవరీ సాధించి ముందు వారం కన్నా 110 పాయింట్ల నష్టంతో 24,850 వద్ద ముగిసింది. శుక్రవారం 250 పాయింట్ల మేరకు ఇంట్రాడే రికవరీ సాధించడం దిగువ స్థాయిలో మార్కెట్ మద్దతు సాధించిందనేందుకు సంకేతం. మిడ్‌క్యాప్-100 సూచీ కూడా గత శుక్రవారం 1,000 పాయింట్ల మేరకు బలమైన రికవరీ సాధించి వారం మొత్తం మీద నష్టాన్ని 560 పాయింట్లకు కుదించుకుంది. స్మాల్‌క్యాప్-100 సూచీ సైతం కనిష్ఠ స్థాయిల నుంచి రికవరీ సాధించి వారం మొత్తం మీద 70 పాయింట్ల లాభంతో ముగిసింది. గత రెండు వారాలుగా కనిష్ఠ స్థాయిల్లో రికవరీ సాధిస్తూ వస్తున్నా వారం రేంజీకి మధ్యస్థంగా ముగుస్తూ ఉండడం ట్రెండ్‌లో అనిశ్చితిని సూచిస్తోంది. గత రెండు వారాలుగా 25,000 వద్ద ఊగిసలాడుతున్న నిఫ్టీ ఈ వారంలో కూడా ఆ స్థాయిలో పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది. 25,000 వద్ద మార్కెట్ నిలదొక్కుకుని సానుకూల ట్రెండ్‌లో ప్రవేశించేది, లేనిది వేచి చూడాలి.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే ప్రధాన నిరోధం 25,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 25,250. స్వల్పకాలిక సానుకూల ధోరణి కోసం ఈ స్వల్పకాలిక నిరోధం వద్ద మార్కెట్ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: 25,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది. మద్దతు స్థాయి 24,700. బలహీనతను నివారించేందుకు ఇక్కడ తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడుతుంది. మరో మద్దతు స్థాయి 24,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం 51,000 వరకు దిగజారిన బ్యాంక్ నిఫ్టీ చివరికి 800 పాయింట్ల లాభంతో 52,000 సమీపంలో ముగిసింది. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 52,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రస్తుత మద్దతు స్థాయి 52,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: మరింత సానుకూలత కోసం నిఫ్టీ 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి. గత వారం నిఫ్టీ 100 డీఎంఏ వద్ద రికవరీ సాధిస్తున్నట్టు కనిపిస్తోంది. ఇప్పుడు 25,000 సమీపంలో ఉన్న 50 డీఎంఏకు చేరువవుతోంది. సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,940, 25,000
మద్దతు	24,770, 24,700

అప్రమత్తంగా ఉండటం బెటర్!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడుదొడుకులకు లోనయ్యే అవకాశాలున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఎఫ్ఐఐల పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్లో నెగిటివ్ సెంటిమెంట్‌కు కారణంగా ఉన్నాయి. ఈ వారం నిఫ్టీకి 24,850 వద్ద మద్దతు, 25,000 వద్ద నిరోధం ఉన్నాయి. నిఫ్టీ.. మరికొన్ని సెషన్లు ఇదే శ్రేణిలో కదలాడే అవకాశం ఉంది.

స్టాక్ రికమండేషన్స్

మజగాన్ డాక్: బలహీనమైన మార్కెట్ సెంటిమెంట్‌లోనూ బలంగా పుంజుకున్న షేరు ఇది. జీవితకాల గరిష్ఠ స్థాయి నుంచి 34 శాతం మేర కరెక్షన్ జరిగింది. ప్రస్తుతం భారీ వాల్యూమ్‌తో అక్యుములేషన్ కొనసాగుతోంది. రూ.4,000 స్థాయిలో మద్దతు తీసుకున్న ఈ కౌంటర్ గత శుక్రవారం 6.81 శాతం లాభంతో రూ.4,526 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.4,550/4,500 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,850/5,000 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,400 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఎన్ఎండీసీ: గత ఏడాది అక్టోబరు నుంచి మే నెల వరకు అప్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరులో ప్రస్తుతం దిద్దుబాటు కనిపిస్తోంది. రూ.206 స్థాయిలో మద్దతు తీసుకున్న తర్వాత హయ్యర్ హైస్ ఫామ్ ఏర్పడటం బలాన్ని సూచిస్తోంది. గత శుక్రవారం 3.31 శాతం లాభంతో రూ.231 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మూమెంటమ్ ఇన్వెస్టర్లు రూ.230/220 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.265/290 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.210 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

బాటా ఇండియా: చాలా కాలంగా డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతున్నాయి. సెప్టెంబరు త్రైమాసికంలో ఈపీఎస్ 173 శాతం పెరగటం, మంచి ఫలితాలు విడుదల చేస్తుందన్న అంచనాలతో ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు 2.09 శాతం లాభంతో రూ.1,464 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,450 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,550/1,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,420 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ పవర్: ప్రస్తుతం ఈ షేరు మంచి రిస్క్ రివార్డ్ రేషియోతో లభిస్తున్నాయి. జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. నిఫ్టీతో పోల్చితే మెరుగ్గా రాణిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు 1.75 శాతం లాభంతో రూ.1,973 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,950 శ్రేణిలో ఎంటరై రూ.2,050/2,110 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,910 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: నిఫ్టీతో పోలిస్తే ఈ కౌంటర్ మెరుగ్గా రాణిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. బలహీనమైన మార్కెట్లోనూ ఈ షేరు అదరగొడుతోంది. గత శుక్రవారం 2.4 శాతం లాభంతో రూ.753 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.730/750 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.810/840 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించాలి. అయితే రూ.720 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

స్పోర్ట్స్



36 ఏళ్ల తర్వాత..

భారత గడ్డపై టెస్టు నెగ్గిన కివీస్

8 వికెట్ల తేడాతో టీమిండియా ఓటమి



యంగ్ · రచిన్

బెంగళూరు: ఆశలు అడియాశలయ్యాయి.. భారత బౌలర్ల నుంచి అద్భుతాలేమీ జరుగలేదు. వరుస విజయాలతో దూసుకెళుతున్న టీమిండియాకు గట్టి ఝలక్ తగిలింది. ఆఖరి రోజు ఆదివారం 107 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని న్యూజిలాండ్ పెద్దగా కష్టపడకుండానే ఛేదించింది. దీంతో 8 వికెట్ల తేడాతో నెగ్గిన లాథమ్ సేన.. భారత గడ్డపై చిరస్మరణీయ విజయాన్నందుకుంది. ఎందుకంటే.. ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా 36 ఏళ్ల తర్వాత వారికి దక్కిన టెస్టు గెలుపిది. అప్పుడెప్పుడో 1988లో చివరిసారిగా వాంఖడే మైదానంలో కివీస్ నెగ్గింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే. కివీస్ రెండో ఇన్నింగ్స్‌లో 27.4 ఓవర్లలో 2 వికెట్లకు 110 పరుగులు చేసి గెలిచింది. విల్ యంగ్ (48 నాటౌట్), ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రచిన్ రవీంద్ర (39 నాటౌట్) అజేయంగా నిలిచారు. బుమ్రాకు రెండు వికెట్లు దక్కాయి. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 46, రెండో ఇన్నింగ్స్‌లో 462 పరుగులు చేయగా, కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 402 పరుగులు చేసింది. రెండో టెస్టు పుణెలో 24 నుంచి జరుగనుంది.

'రెండో' బంతికే వికెట్ పడినా..: శనివారం సాయంత్రం నుంచి కురిసిన వర్షం ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. సరిగ్గా మ్యాచ్ సమయానికి ఆగినా.. మైదానాన్ని సిద్ధం చేసేందుకు సమయం పట్టింది. దీంతో గంట ఆలస్యంగా ఆట ఆరంభమైంది. అయితే పిచ్‌ను రాత్రంతా కప్పి ఉంచడంతో పాటు పగుళ్లు కూడా కనిపిస్తుండడం, ఆకాశం మేఘావృతంగా ఉండడంతో భారత బౌలర్లు కివీస్‌ను ఇబ్బందిపెట్టగలరనిపించింది. దీనికి తగ్గట్టుగానే పేసర్లు చక్కటి బౌన్స్ రాబట్టారు. నాలుగోరోజు ఆట చివర్లో తొలి ఓవర్‌ను నాలుగు బంతులకే ముగించిన విషయం తెలిసిందే. ఇక, ఐదోరోజు ఆటలో బుమ్రా ఆ ఓవర్‌ను కొనసాగిస్తూ రెండో బంతి (ఆరోది)కే ఓపెనర్ లాథమ్ (0)ను ఎల్బీ చేశాడు. లాథమ్ డీఆర్ఎస్‌కు వెళ్లినా ఫలితం లేకపోయింది. అటు సిరాజ్ పకడ్బందీగా బంతులేస్తూ తన తొలి ఓవర్‌ను మెయిడిన్‌గా ముగించాడు. ముఖ్యంగా బుమ్రా బంతులు కివీస్ బ్యాటర్లను తాకుతూ భయపెట్టాయి. కివీస్ తొలి పది ఓవర్లలో 21 రన్స్ చేసింది. 13వ ఓవర్‌లో కాన్వేను బుమ్రా ఎల్బీ చేసినా అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో భారత్ రివ్యూకు వెళ్లి ఫలితం సాధించింది. దీంతో 35/2 స్కోరుతో కివీస్ కాస్త ఇబ్బందుల్లో పడినట్టు కనిపించినా.. రచిన్ రాగానే రెండు ఫోర్లతో పరిస్థితిని మార్చేశాడు. దీనికితోడు చక్కగా వెలుతురు కూడా రావడం కివీస్‌కు కలిసొచ్చింది. అటు యంగ్ కూడా 14వ ఓవర్‌లో వరుస ఫోర్లతో ఎదురుదాడికి దిగాడు. కుల్దీప్ ఓవర్లలో యంగ్ సిక్సర్, రచిన్ 3 ఫోర్లు కొట్టడంతో పరుగులు వేగంగా వచ్చాయి. దీంతో ఇక భారత్‌కు ఎలాంటి ఆశలు లేకపోయాయి. 28వ ఓవర్‌లో సింగిల్‌తో యంగ్ తమ జట్టుకు అద్భుత విజయాన్నందించాడు.

2013 నుంచి సొంత గడ్డపై భారత్ ఓటములు

జట్టు	తేడా	వేదిక	ఏడాది
ఆసీస్	333 రన్స్‌తో	పుణె	2017
ఇంగ్లండ్	227 రన్స్‌తో	చెన్నై	2021
ఆసీస్	9 వికెట్లతో	ఇండోర్	2023
ఇంగ్లండ్	28 రన్స్‌తో	హైదరాబాద్	2024
కివీస్	8 వికెట్లతో	బెంగళూరు	2024

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 46
కివీస్ తొలి ఇన్నింగ్స్: 402
భారత్ రెండో ఇన్నింగ్స్: 462
కివీస్ రెండో ఇన్నింగ్స్: టామ్ లాథమ్ (ఎల్బీ) బుమ్రా 0; కాన్వే (ఎల్బీ) బుమ్రా 17; యంగ్ (నాటౌట్) 48; రచిన్ (నాటౌట్) 39; **ఎక్స్‌ట్రాలు:** 6; **మొత్తం:** 27.4 ఓవర్లలో 110/2. **వికెట్ల పతనం:** 1-0, 2-35. **బౌలింగ్:** బుమ్రా 8-1-29-2; సిరాజ్ 7-3-16-0; జడేజా 7.4-1-28-0; కుల్దీప్ 3-0-26-0; అశ్విన్ 2-0-6-0.

1 ఓ ఇన్నింగ్స్‌లో ఎక్కువ పరుగులు (462) చేసినా ఓడడం భారత్‌కిదే తొలిసారి

3 మొదటి రోజు ఆట వర్షార్పణమైనా ఫలితం రావడం భారత గడ్డపై ఇది మూడోసారి. గతంలో కివీస్ (1976లో), ఆసీస్ (2013)లపై భారత్ గెలిచింది.
భారత పర్యటనలో కివీస్ ఆడిన 37 టెస్టుల్లో కేవలం ఇది మూడో విజయం. 1969, 1988లో ఒక్కో టెస్టు నెగ్గింది.

ఆ 3 గంటల ఆటతో అంచనాకు రావద్దు

ఈ మ్యాచ్ ఫలితం గురించి సీరియస్‌గా ఆలోచించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే తొలి ఇన్నింగ్స్‌లో ఆ 3 గంటల ఆటతోనే భారత జట్టు స్థాయిని అంచనా వేయలేరు. రెండో ఇన్నింగ్స్‌లో మేం పుంజుకున్న తీరు కూడా గమనించాలి. కొన్ని పొరపాట్లు చేసి ఫలితం అనుభవించాం. కానీ ఆ మాత్రానికే అంతా అయిపోయిందని భావించవద్దు. గతంలోనూ ఇలాగే జరిగి అద్భుతంగా పుంజుకున్నాం. పంత్‌ను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంది కాబట్టి కీపింగ్‌కు దించలేదు. - రోహిత్ శర్మ

ఓడినా టాప్‌లోనే..

న్యూజిలాండ్‌తో తొలి టెస్టును ఓడినా వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ పట్టికలో భారత జట్టు (98 పాయింట్లు) టాప్‌లోనే ఉంది. విజయాల శాతం మాత్రం 74.24 నుంచి 68.06కి పడిపోయింది. ఆస్ట్రేలియా (62.50), శ్రీలంక (55.56) టాప్-3లో ఉన్నాయి. ఈ గెలుపుతో కివీస్ ఆరో స్థానం నుంచి నాలుగో స్థానానికి ఎగబాకింది. మరోవైపు భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే రాబోయే టెస్టులు కీలకంగా మారాయి. ఆడాల్సిన ఏడు టెస్టుల్లో కనీసం ఐదింటిని గెలిస్తే నేరుగా ఫైనల్‌కు వెళుతుంది.

అటు పురుషులు.. ఇటు మహిళలు

న్యూజిలాండ్ డబుల్ ధమాకా

న్యూజిలాండ్ పురుషులు, మహిళల జట్లు ఒకేరోజు చరిత్రాత్మక విజయాలతో మురిపించాయి. టామ్ లాథమ్ సారథ్యంలోని పురుషుల జట్టు 36 ఏళ్ల తర్వాత భారత గడ్డపై తొలి టెస్టు విజయాన్ని అందుకోగా.. సోఫీ డివైన్ నేతృత్వంలోని మహిళల బృందం ఫైనల్లో దక్షిణాఫ్రికాను చిత్తుచేసి తొలిసారి టీ20 ప్రపంచ కప్ చాంపియన్‌గా అవతరించింది.



మహిళల టీ20 వరల్డ్ కప్
చాంపియన్ కివీస్

ఫైనల్లో సఫారీలు చిత్తు

దుబాయ్: మహిళల టీ20 ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్ జట్టు కొత్త చాంపియన్‌గా ఆవిర్భవించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఆ జట్టు 32 పరుగులతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. తొలుత కివీస్ 20 ఓవర్లలో 158/5 స్కోరు చేసింది. అమీలీ కెర్ (43), బ్రూక్ హాలీ డే (38), సుజీ బేట్స్ (32) సత్తా చాటారు. ఎం లాబా రెండు వికెట్లు పడగొట్టింది. ఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 126/9 స్కోరుకే పరిమితమై ఓడింది. వోల్వార్ట్ (33), బ్రిట్స్ (17), ట్రయన్ (14) మినహా అంతా విఫలమయ్యారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్, 'సిరీస్' అమీలీ కెర్ మూడు వికెట్లు పడగొట్టింది. 2009, 2010 టోర్నీలలో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ ఈసారి మాత్రం ట్రోఫీని దక్కించుకుంది. ఇది తొమ్మిదో టీ20 ప్రపంచ కప్‌కాగా.. గత 8 సార్లలో ఆసీస్ 6 సార్లు, ఇంగ్లండ్, వెస్టిండీస్ ఒక్కోసారి విజేతగా నిలిచాయి.

ఒత్తిడికి చిత్తు: ఛేదనలో ఓపెనర్లు శుభారంభం ఇచ్చినా.. మిగతా బ్యాటర్లు ఒత్తిడికి చిత్తవడంతో సౌతాఫ్రికాకు ఓటమితప్పలేదు. కెప్టెన్ వోల్వార్ట్, బ్రిట్స్ ధాటిగా ఆడి మొదటి వికెట్‌కు 51 పరుగులు జోడించారు. ఏడో ఓవర్లో బ్రిట్స్ (17)ను జొనాస్ అవుట్ చేయగా, పదో ఓవర్లో కీలకమైన వోల్వార్ట్‌తోపాటు బాష్ (9)ను పెవిలియన్ చేర్చిన కెర్ సఫారీలకు డబుల్ షాకిచ్చింది. అప్పటికే కొండెక్కిన రన్‌రేట్‌ను అధిగమించలేక సౌతాఫ్రికా వరుస వికెట్లు చేజార్చుకుని ఓటమి పాలైంది. దాంతో వరుసగా రెండోసారి సఫారీలు రన్నరప్‌గానే నిలవాల్సి వచ్చింది. 2023లో ఆ జట్టు ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలైంది.

ఆ ముగ్గురి దూకుడు: టాపార్డర్‌లో కెర్, బేట్స్, మిడిలార్డర్‌లో హాలీ డే దూకుడుగా ఆడడంతో కివీస్ పటిష్ఠ స్కోరు చేసింది. రెండో ఓవర్లో ప్లిమ్మెర్ (9)ను అవుటైనా బేట్స్, కెర్ వేగంగా ఆడి రెండో వికెట్‌కు 37 పరుగులు జత చేశారు. అనంతరం ధనాధన్ బ్యాటింగ్‌తో హాలీ డే, కెర్ నాలుగో వికెట్‌కు 57 పరుగులు జోడించారు.

సంక్షిప్తస్కోర్లు
న్యూజిలాండ్: 20 ఓవర్లలో 158/5 (కెర్ 43, హాలీ డే 38, బేట్స్ 32, ఎం లాబా 2/31).
దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 126/9 (వోల్వార్ట్ 33, బ్రిట్స్ 17, ట్రయన్ 14, కెర్ 3/24, మెయిర్ 3/25).

వాషింగ్టన్‌కు పిలుపు



చివరి రెండు టెస్టులకు ఎంపిక

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌లో 8 వికెట్లతో ఓడిన నేపథ్యంలో జాతీయ సెలెక్టర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. కివీస్‌తో జరిగే చివరి రెండు టెస్ట్‌లకు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌కు అదనంగా చోటు కల్పించారు. దాంతో జట్టు సభ్యుల సంఖ్య 16కు చేరింది. రెండో టెస్ట్ ఈనెల 24 నుంచి పుణెలో జరగనుంది. ఢిల్లీతో జరుగుతున్న రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో తమిళనాడు ఆటగాడు సుందర్ 152 రన్స్ చేశాడు.

రిత్విక్ జోడీకి 'అల్మాటీ' టైటిల్



రిత్విక్ · అర్జున్

న్యూఢిల్లీ: తెలుగు టెన్నిస్ ఆటగాడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరి అంతర్జాతీయ టోర్నీలో సత్తా చాటాడు. భారత్‌కే చెందిన అర్జున్ ఖడే జతగా అల్మాటీ ఓపెన్ టైటిల్ గెలిచాడు. ఆదివారం కజకిస్థాన్‌లో జరిగిన ఫైనల్లో రిత్విక్-అర్జున్ ద్వయం 3-6, 7-6, 14-12తో నికోలస్ (కొలంబియా)-స్కందర్ మన్‌సౌరి (ట్యునీషియా) జోడీని ఓడించింది.

హాకీ కుర్రాళ్ల రెండో గెలుపు

జొహర్ బహ్రు (మలేసియా): భారత హాకీ కుర్రాళ్లు సుల్తాన్ జొహర్ కప్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేశారు. ఆదివారం జరిగిన పోరులో భారత్ 6-4 గోల్స్ తేడాతో గ్రేట్ బ్రిటన్‌ను చిత్తుచేసింది. భారత జట్టులో దిల్ రాజ్ సింగ్, శర్దానంద్ తివారి చెరో రెండు గోల్స్‌తో విజృంభించగా.. మహ్మద్ కొనైన్ దాడ్, మన్‌మీత్ సింగ్ చెరో గోల్ కొట్టారు.

ఆంధ్ర ఫాలోఆన్

అహ్మదాబాద్: బ్యాటర్ల తడబాటుతో ఆంధ్ర జట్టు ఫాలోఆన్‌లో పడింది. ఆదివారం గుజరాత్‌తో రంజీ మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోరు 137/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 213 రన్స్‌కు ఆలౌటైంది. శ్రీకర్ భరత్ త్రుటిలో సెంచరీ (98)ని, నితీశ్‌కుమార్ రెడ్డి (47) అర్ధ శతకం చేజార్చుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర జట్టు మూడోరోజు ఆట ముగిసేసరికి 4 వికెట్లకు 203 రన్స్ చేసింది. ఓపెనర్లు అభిషేక్ రెడ్డి (81), మహీప్ కుమార్ (55) అర్ధ సెంచరీలు సాధించారు. ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరును అధిగమించి ఆంధ్ర జట్టు 49 పరుగుల స్వల్ప ఆధిక్యాన్ని సాధించింది. గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 367 పరుగులకు ఆలౌటైంది.

2 గంటలు.. 21 కిలోమీటర్లు



కశ్మీర్ మారథాన్‌లో సత్తా చాటిన సీఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కశ్మీర్ మారథాన్‌ను ఆదివారం ఇక్కడ ప్రారంభించారు. అయితే, కశ్మీర్ లోయలో తొలిసారి జరిగిన ఈ అంతర్జాతీయ రేసులో సీఎం కూడా పాల్గొన్నారు. అంతేకాదు.. ఆయన రెండు గంటల్లోనే 21 కిలోమీటర్లు పరిగెత్తడం విశేషం. అంతర్జాతీయ రన్నర్లకు దీటుగా పరిగెత్తి అందరి దృష్టిని సీఎం ఆకర్షించారు. ఈ రేసులో దాదాపు 2వేల మంది అథ్లెట్లు పోటీపడ్డారు.

ఉత్కంఠ పోరులో జైపూర్ గెలుపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11లో జైపూర్ పింక్ పాంథర్స్ శుభారంభం చేసింది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ 39-34తో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. జైపూర్ కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 15 రైడ్ పాయింట్లతో చెలరేగడంతో ఆ జట్టు విజయాన్ని అందుకుంది. కాగా, మరో మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్ 36-32తో బెంగళూరు బుల్స్‌ను ఓడించింది.

ప్రతీ ముగ్గురు మహిళల్లో ఒకరు తన జీవితకాలంలో ఏదో ఒక సమయంలో భర్త చేతిలో శారీరక, మానసిక, లైంగిక హింసకు గురవుతున్నారు. చాలా మంది మహిళలు తమపట్ల అమానుషాన్ని బయటకు చెప్పడం లేదు. అందులో 14 శాతం మంది మహిళలు మాత్రమే హింసను అరికట్టేందుకు సహాయం కోరుతూ బయటకు వస్తున్నారు. గృహహింసను ఎదుర్కొన్న మహిళలకు బాసటగా నిలుస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగు నింపేందుకు ప్రయత్నిస్తున్నారు **డా.ప్రసన్న గెట్టు**. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ క్రైమ్ ప్రివెన్షన్ అండ్ విక్టిమ్ కేర్ అనే సంస్థను స్థాపించి గృహహింసను రూపుమాపేందుకు కృషిచేస్తున్నారు.



ఆ మహిళల జీవితాల్లో వెలుగు కోసం...

పద్దెనిమిది నుంచి ముప్పైతొమ్మిదేళ్ల మధ్య వయస్సున్న పెళ్లయిన ప్రతీ ముగ్గురు మహిళల్లో ఒకరు గృహహింసను ఎదుర్కొంటున్నట్టు నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే వెల్లడించిన గణాంకాలు చెబుతున్నాయి. దీన్ని అరికట్టేందుకు, గృహహింస బారినపడిన మహిళలకు ఆసరాగా నిలిచేందుకు కృషిచేస్తున్నారు డా.ప్రసన్న గెట్టు. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ క్రైమ్ ప్రివెన్షన్ అండ్ విక్టిమ్ కేర్ అనే సంస్థ ద్వారా ఆమె సేవలందిస్తున్నారు. క్రిమినాలజిస్టుగా, విక్టిమాలజిస్టుగా మహిళల కోసం అవిశ్రాంత కృషి చేస్తున్నారామె. 2001లో మహిళల రక్షణ కోసం ఆమె ఈ సంస్థను స్థాపించారు. "మద్రాసు యూనివర్సిటీలో క్రిమినాలజీ డిపార్టుమెంటులో పీహెచ్‌డీ చేశాను. ఆ తరువాత జపాన్‌లోని టోకివా యూనివర్సి



టీలో పోస్ట్ డాక్టరేట్ డిప్లొమా ఇన్ విక్టిమాలజీ కోర్సు పూర్తి చేశాను. దీన్ని వరల్డ్ సొసైటీ ఆఫ్ విక్టిమాలజీ నిర్వహించింది. మొదటి బ్యాచులో నాతోపాటు మరో ఇద్దరు భారతీయులు ఉన్నారు. కోర్సులో భాగంగా మేం విక్టిమ్ అసిస్టెన్స్ సెంటర్స్‌ను సందర్శించాం. అది నాకు చాలా ఆసక్తిని కలిగించింది. ఇండియాకు తిరిగొచ్చాక ప్రయోగాత్మకంగా చెన్నైలో విక్టిమ్ అసిస్టెన్స్ సెంటర్‌ను ప్రారంభించాం. మా దగ్గరకు వచ్చిన కేసులన్నీ గృహహింసకు సంబంధించినవే. ఆ సమయంలో గృహహింసను ఎదుర్కొన్న మహిళలకు ఆశ్రయం ఇచ్చేందుకు ఎక్కడా కూడా షెల్టర్ హోమ్స్, కమ్యూనిటీ షెల్టర్స్ గానీ లేవు. అది గమనించిన మేం మా సేవలను ప్రారంభించాం. అమెరికాకు వెళ్లి అధ్యయనం చేశాం. షెల్టర్ హోమ్స్‌లో బస చేసి అవి ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకున్నాం. శిక్షణ తీసుకున్నాం. ఆ తరువాతే హెల్ప్ లైన్ సెంటర్, షెల్టర్ సర్వీస్ ప్రారంభించాం" అని సంస్థను ప్రారంభించిన తీరును వివరిస్తారు డా. ప్రసన్న గెట్టు. ఏ రకమైన హింసను ఎదుర్కొంటున్న మహిళలైనా సరే ఈ సంస్థ సేవలను పొందవచ్చు. 23 ఏళ్ల క్రితం ప్రారంభమైన హెల్ప్‌లైన్, ఇప్పుడు 'ధ్వని' పేరుతో నేషనల్ డొమెస్టిక్ వయొలెన్స్ హాట్‌లైన్‌గా మారి సేవలందిస్తోంది. "మహిళలు, వారి బంధువులు, స్నేహితులు ఎవరైనాసరే 24/7 కాల్ చేసి వారి సమస్యలు చెప్పుకోవచ్చు. వారు చెప్పేది పూర్తి గోప్యంగా ఉంచుతాం. వారు మాతో స్వేచ్ఛగా సమస్యల గురించి చెప్పుకునే వాతావరణాన్ని కల్పిస్తాం. ఆ తరువాత కౌన్సెలింగ్ ఇస్తాం. వాళ్లను హింసకు గురి చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చో వివరిస్తాం" అని అంటారు డా.గెట్టు.

అందరి బాధ్యత...

ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ క్రైమ్ ప్రివెన్షన్ అండ్ విక్టిమ్ కేర్ సంస్థ ఎమర్జెన్సీ షెల్టర్, లాంగ్ టర్మ్ షెల్టర్, ట్రాన్సిషన్ షెల్టర్ పేరుతో మూడు రకాల ఆశ్రయాలను అందిస్తోంది. "గృహహింస మహిళలకు సంబంధించిన సమస్యగానే చూడకూడదు. పురుషులు కూడా ఈ సమస్యపై మాట్లాడాలి. కంపెనీలు, ఇనిస్టిట్యూషన్లు బాధ్యత తీసుకోవాలి. ఇందులో దాచాల్సింది ఏమీ లేదు. అందరిపై బాధ్యత ఉంది. గృహహింస బారినపడిన ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే వాళ్లు ఒంటరి వాళ్లు కాదు. మంచి జీవితం గడిపేందుకు వాళ్లకూ అవకాశం ఉంది. వాళ్లకు సహాయసహకారాలు ఎప్పుడూ అందుబాటులో ఉంటాయి" అని భరోసా ఇస్తారు డా.గెట్టు. గృహహింసకు ఎలాంటి సరిహద్దులు లేవు. బీద, ధనిక తారతమ్యాలు లేవు. మనం ప్రేమించాల్సిన వ్యక్తులు చేస్తున్న హింస గురించి మాట్లాడుతున్నాం. గృహహింసను రూపుమాపేందుకు కొన్ని అంశాలను పాటించాలని ఆమె అంటున్నారు. "ప్రతి కుటుంబం బాధ్యత తీసుకోవాలి. పిల్లల ముందు తల్లిదండ్రులు వాదించుకోవడం ఆపేయాలి. లేదంటే ఈ హింస కొనసాగుతూనే ఉంటుంది. ఆ చక్రాన్ని బ్రేక్ చేయాల్సిన అవసరం ఉంది. అలాగే పాఠశాల విద్యలో గృహహింస గురించి చెప్పాలి. పిల్లలను ఎడ్యుకేట్ చేయాలి. గృహహింసను సాధారణ నేరంగా పరిగణించకుండా వెంటనే చర్యలు తీసుకునేలా మార్పులు చేయాలి. గృహహింస జరిగినప్పుడు చుట్టుపక్కల వాళ్లు మాకెందుకు అని వదిలేయకుండా స్పందించాలి" అని అంటారు డా.గెట్టు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే గృహహింస కనుమరుగవుతుంది అనడంలో సందేహం లేదు.

ఇల్లు చిన్నదైనా వస్తువులను క్రమపద్ధతిలో అమర్చుకుంటే విశాలంగా కనిపిస్తుంది. అనవసరమైన వస్తువులకు చోటివ్వకుండా కాస్త ఓపికతో సర్దుకుంటే చాలు. గది చిన్నగా ఉన్నా విశాలంగా కనిపించేలా చేసుకోవచ్చు. ఇల్లు విశాలంగా కనిపించాలంటే నిపుణులు సూచిస్తున్న సలహాలు ఇవి.

విశాలంగా కనిపించాలంటే!

- ఇంటి గోడలకు ముదురు రంగులు కాకుండా తెలుపు, బేబీ పింక్, కాపర్ పింక్ వంటి లేత రంగులు వేస్తే గదులు విశాలంగా కనిపిస్తాయి.
- కర్టెన్స్ వాడడం వల్ల ఇల్లు చిన్నదిగా కనిపిస్తుంది. అవసరమైనంత వరకు లేత రంగులో ఉండే పలుచని కర్టెన్లను కిటికీలకు, గుమ్మం ముందు వేసుకోవచ్చు. ప్రతి గదికీ కర్టెన్ వేయకూడదు. వీలైనంత వరకు కిటికీలు తెరచి ఉంచాలి. సూర్యరశ్మి లోపల పడితే గది ప్రకాశవంతంగా కనిపిస్తుంది. ఇంట్లో అద్దాలు పెట్టడం వల్ల కూడా కాంతి పరావర్తనం చెంది ఇల్లు పెద్దగా కనిపిస్తుంది.
- ఇంట్లో మనకి పనికిరాని వస్తువులు చాలా వచ్చి చేరుతుంటాయి. వాటన్నింటినీ అవసరమైనవారికి ఇచ్చేస్తే చాలా స్పేస్ కలసి వస్తుంది.
- ఇంటి పరిమాణాన్ని అనుసరించి ఫర్నిచర్ ఏర్పాటు చేసుకోవాలి. వివిధ రకాలుగా ఉపయోగించుకొనే మల్టీపర్పస్ ఫర్నిచర్‌ను ఎంచుకోవాలి. హాల్ చిన్నగా ఉన్నప్పుడు పెద్ద సోఫాలకు బదులు ఫోల్డింగ్ బెడ్ కొనుక్కోవచ్చు. ఇది సోఫాలా, బెడ్ మాదిరిగా కూడా ఉపయోగపడుతుంది.
- హాల్లో కానీ, బెడ్ రూమ్‌లో కానీ షెల్ఫ్‌లను సామాన్లతో నింపేయకూడదు. అవసరమైనవాటిని మాత్రమే అందంగా సర్దుకోవాలి. పిల్లలు ఆడుకొనే బొమ్మలు, ఫొటోఫ్రేమ్‌లు, టెడ్డీబేర్స్, గాజు సామాన్లు, పింగాణి వస్తువులను చక్కగా అమరిస్తే చూసేందుకు ఆకర్షణీయంగా, విశాలంగా కనిపిస్తుంది.



శాస్త్రీయ నృత్యానికి సామాజిక గాథలను మేళవించి జన రంజకమైన రూపకాలను రూపొందించడంలో నిష్ణాతురాలు ప్రఖ్యాత నాట్యాచారిణి **అలేఖ్య పుంజాల**. ఆమె ప్రదర్శించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు 'చాకలి ఐలమ్మ నృత్యరూపకం' ఎంతోమంది కళాభిమానుల నీరాజనాలు అందుకుంది. ఒకవైపు నృత్య ప్రదర్శనలు, మరోవైపు తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలిగా బాధ్యతలు, ఇంకోవైపు నృత్య శిక్షణతో భిన్న పాత్రలు పోషిస్తున్న అలేఖ్య నృత్య రూపకల్పన అనుభవాలను 'నవ్య'తో చెబుతున్నారిలా..!



అది నాకు దక్కిన అదృష్టం

"తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు... ఇది నాకు దక్కిన హోదా లేదా పదవి కాదు, కేవలం బాధ్యత మాత్రమే. ఈ కుర్చీలో కూర్చున్నప్పుడు పదిమందికి మంచి చేయాలి. మనం చేసే పని మిగతా వారిలా కాకుండా, ఒక కళాకారిణిగా భిన్నంగా నిర్వర్తించాలి. కళలకు, కళాకారులకు చేయూత అందించాలి. తద్వారా నేను స్వీకరించిన ఈ బాధ్యతకు సార్థకత చేకూర్చడమే నా కర్తవ్యం. ఈ మధ్య కాలంలో నాకు వృత్తి రీత్యా అత్యంత సంతృప్తి కలిగించింది 'చాకలి ఐలమ్మ' నృత్య రూపకాన్ని రూపొందించడం. ఇప్పటివరకు పురాణ ఇతిహాసాలలోని మండోదరి, దుస్సల, నాయకి, ద్రౌపది, సత్యభామ లాంటి ఎన్నో స్వాభిమానానికి ప్రతీకలైన పాత్రల్లో అభినయించాను. లకుమ, రుద్రమ తదితర చారిత్రక పాత్రలు ఇతివృత్తంగా సాగిన రూపకాలు ప్రదర్శించాను. అలాంటిది వాటన్నింటికన్నా భిన్నంగా మొట్టమొదటిసారిగా సాంఘిక నేపథ్యం కలిగిన ఓ వీరోచిత మహిళ పాత్రను ఎంచుకొన్నాను. అది తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు 'చాకలి ఐలమ్మ' గాథ. ఆ ధీర జీవితాన్ని నృత్య రూపకంగా ప్రదర్శించడం నాకు దక్కిన అదృష్టం. రవీంద్రభారతి వేదికగా 45నిమిషాలకుపైగా ప్రదర్శితమైన ఈ రూపకాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో పాటు ఇతర మంత్రులు కూడా ఆద్యంతం తిలకించడం నాకు గొప్ప విషయం. 'ఎంతో నిబద్ధత, కృషి ఉంటేకానీ ఇలాంటి ఒక నృత్య రూపకాన్ని ప్రదర్శించడం సాధ్యం కాదు" అని ఎంతోమంది ప్రశంసించారు.

తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా...

నాకు ఈ నృత్య రూపకం చేయాలన్న ఆలోచన రావడానికి ప్రధాన కారణం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గారు. "తెలంగాణలో భూపోరాటానికి నాంది పలికిన చాకలి ఐలమ్మ గారి జీవితం మీద నృత్యరూపకం చేయచ్చు కదా" అని ఒక సందర్భంలో ఆయన నాకు సూచించారు. యాభై ఏళ్ల నా నృత్య జీవితంలో ఇప్పటి వరకు నేను ఆత్మస్థైర్యం, స్వాభిమానం కలిగిన ఎన్నో మహిళల పాత్రలు పోషించాను. కానీ సాంఘిక పాత్ర ఒక్కటి కూడా చేయలేదు. మలిదశ తెలంగాణ ఉద్యమం సమయంలో ఐలమ్మ ధైర్యసాహసాల గురించి విన్నాను. కనుక ఆ మహనీయురాలి జీవితగాథ మీద ఒక వైబ్రెంట్ ప్రొడక్షన్ చేయాలి అని నిర్ణయించుకున్నాను. ఐలమ్మ జీవితంమీద అధ్యయనం ప్రారంభించాను. మొదటగా ఆ వీరనారి జీవితంమీద వచ్చిన పుస్తకాలు చదివాను. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంపై పరిశోధన చేసిన కొంతమంది విద్యార్థులతో సంభాషించాను. ప్రముఖ రచయిత వడ్డేపల్లి కృష్ణ గారిని సంప్రదించి, రూపకాన్ని రాసివ్వాల్సిందిగా కోరగానే అందుకు ఆయన అంగీకరించారు. ముఖ్యంగా గ్రాంథిక భాష వాడకుండా, అలా అని మరీ పలుచన కాకుండా సమకాలీన తెలంగాణ భాష, సంస్కృతులను ఎత్తిపట్టేలా రూపకాన్ని ప్రేక్షకులకు అందించాలన్నది నా అభిమతం. అనుకున్నట్టుగానే నా ఆలోచనలకు తగ్గట్టుగా స్క్రిప్ట్ వచ్చింది. వాస్తవానికి కాస్త భిన్నంగా కథకు మరింత బలాన్ని చేకూర్చడానికి బతుకమ్మ, బోనాలు ఉత్సవాలను జోడించాం. తెలంగాణ పల్లె వాతావరణాన్ని, ఆనాటి సామాజిక పరిస్థితులను ప్రతిబింబించేలా రూపకాన్ని తీర్చిదిద్దాం.

మరెన్నో ప్రయోగాలు చేయాలనుంది...

నాట్య శాస్త్రంలో లోకధర్మి, నాట్యధర్మి అని ఉంటాయి. మరీ ముఖ్యంగా ఈ రూపకాన్ని లోకధ



> "చాకలి ఐలమ్మ నృత్యరూపకాన్ని రూపొందిస్తున్న సమయంలో నాకు ఆ వీరనారి వారసులు పాలకుర్తిలో ఉన్నారన్న విషయం తెలిసింది. ఆ వెంటనే వారిని కార్యక్రమానికి ఆహ్వానించాం. అలా ఐలమ్మ గారి మునిమనుమడి భార్య శ్వేత ఐలమ్మ మా కార్యక్రమానికి రావడం, అదే వేదికపై ఆమెను తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలిగా సీఎం ప్రకటించడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. నా కార్యక్రమం ద్వారా ఆ కుటుంబం వెలుగులోకి రావడం, వారికి ప్రభుత్వం నుంచి సముచిత గౌరవం లభించడం నాకూ గర్వకారణమే కదా.! పైగా అదే వేదికపై నేను చదివిన ఆనాటి కోఠి మహిళా కళాశాల, ఈనాటి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు ప్రకటించడం... అలా ఆ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోయింది. అందులో నేను భాగం కావడం నా అదృష్టం."

ర్మిని అనుసరిస్తూ ప్రదర్శించాను. మా మామయ్య శివశంకర్ గారి అమ్మ సత్తెమ్మ నోట రజాకార్ల ఆగడాల గురించి గతంలో ఎన్నో సార్లు విన్నాను. పాటల రూపంలో గాథల రూపంలో నిజాం కాలం నాటి పరిస్థితులను ఆమె మాకు చెబుతుండేవారు. సత్తెమ్మ అమ్మమ్మ చనిపోయి చాలాకాలం అవుతున్నా, ఆమె మాటలు, రూపం నా మనోఫలకంమీద అలాగే ఉండిపోయాయి. కనుక ఈ రూపకానికి ఆహార్యం, వస్త్రధారణ ఎలా ఉండాలి అన్నవిషయంపై నాకంటూ ఒక అవగాహన మొదటి నుంచి ఉంది. ఇదివరకటి నా పాత్రలకు భిన్నంగా పాత్రకు తగినట్టుగా నేత చీర కట్టు, బొట్టు, దండ కడియాలు లాంటి వాటితో చాలా సాధారణమైన ఆహార్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాను. ఆ సహజత్వమే నాకు చాలామంచి పేరు తెచ్చింది. దీన్ని ఒక శాస్త్రీయ నృత్యరూపకంగా నేను ఎక్కడా చెప్పలేదు. నా నాట్యానుభవాన్ని జోడించి మొత్తంగా జానపద శైలిలో ప్రదర్శించాను. ఐలమ్మ లాంటి మరెంతో మంది పోరాట యోధురాళ్ల జీవితాలు ఆధారంగా ఇలాంటి ప్రయోగాత్మక నృత్యరూపకాలు మరెన్నో చేయాలి అనుకుంటున్నాను.

తెలంగాణ అస్తిత్వాన్ని మరింత చాటేలా...

జానపద కళలకు ఆలవాలం తెలంగాణ రాష్ట్రం. ఇక్కడ కళాకారుల సంఖ్య తక్కువేమీ లేదు. అయితే దురదృష్టవశాత్తు కొన్ని కళారూపాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. మరికొన్ని కళారూపాలను నేర్చుకొనే వారు లేక, ప్రదర్శించే వారూ లేక ఒక దయనీయ స్థితి మన కళ్లముందు కనిపిస్తోంది. అలాంటి కళలను గుర్తించి, వాటిని ప్రోత్సహించడమే తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలిగా నా ముందున్న కర్తవ్యం. కనుమరుగవుతున్న కళారూపాలకు ఒక సపోర్టు సిస్టం నెలకొల్పాలి. దాంతో పాటు వాటిని ప్రమోట్ చేయడం కోసం పండుగలు, ప్రత్యేక సందర్భాలలో నిరంతరం ప్రదర్శనలు ఏర్పాటు చేయడం లాంటి వినూత్న కార్యక్రమాలు రూపకల్పన చేయాలన్నది నా ఆలోచన. అరుదైన కళారూపాలు కొత్తతరం నేర్చుకొనేలా శిక్షణా శిబిరాలు నిర్వహించడం, కళాకారులకు ఉపకారవేతనాలు అందించడం లాంటి పనులు కూడా నా దృష్టిలో ఉన్నాయి. తద్వారా మన కళలు, సంస్కృతిని బతికించుకోవడంతో పాటు తెలంగాణ అస్తిత్వాన్ని మరింతగా చాటాలన్నది నా కోరిక. అందుకు నా సాయశక్తులా ప్రయత్నిస్తాను.

• కేవీ



ముప్పై అయిదేళ్ల వయసులో సోకిన అరుదైన వ్యాధితో కంటిచూపు శాశ్వతంగా పోయినా... **భూమిక సుదర్శన్** ఆత్మవిశ్వాసం చెక్కుచెదరలేదు. సవాళ్లన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొన్నారు. యూట్యూబ్ వీడియోల్లో తన వంట నైపుణ్యాలను పరిచయం చేస్తూ, ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు.

చూపులేకపోయినా... వండి చూపిస్తున్నారు!

ఎవరైనా "మీ వంట చాలా రుచిగా ఉంది" అని చెబితే... "కంటికి ఇంపుగా కనిపిస్తోందా?" అని వెంటనే అడుగుతారు భూమిక సుదర్శన్. ఎందుకంటే వాటిని ఆమె చూడలేరు. చిన్న తలనొప్పితో ప్రారంభమైన అరుదైన వ్యాధి 35 ఏళ్ళ వయసులో ఆమె అంధత్వానికి కారణమయింది. "మాది బెంగళూరు. భర్త, పిల్లలతో హాయిగా సాగిపోతున్న జీవితం నాది. కొన్నేళ్ళ క్రితం... తరచూ తలనొప్పి వస్తూ ఉండడంతో డాక్టర్‌ను కలిశాను. వైద్య పరీక్షలు చేయించి "మీకు ఆప్టికల్ న్యూరోసిస్ ఉంది" అని చెప్పారు. ఆ పేరు అంతకుముందు ఎప్పుడూ నేను వినలేదు. అది అయిదు లక్షల మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధి అనీ, దానివల్ల క్రమంగా చూపును కోల్పోవాల్సి వస్తుందనీ తెలిసింది. ఆ తరువాత ఎన్నో ఆసుపత్రులు తిరిగాం.. కానీ ఫలితం లేకపోయింది. చివరకు నా కళ్ళు పూర్తిగా కనిపించడం మానేశాయి" అని చెప్పారు భూమిక. హఠాత్తుగా చీకటి మయమైపోయిన జీవితాన్ని కొనసాగించడానికి ఆమె ఎన్నో ఇబ్బందులు పడ్డారు. "ఆ వేదనను తట్టుకోవడం కష్టమయింది. ఎవరి సాయం లేకుండా నడవ లేను. ఏదీ చదవలేను, రాయలేను. మా ఇల్లు కూడా నాకు అపరిచితంగా అనిపించేది. అగాధంలో పడిపోయిన భావన. ఆ సమయంలో నేను డిప్రెషన్‌లోకి వెళ్ళిపోకుండా నా భర్త, కుటుంబం అండగా నిలిచింది" అని గుర్తు చేసుకున్నారామె.

నిరర్థకంగా మిగిలిపోకూడదని...

కొత్త జీవితానికి భూమిక క్రమంగా అలవాటు పడ్డారు. అయితే ఖాళీగా కూర్చోవడం ఆమెకు నచ్చలేదు. ఆమె ఏదైనా పని చేస్తానంటే "మేం ఉన్నాం కదా! నీకెందుకు శ్రమ" అనేవారు ఇంట్లో వారు. 'ఇలా నిరర్థకంగా మిగిలిపోకూడదు' అని ఆమె అనుకున్నారు. వంటపనిలో సాయం చెయ్యాలనుకున్నారు. వంట చెయ్యడం, అందరికీ వడ్డించడం, ఆ వంటల్ని వాళ్ళు సంతృప్తిగా తింటే



> "చూపు పోయిందని బాధపడుతూ... నాలుగు గోడల మధ్యకే పరిమితమైపోవలసిన నాకు ఆ వీడియోలు ఎన్నడూ ఊహించని గుర్తింపు తెచ్చాయి. ఆదాయం కూడా వస్తోంది. ఎంతోమంది "మీరే నాకు స్ఫూర్తి" అని చెబుతున్నారు. కాబట్టి కష్టమైనా... నాకు ఇష్టమైన ఈ పనిని కొనసాగిస్తూనే ఉంటాను"

ఆనందించడం ఆమెకు ఇష్టం. "అయితే ఏ వస్తువు ఏదో అర్థమయ్యేది కాదు. వాటిని చేతిలోకి తీసుకొని, వాసన చూసి తెలుసుకొనేదాన్ని. కాయగూరల్లో పాడైన భాగాలు ఎక్కడున్నాయో తెలుసుకోవడమూ కష్టమయ్యేది. అప్పుడే అంధులకు ఆడియో సలహాలతో సాయపడే ఒక వాట్సాప్ గ్రూప్ గురించి తెలిసింది. దాని ద్వారా చాలా విషయాలు నేర్చుకున్నాను" అని చెప్పారు భూమిక. చూపు లేకపోయినా భూమిక ఏమాత్రం తడబడకుండా వంట చేయడం, రుచులు కూడా అద్భుతంగా ఉండడం గమనించిన ఆమె భర్త సుదర్శన్... వాటిని వీడియోలు తీశారు. ఆ వీడియోలను ఎడిట్ చేసి యూట్యూబ్‌లో పెట్టాలనే ఆలోచన మాత్రం భూమికదే. "మా బంధువు ఒకరికి యూట్యూబ్ ఛానెల్ ఉంది. ఎంతో పేరు వచ్చింది. డబ్బు కూడా వస్తోంది. నా వంటల వీడియోలను కూడా యూట్యూబ్‌లో పెడితే బాగుంటుందనుకున్నాను. నా భర్తకు ఆ ఆలోచన బాగా నచ్చింది. మరికొన్ని వీడియోలు రికార్డ్ చేశారు. 'భూమిక కిచెన్' అనే పేరుతో ఒక యూట్యూబ్ ఛానెల్‌ను 2018లో ప్రారంభించాం" అని చెప్పారు భూమిక.

గాయాలవుతూ ఉంటాయి...

భూమిక కిచెన్.. భారతదేశంలో అంధురాలైన ఒక మహిళ ప్రారంభించిన తొలి యూట్యూబ్ ఛానల్. దానికి కొద్ది రోజుల్లోనే వీక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. "కొత్తగా వంట నేర్చుకుంటున్నవారు, బ్యాచిలర్స్ సులువుగా చేసుకోగలిగే వంటలే ఎక్కువగా పోస్ట్ చేస్తాను. అన్నీ శాకాహార వంటలే. నాలాంటివారు తమ నైపుణ్యాలను ఇతరులతో పంచుకోవడానికి యూట్యూబ్ లాంటి వేదికలు ఎంతో ఉపకరిస్తున్నాయి" అని చెబుతున్న భూమిక 1,300కు పైగా వంటల్ని పోస్ట్ చేశారు. ఆమె ఛానల్‌కు దాదాపు 88 వేలమంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. "ఇది అంత సులువుగా సాగే ప్రయాణం కాదు. వంట అంటేనే నిప్పుతో చెలగాటం. ప్రతి రోజూ ఒక యుద్ధంలాంటిది. నా భర్త, కుటుంబం అనుక్షణం సహాయంగా ఉంటారు. కానీ నాకు చూపు లేదు కాబట్టి చాలా జాగ్రత్తగా ఉండాలి. వంటకాలు ప్రతిసారీ అనుకున్నట్టు కుదరవు. కూరగాయలు కోసేటప్పుడు, వంట చేసేటప్పుడు గాయాలు అవుతూ ఉంటాయి. నా భద్రత గురించి నా చుట్టూ ఉన్నవారు ఎప్పుడూ ఆందోళనతోనే ఉంటారు. నేను చేసే పనిలో అపాయం ఉందని నాకూ తెలుసు. అయితే చూపు పోయిందని బాధపడుతూ.. నాలుగు గోడల మధ్యకే పరిమితమైపోవలసిన నాకు ఆ వీడియోలు ఎన్నడూ ఊహించని గుర్తింపు తెచ్చాయి. ఆదాయం కూడా వస్తోంది. వేలాదిమంది మెచ్చుకుంటున్నారు. ఎంతోమంది "మీరే నాకు స్ఫూర్తి" అని చెబుతున్నారు. కాబట్టి కష్టమైనా.. నాకు ఇష్టమైన ఈ పనిని కొనసాగిస్తూనే ఉంటాను" అంటున్నారు భూమిక.

మెగ్నీషియం లోపిస్తే...

మన శరీరానికి అత్యవసరమైన ఖనిజం మెగ్నీషియం. దీనివల్ల మనకు శక్తి లభిస్తుంది. ఇది శరీరంలోని ఎంజైమ్‌ల పనితీరును క్రమబద్ధీకరిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. హార్మోన్స్ సమతుల్యాన్ని కాపాడుతుంది. చక్కని నిద్ర వచ్చేలా చేస్తుంది. ఎముకలు బలంగా ఉండాలన్నా, నాడీ వ్యవస్థ చక్కగా పనిచేయాలన్నా శరీరానికి మెగ్నీషియం కావాలి.

- శరీరంలో మెగ్నీషియం లోపిస్తే ఆకలి ఉండదు. వికారంగా ఉంటుంది. గుండె కొట్టుకునే వేగంలో మార్పులు వచ్చి నీరసంగా అనిపిస్తుంది. కంటిచూపు మందగిస్తుంది. కండరాలు పట్టేసినట్లు అనిపిస్తాయి. రక్తపోటు పెరుగుతుంది.



- మనం తీసుకునే ఆహార పదార్థాల నుంచే మెగ్నీషియం లభిస్తుంది. అలా లభించనప్పుడు మూత్రపిండాలు తమ వద్ద వున్న మెగ్నీషియంను వినియోగిస్తాయి. కానీ ఇది అంత శ్రేయస్కరం కాదు.
- తృణధాన్యాలు, పప్పులు, గింజలు, జీడిపప్పు, బాదం, గుమ్మడి గింజలు, వేరుశనగ, పచ్చి బఠాణీలు, ఖర్జూరాల్లో మెగ్నీషియం పుష్కలంగా ఉంటుంది. కాయగూరలు, ఆకుకూరలు, అత్తిపండ్లు, అరటి పండ్లు, అవకాడో, క్యాబేజీ, బ్రౌన్ రైస్, ఓట్స్, సీ ఫుడ్, మొలకలు వంటివి తరచూ తినడం వలన మెగ్నీషియం లోపాన్ని అధిగమించవచ్చు.
- శరీరంలో మెగ్నీషియం స్థాయి ఎక్కువైతే డయేరియా, కడుపునొప్పి వంటివి బాధిస్తాయి. ఒక రోజుకి పురుషులకు 400 మిల్లీగ్రాములు, మహిళలకు 300 మిల్లీగ్రాముల మెగ్నీషియం సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు.



కర్నూలు జిల్లా కోసిగిలో 3వ వార్డు వాల్మీకి నగర్ నుంచి కర్ణాటకకు వలస వెళ్తున్న రైతులు, రైతు కూలీలు

వలస.. కోసిగి!

కూటి కోసం, కూలి కోసం.. పొరుగు రాష్ట్రాలకు కూలీలు

1800 కుటుంబాలు వలస బాట.. పిల్లాపాపలు సహా రైలెక్కిన కర్నూలులోని కోసిగి వాసులు

కోసిగి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): కూటికోసం.. కూలికోసం.. కర్నూలు జిల్లా కోసిగి రైతన్నల కుటుంబాలు కర్ణాటక బాట పట్టాయి. బతుకుదెరువు కోసం పిల్లాపాపలను వెంట పెట్టుకుని, వృద్ధులను ఇంటి దగ్గర వదిలిపెట్టి.. రైలెక్కాయి. మొత్తం 1800 కుటుంబాలు ఆదివారం ఒక్కరోజే పొరుగు రాష్ట్రానికి పయనమవడం స్థానిక పరిస్థితిని కళ్లకు కట్టినట్టయింది. కోసిగిలో 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9వ వార్డుల నుంచి 1000 కుటుంబాలు, అలాగే మండలంలోని దుద్ది, పల్లెపాడు, ఆర్లబండ, చిర్తనకల్, మూగలదొడ్డి, కందుకూరు, కామన్‌దొడ్డి, వందగల్లు, చిన్నభోంపల్లి, పెద్దభోంపల్లి, డి.బెళగల్, చింతకుంట, సజ్జలగుడ్డం, ఐరంగల్ తదితర గ్రామాల నుంచి సుమారు 800 కుటుంబాలకు చెందిన వారు మూటలు సర్దుకుని పిల్లాపాపలతో రైలు, ఇతర వాహనాల్లో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు వలసబాట పట్టారు. చదువుకుంటున్న పిల్లలను సైతం వెంట తీసుకువెళ్లారు. ప్రభుత్వాలు మారినా తమ రాతలు మాత్రం మారడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడే ఉంటే కుటుంబాన్ని పోషించుకోవడం కూడా కష్టమని కన్నీటి పర్యంతమయ్యారు.



కోసిగి రైల్వే స్టేషన్‌లో బెంగళూరు-నాందేడ్ రైలు ఎక్కుతున్న కూలీలు

క్లీన్ ఎనర్జీతో ముందడుగు

- పునరుత్పాదక ఇంధన రంగంలో క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 అమలు
- ఐదేళ్లలో 67,000 కోట్ల ఆదాయం లక్ష్యం
- 7.5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యం
- ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ విజయానంద్

అమరావతి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక విద్యుత్ రంగంలో క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 అమలుతో రాష్ట్రం ముందడుగు వేస్తుందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని 2029 వరకూ అమలు చేయడం ద్వారా పది లక్షల కోట్ల పెట్టుబడులు, ఏడున్నర లక్షల మంది యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ప్రణాళికలు అమలు చేయనున్నామని తెలిపారు. ఈ విధానంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు మానవ వనరుల అభివృద్ధిని కూడా సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ విధానాలను అవలంబించడం ద్వారా 24 గంటలూ విద్యుత్ సరఫరాతో పాటు వచ్చే ఐదేళ్లలో రూ.67,000 కోట్ల ఆదాయాన్ని విద్యుత్ సంస్థలు ఆర్జిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా విద్యుత్ రంగాన్ని ఉన్నత ప్రమాణాలతో ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 16వ తేదీన కేబినెట్ సమావేశంలో క్లీన్ ఎనర్జీ-2024 పాలసీ ఆమోదం పొందిన నేపథ్యంలో ఆదివారం విజయవాడలోని విద్యుత్ సౌధలో జెన్కో ఎండీ, ఆంధ్రప్రదేశ్ న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ కేవీఎన్ చక్రధర్‌బాబు, ఏపీట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, డిస్కమ్‌ల సీఎండీలు పట్టన్‌శెట్టి రవి, ఐ.పృథ్వీతేజ్, సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండీ కమలాకరబాబుతో విజయానంద్ సమీక్ష నిర్వహించారు. సంప్రదాయేతర ఇంధన రంగంలో పోటీతత్వాన్ని పెంచేలా ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించే వీలుందని వెల్లడించారు. విద్యుత్ వాహనాలకు 5000 ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, ప్రధాన మంత్రి సూర్య ఘర్ కింద మూడు గిగావాట్ల సోలార్ రూఫ్‌టాప్ సామర్థ్యంతో పది లక్షల గృహాలకు సౌర విద్యుత్, పీఎం కుసుమ్ పథకాలను అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. క్లీన్ ఎనర్జీలో భాగంగా పెట్టుబడులు పెట్టిన సంస్థలకు ప్రోత్సాహకాలు అందజేయనున్నామని విజయానంద్ చెప్పారు.

ప్రతి పని జనానికి తెలిసేలా..

పల్లె కూడళ్లలో ప్రగతి సమాచారం.. గ్రామ పంచాయతీల్లో సమాచార బోర్డులు ఏర్పాటు

- పారదర్శక పాలన అందించే క్రమంలో ముందడుగు
- ప్రతి పని వివరం గ్రామ ప్రజలందరికీ తెలియజేసేలా నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



గ్రామంలో అభివృద్ధి పనులు ఏమేమి జరిగాయో తెలుసుకోవాలంటే పంచాయతీ ఆఫీసుకు వెళ్లాల్సిందే. ఆ పనులకు సంబంధించి పూర్తి సమాచారం కావాలన్నా దొరకడం కష్టమే. అవకతవకలు జరిగితే ఇక ప్రశ్నించడం గగనమే. ఇప్పటి వరకూ ఇదే పరిస్థితి. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గ్రామాల్లో ప్రజలకు పారదర్శక పాలన అందించేలా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి చేయాల్సిన పనులను ఆమోదించారు. గ్రామాల్లో ఏయే పనులు చేపడుతున్నారో ఆ గ్రామస్తులకు తెలియచేయాలని నిర్ణయించారు. పనుల్లో అవకతవకలు జరిగితే ప్రజలు ప్రశ్నించే విధంగా చర్యలు తీసుకున్నారు. సమర్థులైన అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించేందుకు ఇప్పటికే నిర్ణయించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి అధికారుల బదిలీల విషయంలో రాజకీయ జోక్యం లేకుండా చూసి నిజాయితీ గల అధికారులను ఎంపిక చేశారు. నవంబర్‌లో నిర్వహించే ఉపాధి హామీ పథకం సిబ్బంది బదిలీల్లో సైతం రాజకీయ జోక్యం లేకుండా చూడాలని భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే పనుల్లో ఎక్కడా అవినీతి లేకుండా చేయాలని గట్టి పట్టుదలతో అధికారులు ఉన్నారు. అందులో భాగంగా గ్రామాల్లో చేపట్టే ప్రతి పని ఆయా గ్రామస్తులకు తెలిసేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 14 నుంచే ఆ పని ప్రారంభించనున్నారు. ప్రజా ప్రతినిధులు ప్రారంభించే సిమెంట్‌రోడ్ల పనులపై సంపూర్ణ సమాచారం ప్రజలకు తెలిసేలా చేయాలని భావిస్తున్నారు.

వైసీపీ హయాంలో గోప్యంగా..

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సమాచార బోర్డులు ఉన్నాయి. అయితే వైసీపీ సర్కార్ వచ్చిన తర్వాత వాటిని గాలికి వదిలేశారు. గత సర్కార్ హయాంలో గ్రామంలో ఏం పనులు జరుగుతున్నాయన్న విషయం కూడా ప్రజలకు తెలియనీయకుండా గోప్యంగా ఉంచారు. అయితే ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేసేలా పారదర్శకంగా గ్రామ పాలన ఉండాలని ఉపముఖ్యమంత్రి యోచిస్తున్నారు. ఇప్పటికే ప్రతి గ్రామ పంచాయతీకి సంబంధించి నిధుల వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచేందుకు వెబ్‌సైట్ రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు ఆయా గ్రామ పంచాయతీల్లో చేపట్టే పనుల వివరాలన్నీ ఆ వెబ్‌సైట్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకున్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలడిగే పరిస్థితి లేకుండా చూడాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఏమేం చేయనున్నారు..

- ప్రతి పల్లె కూడలిలో రంగులతో గోడపై గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఉపాధి పనుల వివరాలను రాయించాలని నిర్ణయించారు.
- ఆయా పంచాయతీల్లో ఆ ఏడాదికి సంబంధించి చేపడుతున్న పనుల వివరాలు పెయింట్లతో రాస్తారు.
- గ్రామాల్లో ఎన్ని ఉపాధి హామీ జాబ్‌కార్డులున్నాయి?, మినీ గోకులాల పనులు, పండ్లతోటల పెంపకం, పంటకాలువల పునరుద్ధరణ, సిమెంట్‌రోడ్ల పనుల వివరాలు, ఎన్ని పనులు ఎంత అంచనాతో చేపడుతున్నారన్న వివరాలు, గ్రామంలో తవ్వుతున్న ఫారంపాండ్ల వివరాలను గోడలపై పెయింట్లతో రాస్తారు.
- అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ సమాచారం తెలిసేలా ఏర్పాటు చేసే ఈ బోర్డులతో గ్రామ ప్రజలకు పూర్తి అవగాహన కలుగుతుంది.

వ్యవసాయ ఇంజనీరింగ్ డైరెక్టరేట్ ఏర్పాటెప్పుడు?

- ముసాయిదా సిద్ధం చేసిన గత టీడీపీ సర్కారు
- ఐదేళ్లపాటు కనీసం పట్టించుకోని జగన్ ప్రభుత్వం
- అప్పట్లోనే ఏర్పాటు చేసి ఉంటే 10 వేల మంది అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపాధి

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ శాఖకు సంబంధించిన ప్రత్యేక ఇంజనీరింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు కార్యరూపం దాల్చడంలేదు. డైరెక్టరేట్ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ 2017లోనే ఆదేశించింది. వివిధ శాఖల్లో పని చేస్తున్న అగ్రికల్చర్ ఇంజనీర్లతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని పేర్కొంది. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ముసాయిదాను రూపొందించింది. అయితే, 2019లో ప్రభుత్వం మారడంతో ఆ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం దీని గురించి పట్టించుకోలేదు. దీంతో 'సాయిల్ కన్జర్వేషన్' విభాగంలో కొత్త పోస్టులు మంజూరు చేయాలన్న వ్యవసాయశాఖ ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి. ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్-అగ్రికల్చర్ కోర్సులున్నాయి. ఏటా 80 నుంచి 100 మంది ఈ కోర్సులు పూర్తి చేస్తున్నారు. ఈ విధంగా రాష్ట్రంలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్-అగ్రికల్చర్ కోర్సులు పూర్తి చేసిన 10 వేల మంది వరకు ఉన్నారని అంచనా. గతంలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ చేసిన 56 మందిని వ్యవసాయశాఖలోని సాయిల్ కన్జర్వేషన్ విభాగంలో ఏఈలుగా తీసుకున్నారు. అలాగే ప్రస్తుతం 22 మంది ఏడీఏలు, 6 డీడీఏలు పని చేస్తున్నారు. ఉద్యాన శాఖలోని సూక్ష్మసేద్య విభాగంలో 40 మంది హార్టీకల్చర్ ఇంజనీర్లుగా ఉన్నారు. డ్వామా, ఉపాధి హామీ పథకంలో పీవో, ఏపీవోలుగా 10 మంది, ఏపీ ఆగ్రోస్‌లో నలుగురు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. అయితే, వ్యవసాయశాఖలోని సాయిల్ కన్జర్వేషన్ విభాగంలో ప్రస్తుతం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుల్లోకి అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ అగ్రికల్చర్ చేసిన వారితో కాకుండా, ఏజీ బీఎస్సీ చేసిన ఏవో, ఏఈవోలతో భర్తీ చేస్తున్నారు. దీనివల్ల తమకు అన్యాయం జరుగుతోందని అగ్రికల్చర్ ఇంజనీరింగ్, బీటెక్ అగ్రికల్చర్ కోర్సులు చదివిన వారు వాపోతున్నారు.

సాంకేతికతకు అనుగుణంగా

ప్రస్తుతం వ్యవసాయరంగంలో యాంత్రీకరణ, డ్రోన్స్ వంటి కొత్త టెక్నాలజీ, విభిన్న ఇంజనీరింగ్ పద్ధతులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో అగ్రికల్చర్ ఇంజనీరింగ్ పట్టభద్రుల సేవలను ఉపయోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కేంద్రం అనుమతి ఉన్నందున డైరెక్టరేట్ ఏర్పాటు చేసి, తమకు న్యాయం చేయాలని పట్టభద్రులు కోరుతున్నారు.

అదుపులోనే డయేరియా

- వైద్య ఆరోగ్యశాఖ పటిష్ట చర్యల ఫలితం
- సీఎంవోకు స్పెషల్ సీఎస్ కృష్ణబాబు నివేదిక
- విజయనగరం జిల్లాకు ఆరోగ్య శాఖ కమిషనర్
- ప్రస్తుతం 53 మందికి వివిధ ఆస్పత్రుల్లో చికిత్స
- డయేరియాతో ఒక్కరు మాత్రమే మృతి: డీహెచ్

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ, స్థానిక వైద్య సిబ్బంది పటిష్టమైన చర్యలు తీసుకోవడం వల్ల విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా అదుపులోకి వచ్చిందని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. ఈ మేరకు సీఎం కార్యాలయానికి నివేదిక అందజేశారు. ఆ ప్రాంతంలో ప్రజలు బహిరంగ మల విసర్జన చేయడం వల్ల భూగర్భజలం కలుషితమైందని, నీటి సరఫరా పైపులు డ్రైనేజీల గుండా వెళ్లడం, లీకేజీ వల్ల కూడా తాగునీరు కలుషితమైందని నివేదికలో వివరించారు. ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశాల మేరకు డయేరియా ప్రబలిన వెంటనే డీహెచ్ డాక్టర్ పద్మావతిని విజయనగరం జిల్లాకు పంపించామని, ఆదివారం ఉదయం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌ను కూడా విజయనగరం జిల్లాకు పంపించామని తెలిపారు. డయేరియా వ్యాప్తికి కారణాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదికను అందజేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. తాగునీటి నమూనాలను ప్రయోగశాలకు పంపించగా, కలుషితమైనట్లు తేలిందని వెల్లడించారు. ఈ నెల 13న అక్కడ తొలి డయేరియా కేసు నమోదవగా 14న 55 కేసులు, 15న 65 కేసులు నమోదయ్యాయన్నారు. శనివారం ఒక్క కేసు మాత్రమే నమోదైందని వివరించారు. కాగా, గుర్లలో డయేరియాతో వాస్తవంగా ఒక్కరు మాత్రమే చనిపోయారని, మిగిలిన ఏడుగురు పలు ఇతర వ్యాధులతో మరణించారని డాక్టర్ పద్మావతి స్పెషల్ సీఎస్‌కు నివేదిక అందించారు.

అతిసారం మరణాలపై సమగ్ర విచారణ

- గొర్లలో వైద్యశిబిరాలను కొనసాగించాలి: సీఎం ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా గొర్లలో అతిసారం మరణాలపై సీనియర్ ఐఏఎస్ అధికారితో విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. గొర్లలో అతిసారంతో 8 మంది చనిపోయిన ఘటనపై సీఎం చంద్రబాబు ఆదివారం సమీక్ష చేశారు. ప్రస్తుతం గ్రామంలో పరిస్థితి, బాధితులకు అందుతున్న వైద్య సాయం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, సురక్షిత తాగునీరు అందిస్తున్నామని జిల్లా అధికారులు సీఎంకు తెలిపారు. అయితే, అసలు కారణాలపై పూర్తి స్థాయి విచారణ జరపాలని సీఎం నిర్ణయించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి కె.విజయానంద్‌తో విచారణ జరిపించాలని నిర్ణయించారు. మరణాలకు అసలు కారణం ఏంటి? ప్రభుత్వ శాఖల పరంగా ఉన్న సమస్యలు ఏంటి? అనేది తెలుసుకునేందుకు సమగ్ర విచారణ జరపాలని సీఎం భావిస్తున్నారు. ఆ ప్రాంతంలోని నీటిని ఎప్పటికప్పుడు పరీక్షలకు పంపాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు తాగునీరు సరఫరా చేయాలని, వైద్య శిబిరాలు కొనసాగించాలని సీఎం ఆదేశించారు. వైద్యఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు ధైర్యం చెప్పి, సమస్య పరిష్కారమయ్యే వరకు వారికి అండగా ఉండాలని అధికారులకు సూచించారు.

విపక్షాలది దుష్ప్రచారం: మంత్రి కొండపల్లి

విజయనగరం, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా ప్రభావంతో కేవలం ఒక్కరు మరణించారని, మిగతా ఏడూ సహజ మరణాలేనని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునతో కలిసి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇతరత్రా మరణాలకు కూడా డయేరియా కారణమని ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. వాస్తవంగా డయేరియాతో కేజీహెచ్‌లో ఒక్కరే మరణించారని చెప్పారు. డయేరియా ప్రబలిన వెంటనే వైద్య ఆరోగ్య శాఖ చర్యలు చేపట్టిందని, ప్రస్తుతం ఆ ప్రాంతంలో డయేరియా అదుపులో ఉందని తెలిపారు. ముందు జాగ్రత్తగా ప్రతి 20 ఇళ్లకు ఒక ఏఎన్ఎంను ఆరోగ్యశాఖ నియమించిందని చెప్పారు.

అరాచకాల ఆధారాలన్నీ వాటిలోనే!

- బోరుగడ్డ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ స్వాధీనం
- నేడు మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు
- అతడు పెట్టిన పోస్టులు, వీడియో రికవరీ!
- తద్వారా అతడి వెనుక ఉన్న అదృశ్య శక్తుల కూపీ లాగేందుకు పోలీసుల యత్నం
- అతడి బ్యాంకు ఖాతాల్లో కోట్ల కొద్దీ డబ్బు
- వాటి లావాదేవీలపైనా ఆరా
- కస్టడీ విచారణకు కోర్టులో పిటిషన్!

గుంటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉన్మాదిలా సోషల్ మీడియా వేదికగా వికృతంగా వ్యవహరించిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ అరాచకాల గుట్టు విప్పేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఉన్నత స్థాయిలో బోరుగడ్డ కేసుపై పోలీసు అధికారులు దృష్టి సారించకపోవడంతో క్షేత్రస్థాయిలో ఎంతవరకు పోలీసుల ప్రయత్నాలు ఫలిస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో అరండల్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఏఈఎల్‌సీ చర్చి వివాదంలో తలదూర్చి చర్చి ట్రెజరర్ కర్లపూడి బాబూప్రకాశ్‌ను రూ.50 లక్షలు ఇవ్వాలని ఫోన్లో బెదిరించాడు. వీడియో క్లిప్పింగ్స్ పంపి బ్లాక్ మెయిల్ చేశాడు. దీనిపై బోరుగడ్డతో పాటు ఆయన అనుచరుడైన పండ్ల వ్యాపారి హరిపై అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసులో ఈ నెల 17న అమరావతి రోడ్డులోని వేళాంగణినగర్‌లో తన ఇంటిలో ఉన్న అనిల్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నెల 18న కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించడంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా అనిల్ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. గడచిన ఐదేళ్లలో అతడి అరాచకాలకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు వాటిని సోమవారం మంగళగిరిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపనున్నారు. అతడు పెట్టిన పోస్టింగ్స్, ఫార్వర్డ్ చేసిన వీడియోలతో పాటు కర్లపూడి బాబు ప్రకాశ్‌ను బెదిరిస్తూ పంపిన వీడియో క్లిప్పింగ్స్ వంటివాటన్నిటినీ రికవర్ చేయనున్నారు. బోరుగడ్డ వెనుక తాడేపల్లికి చెందిన బలమైన అదృశ్య శక్తులు ఉన్నాయని రాజకీయ వర్గాలతో పాటు ప్రజల్లోనూ విస్తృత చర్చ జరుగుతోంది. అతడు ఏకంగా నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి తనకు బంధువని బహిరంగంగా ప్రకటించాడు. తనను విమర్శించేవారిని అటు సీఐడీ ఉన్నతాధికారులకు, ఇటు సంబంధిత పోలీసు అధికారులకు కాల్ కాన్ఫరెన్స్ పెట్టి మరీ ఫోన్‌లో బెదిరించాడు. సదరు అదృశ్య శక్తుల వివరాలు ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌లో ఉన్నాయేమోనని పోలీసులు ఆరా తీస్తున్నారు. అంతేకాదు.. అతడి బ్యాంకు ఖాతాల లావాదేవీల ద్వారా కూడా వాటిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బోరుగడ్డకు ప్రభుత్వ పెద్దల నుంచి పెద్ద మొత్తంలో నజరానాలు ముట్టినట్లు ఆరోపణలున్నాయి. అతడి బ్యాంకు ఖాతాల్లో రూ.కోట్లు జమయినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. అతడి ని కస్టడీకి తీసుకుని విచారించి బ్యాంకు ఖాతాల లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించాలని పోలీసులు నిర్ణయించారు. దీనికోసం త్వరలోనే కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.



చింతమనేనికి బెదిరింపులు..

ఏలూరు క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను బెదిరించిన ఆరోపణలపై బోరుగడ్డ అనిల్‌కుమార్‌పై ఏలూరు త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. 2023 అక్టోబరులో బోరుగడ్డ తనకు ఫోన్ చేసి.. తమ పార్టీ తలుచుకుంటే మీ వర్గాన్ని ఖతం చేస్తామని అనేక దుర్భాషలాడి వ్యక్తిగత దూషణలు, బెదిరింపులకు పాల్పడినట్లు చింతమనేని ఆదివారమే ఫిర్యాదు చేశారు.

బోరుగడ్డ అరాచకాలెన్నో..

వైసీపీ పెద్దల అండతో గడచిన ఐదేళ్లలో బోరుగడ్డ అనిల్ ఇష్టానుసారం చెలరేగిపోయాడు. సమాజంలో ఉన్నత స్థానంలో ఉన్న వారిని, ప్రముఖులను, మహిళలను, అధికార యంత్రాంగాన్ని చెప్పలేని విధంగా సోషల్ మీడియా ద్వారా దూషిస్తూ బెదిరించాడు. ఇవి తట్టుకోలేక చేబ్రోలు మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు నన్నపనేని కోటేశ్వరరావు గుండెపోటుతో మృతి చెందారు. అనిల్ ఏఈఎల్‌సీ చర్చి వివాదంలో తలదూర్చి ఏఈఎల్‌సీ కోశాధికారిగా ఎన్నికైన బాబూప్రకాశ్‌ను రూ.50 లక్షలు ఇవ్వాలని బెదిరించాడు. కృష్ణా జిల్లా బైరాగి పాలెంలో పేద పిల్లల ఆశ్రమంలో ఓ బాలుడు ఆత్మహత్య చేసుకుంటే ఆశ్రమం నిర్వాహకుడికి ఫోన్ చేసి డబ్బు కోసం డిమాండ్ చేశాడు. అతడి భార్యకు సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టింగ్స్ పంపి బెదిరించాడు.

- 2021 డిసెంబరు 7న రాత్రి గుంటూరు జీజీహెచ్‌లో అర్ధరాత్రి తనిఖీల పేరుతో హంగామా సృష్టించాడు. మద్యం తాగి.. విధుల్లో ఉన్న వైద్యుడిపై దౌర్జన్యం చేశాడు. దీనిపై అప్పటి సూపరింటెండెంట్ ప్రభావతి ఫిర్యాదుతో కొత్తపేట పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. అయితే ప్రభావతి భర్త రవికుమార్ వైసీపీ నాయకుడు కావడంతో ఆ తర్వాత ఆమె లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేసుకున్నారు.
- 2018 జూలై 22న అనంతపురం త్రీ టౌన్ సీఐ మురళీకృష్ణకు ఫోన్ చేసి తాను ఐఏఎస్ అధికారి రాజశేఖర్‌నని.. జాకబ్ స్వరూప్ కుమార్, బోరుగడ్డ అమృతవల్లి అనే వారు ప్రభుత్వ ఆర్థిక సలహాదారులని.. అక్కడ చర్చిలో రెండు గ్రూపుల మధ్య నెలకొన్న వివాదంలో తిమోతి గ్రూపునకు అనుకూలంగా పని చేయాలని బెదిరించాడు. సీఐ ఫిర్యాదు చేయడంతో ఆ ముగ్గురిపై కేసు నమోదైంది.
- 2017లో పెదకాకానిలో తాను శ్యాంసింగ్ అనే వ్యక్తి నుంచి మూడున్నర సెంట్ల స్థలం కొనుగోలు చేశానని.. దానికి వెంటనే సర్వే చేసి సర్టిఫికెట్ ఇవ్వాలంటూ మండల సర్వేయర్ చిరుమామిళ్ల మల్లికార్జునరావును బెదిరించారు. సర్వే చేయాలంటే మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మల్లికార్జునరావు చెప్పినప్పటికీ వినిపించకుండా తనకు నేరుగా సర్వే చేసి సర్టిఫికెట్ ఇవ్వాలన్నాడు. పెదకాకాని పోలీసు స్టేషన్‌లో అతడిపై కేసు నమోదైంది.
- సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈ ఏడాది మే 8న రాత్రి తుళ్లూరు శివారు పెట్రోల్ బంక్ వద్ద ఎలక్షన్ ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఎ.గోపీకృష్ణ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బోరుగడ్డ అనిల్ తన అనుచరులతో రెండు కార్లలో అక్కడకు వచ్చాడు. వాటిని తనిఖీ చేయాలని గోపీకృష్ణ ఆదేశించడంతో కారు దిగిన అనిల్.. అక్కడ విధుల్లో ఉన్న ఏఎస్ఐ ప్రసాద్‌పై దౌర్జన్యం చేశాడు. తాము వైసీపీ నాయకులమని, తమ పార్టీయే మళ్లీ అధికారంలోకి రాబోతోందని, తడాఖా చూపిస్తామన్నాడు. దీనిని చిత్రీకరిస్తున్న ఏబీఎన్ విలేకరిపై దాడి చేశాడు.
- ఎన్నికల కౌంటింగ్‌కు ముందు రోజు జూన్ 3న 'ఆరా' ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వచ్చిన సందర్భంలో బోరుగడ్డ సోషల్ మీడియాలో.. మా వైసీపీయే అధికారంలోకి రాబోతోందంటూ చంద్రబాబును, ఆయన సామాజిక వర్గాన్ని కించపరిచేలా దూషిస్తూ, మీ అంతు చూస్తానని, మీ జాతి మహిళలపై అత్యాచారం చేస్తానని దూషించాడు. దీనిపై గని చిన్న వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదుతో పట్టాభిపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను, ఆయన కుటుంబ సభ్యులను కించపరిచే విధంగా అసభ్య పదజాలంతో దూషిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బోరుగడ్డపై 2022 అక్టోబరు 20న పాతగుంటూరులో కేసు నమోదైంది. ఓ భూ వివాదంలో 2016లో తాడికొండ పోలీసు స్టేషన్ పరిధిలో చీటింగ్, మారణాయుధాలతో బెదిరించాడు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆయనపై అరండల్‌పేట స్టేషన్‌లో 'సి' కేటగిరీ రౌడీషీట్ తెరిచారు. ఇప్పుడు దానిని 'ఏ ప్లస్' కేటగిరీకి మార్చాలని నిర్ణయించారు.

ప్రజారోగ్యాన్ని కుప్పకూల్చింది మీరే

- మీ హయాంలో అనారోగ్యం పాలైన శాఖ
- జగన్‌కు మంత్రి సత్యకుమార్ కౌంటర్

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ప్రజారోగ్యం కుప్పకూలిపోయిందని చెప్పడం మీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. మీ ఐదేళ్ల అనాలోచిత చర్యల వలన ప్రజారోగ్య వ్యవస్థ కుప్పకూలిందని మీకు తెలుసు. కుప్పకూల్చి మీరే ప్రశ్నిస్తున్నారు' అని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ మాజీ సీఎం జగన్‌కు కౌంటర్ ఇచ్చారు. గుర్ల డయేరియా కేసుల నేపథ్యంలో ప్రభుత్వంపై జగన్ 'ఎక్స్'లో చేసిన విమర్శలకు ఆయన అదే వేదికపై ఘాటైన సమాధానం చెప్పారు. 'మీ ప్రభుత్వం చేసిన తప్పులను మా ప్రభుత్వం సరిచేస్తుంటే కువిమర్శలు చేస్తున్నారు. రాష్ట్రంలో అక్కడక్కడ డయేరియా ప్రబలడానికి గల కారణం కలుషిత నీరు అన్న విషయం మీకు తెలియదా? ఆ నీరు కలుషితం కావడానికి మీరు గత ఐదు సంవత్సరాలు పైపులైన్ల నిర్వహణ చేపట్టకపోవడమే కారణమని మీకు తెలియదా? 104, 108 వ్యవస్థల్ని మీ ఆస్థాన కంపెనీ అరబిందోకు కమీషన్ల కోసం అందించినప్పుడే ఆ వ్యవస్థ నిర్వీర్యమైంది. ఎన్టీఆర్ వైద్యసేవ బిల్లులు గత సంవత్సరం నుంచి మీరు చెల్లించకపోవడం వల్ల రూ.2,500 కోట్లు కొత్త ప్రభుత్వం మీద భారం పడింది. వైద్య కళాశాలల కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లుల రూపంలో రూ.1,400 కోట్లు కొత్త ప్రభుత్వంపై భారం వేశారు. నాడు-నేడు కింద కేంద్రం పీజీ సీట్లకు ఇచ్చిన రూ.750 కోట్లను దారి మళ్లించలేదా? నాసిరకం జగన్ బ్రాండ్ మద్యం తాగి మూత్రపిండాల, కాలేయం వ్యాధి బారినపడిన వారి సంఖ్య ఐదేళ్లలో 1,300 శాతం పెరగలేదా? చివరికి వైద్య శాఖ మీద కూడా దాదాపు రూ.5 కోట్ల అప్పు పెట్టిన ఘనత మీదే. కొత్త ఎన్డీఏ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మీరు చేసిన తప్పులన్నీ సరిదిద్దుతుంది. మీ హయాంలో అనారోగ్యం బారినపడిన శాఖను మళ్లీ ఆరోగ్యశాఖగా మార్చి రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను, విద్యార్థులకు వైద్య విద్యను అందిస్తుంది' అని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

పరువు నష్టం కేసులో.. పవన్ క్వాష్ పిటిషన్ ఉపసంహరణ

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ గుంటూరు కోర్టులో అప్పటి వైసీపీ ప్రభుత్వం తనపై దాఖలు చేసిన పరువు నష్టం కేసును కొట్టివేయాలని కోరుతూ వేసిన క్వాష్ పిటిషన్‌ను జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఉపసంహరించుకున్నారు. శనివారం హైకోర్టులో ఈ పిటిషన్ విచారణకు రాగా.. చట్టప్రకారం ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించేందుకు వీలు కల్పిస్తూ వ్యాజ్యం ఉపసంహరణకు అనుమతివ్వాలని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సానుకూలంగా స్పందించారు.

అటవీ శాఖ అదనపు కార్యదర్శిగా ప్రశాంతి

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి బదిలీపై వచ్చి ఏపీలో రిపోర్ట్ చేసిన ఐఏఎస్ అధికారిణి ఎం. ప్రశాంతికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. అటవీ శాఖలో అదనపు కార్యదర్శిగా ఆమెను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 16 నుంచి ఆమె ఏపీలో విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

దీపావళి నుంచే ఉచిత గ్యాస్

- సూపర్ సిక్స్‌లో ఒక పథకం అమలుకు ముహూర్తం
- తెల్లకార్డుదారుల్లో అర్హులందరికీ లబ్ధి
- సర్కారుపై ఏటా రూ.3 వేల కోట్లు భారం
- 23న కేబినెట్‌లో ఆమోదం: మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలైన సూపర్ సిక్స్ పథకాల్లో ఉచిత గ్యాస్ సిలిండర్ల స్కీమ్ అమలుకు ముహూర్తం ఫిక్సయింది. దీపావళి రోజున ఆ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రానున్న దీపావళి నుంచి తెల్లకార్డుదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదివారం వెల్లడించారు. గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్‌లో కీలక హామీగా ఉన్న మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. దీనిపై ఈ నెల 23న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదిస్తామన్నారు. విధి విధానాలను కూడా త్వరలో వెల్లడించనున్నట్లు చెప్పారు. దీపావళి నాటికి అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుతాయన్నారు. పండుగ రోజు పేదల జీవితాల్లో నిజమైన వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు తాపత్రయ పడుతున్నారని మనోహర్ అన్నారు. ఈ పథకాన్ని అమలు చేయడానికి ఏడాదికి రూ.3000 కోట్లు ఖర్చవుతుందని మంత్రి చెప్పారు. కేంద్రం సహకారంతో పథకాల అమలుకు ముందడుగు వేస్తామన్నారు. రాష్ట్రంలో 1.4 కోట్ల మంది తెల్ల రేషన్‌కార్డుదారుల్లో అర్హులందరికీ ఉచితంగా మూడు సిలెండర్లు అందిస్తామన్నారు. దీనికోసం హిందూస్తాన్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ గ్యాస్ కంపెనీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. కేంద్రం ఇస్తున్న సబ్సిడీకి తోడు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు వారి సహకారం తీసుకోనున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో తామిచ్చిన హామీలు అమలు చేయడం కొంత ఇబ్బందిగా ఉన్నమాట నిజమేనని, దీనికితోడు గత ప్రభుత్వం చేసిన పాపాలనూ కడగాల్సి వస్తోందని విమర్శించారు. అయినా పథకాల అమలులో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదన్నారు.

రైతులకు జగన్ పెట్టిన బకాయిలూ చెల్లించాం

పౌరసరఫరాల శాఖ ద్వారా గత ప్రభుత్వ కాలంలో రైతుల నుంచి కొన్న ధాన్యానికి డబ్బు చెల్లించలేదని, ఆ బకాయిలు రూ.1674కోట్లు తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత చెల్లించామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పౌరసరఫరాల శాఖకు సరకులు అందించిన కంపెనీలకు సైతం జగన్ సర్కారులో బకాయిలు పేరబెట్టారని, ఆ అప్పులు కూడా తామే కడుతున్నామని మంత్రి చెప్పారు. పథకాల అమలుకు తీసుకొచ్చిన అప్పులు ఏ ప్రభుత్వం ఉన్నా చెల్లించడం సహజమేనని, అయితే, జగన్ సర్కారులో సొంత ఖజానా నింపుకొనేందుకు అమలు చేసిన పథకాల డబ్బులు కూడా చెల్లించాల్సి రావడం భారంగా మారిందని ఆయన అన్నారు. గతంలో మాదిరి కాకుండా తమ ప్రభుత్వంలో రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలను అందించేందుకు చిత్తశుద్ధితో ఉన్నామని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు. ఉచిత గ్యాస్ సిలెండర్ల పథకాన్ని ప్రతి మహిళ సంతోషపడేలా, చరిత్రలో నిలిచిపోయేలా అందిస్తామని ఆయన తెలిపారు.





చింతపల్లి మండలం లంబసింగి సమీపంలోని చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద మంచు మేఘాల అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు

మన్యంలో పర్యాటకుల సందడి

కిటకిటలాడిన మేఘాల కొండ

చింతపల్లి(అల్లూరి జిల్లా), అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. అనంతగిరి మండలంలోని బొర్రా గుహలు, కటికి, తాడిగుడ జలపాతాలు, అరకులోయలోని పద్మాపురం గార్డెన్స్, గిరిజన మ్యూజియం, చింతపల్లి మండలంలో లంబసింగి, పాడేరు మండలంలోని వంజంగి మేఘాల కొండ, జి.మాడుగుల మండలం కొత్తపల్లి జలపాతం తదితర ప్రదేశాలకు పర్యాటకులు పోటెత్తారు. పాలసంద్రాన్ని తలపించేలా ఉండే లంబసింగి సమీపంలోని చెరువులవేనం వ్యూపాయింట్, వంజంగి హిల్స్ వద్ద వేకువజాము నుంచే రద్దీ కనిపించింది. మంచు అందాలను ఆస్వాదిస్తూ పర్యాటకులు ఫొటోలు దిగి సందడి చేశారు.

పచ్చి నెత్తురు తాగే రాక్షసుడివి!

- నువ్వు లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడతావా?
- నేరాలు-ఘోరాలే నీ పార్టీ పునాదులు
- జగన్‌పై మంత్రి లోకేశ్ ఆగ్రహం

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): 'ఇంట్లో బాబాయ్‌ని చంపేసి పచ్చి నెత్తురు తాగే రాక్షసుడివి.. నీ పార్టీ పునాదులే నేరాలు-ఘోరాలని మీ కుటుంబ సభ్యులే చెప్పారు.. నీ పాలనలో వేల మంది చనిపోయినా, ఏ నాడూ ఒక్క మాట, కనీసం ఒక్క సమీక్ష కూడా చేయని నువ్వు.. లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడుతున్నావ్.. మా ఖర్మ! ఐదేళ్ల పాటు గంజాయి, డ్రగ్స్‌ను వ్యాప్తి చేసి సొమ్ము చేసుకున్నావ్.. ఊరికో ఉన్మాదిని పెంచి పోషించి, ప్రజల మీదకు వదిలావ్.. నేరస్థులు ఇష్టం వచ్చినట్లు బతికే లైసెన్స్ ఇచ్చావ్.. నీ తమ్ముడు అవినాశ్‌రెడ్డి హత్యచేసినా కాపాడావ్.. అనంతబాబులాంటి వాడు దళితులను చంపితే ఇంటికి పిలిచి భోజనం పెట్టావ్.. మహిళలని వేధించిన వారిని అందలం ఎక్కించావ్.. ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వాళ్లకు టికెట్లు ఇచ్చావ్.. నువ్వు లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడుతున్నావా' అని మాజీ సీఎం జగన్‌పై విద్యామంత్రి లోకేశ్ విరుచుకుపడ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో 2,027 మంది మహిళలు దారుణ హత్యకు గురయ్యారని, 30వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని ఆదివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. కోనసీమ జిల్లాలో 12ఏళ్ల బాలికపైన ఐదుగురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. శ్రీకాకుళం జిల్లాలో 8ఏళ్ల బాలికపై అత్యాచారం చేశారు. విజయవాడలో యువతిని 11 కత్తిపోట్లు పొడిచి చంపారు. నీ ఇంటి సమీపంలోని సీతానగరంలో యువతిపై అత్యాచారం జరిగితే కనీసం స్పందించని నీకు అసలు మాట్లాడే అర్హత ఉందా' అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీలపై ఇష్టానుసారంగా దాడులకు తెగబడ్డారని, ఎస్సీలు 192 మంది, ఎస్టీలు 58 మంది హత్యకు గురయ్యారని, మైనారిటీలపైనా దాడులకు పాల్పడ్డారని.. అబ్దుల్ సలాం కుటుంబ ఘటన కంటే ఘోరమైనది రాష్ట్రంలో మరోటి ఉందా అని ప్రశ్నించారు. జగన్ ఏనాడైనా ఒక్క బాధిత మహిళ వద్దకైనా వెళ్లి కనీసం పరామర్శించారా.. కనీసం ఒక్కసారైనా ఖండించారా అని నిలదీశారు. నరసరావుపేటలో వక్ఫ్ ఆస్తులను కాపాడాలని కోరిన ఇబ్రహీంను నడిరోడ్డుపై చంపారని.. వైసీపీ నేత కూతురు కంటే చదువులో ముందంజలో ఉందని పలమనేరులో బాగా చదివే మిస్బా అనే పదో తరగతి విద్యార్థినిని వేధించడంతో ఆత్మహత్య చేసుకుందని గుర్తుచేశారు. 'దిశ చట్టం అంటూ లేని చట్టాన్ని ఉన్నట్లు ప్రచారం చేశావ్.. ఆడబిడ్డలపై అత్యాచారం చేస్తే దిశ చట్ట ప్రకారం ఉరిశిక్ష వేస్తామని చెప్పిన వ్యక్తి ఒక్కరికైనా వేశారా? ఎందుకీ అబద్ధపు బతుకు' అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరిగే ప్రతి నేరానికీ జగన్ పెంచి పోషించిన గంజాయి మాఫియానే కారణమన్నారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికినా మూలాలు ఏపీలోనే ఉండేలా ఆయన పాలన సాగిందని విమర్శించారు. గత టీడీపీ హయాంలో 14,770 ఆటోమేటిక్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే.. జగన్ అధికారంలోకి రాగానే వాటిని మూలనపడేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఆయన నాటిన విష బీజాలు పీకిపడేసే పనిలో ఉందన్నారు. సీమలో జగన్, ఆయన కుటుంబం పోషించిన ఫ్యాక్షనిజాన్ని అణచివేసిన చరిత్ర చంద్రబాబుదని.. సొంత పార్టీ నేతలను కూడా ఉపేక్షించకుండా అరెస్టు చేయించారని. అయితే జగన్ కుటుంబం రౌడీలను పెంచి పోషించిందన్నారు. 'మత కలహాలు లేకుండా చేసింది చంద్రబాబు.. తీవ్రవాదంపై పోరాడింది చంద్రబాబు.. ఇప్పుడు ఐదేళ్లుగా నువ్వు పెంచి పోషించిన సైకోలను రాష్ట్రం నుంచి తరిమికొట్టి సైకోల ఫ్రీ రాష్ట్రంగా చేసేది కూడా చంద్రబాబే' అని లోకేశ్ స్పష్టం చేశారు.



అమిత్‌షాను సత్కరిస్తున్న లోకేశ్

మరింత సాయం చేయండి

- ఢిల్లీలో అమిత్‌షాతో లోకేశ్ భేటీ

కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఢిల్లీలోని ఆయన నివాసంలో ఆదివారం మంత్రి నారా లోకేశ్ కలిశారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో భాగంగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలతో సమావేశాల కోసం లోకేశ్ ఢిల్లీలో ఉన్నారు. అడిగిందే తడవుగా హోంమంత్రి అపాయింట్‌మెంట్ దొరకడంతో.. లోకేశ్ వెళ్లి అమిత్‌షాతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఆర్థికాభివృద్ధిని, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో మరింత కేంద్రం సాయం అందించాలని కోరారు. లోకేశ్ ప్రతిపాదనకు అమిత్‌షా సానుకూలంగా స్పందించారు. దాదాపు 45 నిమిషాల పాటు వీరి మధ్య భేటీ సాగింది. 'ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా కీలకస్థానంలో నిలబెట్టేందుకు అమిత్‌షా అందిస్తున్న సహకారం, రాష్ట్రం పట్ల ఆయన శ్రద్ధ గొప్పవి' అని లోకేశ్ ట్వీట్‌లో కృతజ్ఞతలు తెలిపారు.



ఉపాధి నిధులతో కొయ్య బొమ్మల మొక్కల పెంపకం

- అంకుడు, తెల్లపొణికి విరివిగా పెంచాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు



అమరావతి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హస్తకళల విశిష్టతను తెలిపే ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను రూపొందించే కళాకారులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభవార్త అందించారు. ఏటికొప్పాక బొమ్మల తయారీకి అంకుడు కర్ర, కొండపల్లి బొమ్మలకు అవసరమయ్యే తెల్లపొణికి కర్ర మొక్కలను విస్తారంగా పెంచాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల తయారీదారులకు అవసరమయ్యే కర్ర లభ్యత కష్టంగా మారింది. ఆ చెట్ల మనుగడ క్రమంగా క్షీణిస్తుండడంతో ఈ సమస్యను ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మల కళాకారులు ఇదివరకే పవన్ దృష్టికి తెచ్చారు. ఆయన స్పందించి ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా అంకుడు, తెల్లపొణికి చెట్లు పెంచాలని, ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అటవీ ప్రాంతాల్లో, ఏటికొప్పాక, కొండపల్లి పరిసర ప్రాంతాల్లోనూ వాటి పెంపకంపై దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణతేజ చర్యలు తీసుకున్నారు. భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని కనీసం రెండు మూడు తరాలకు సరిపడా చెట్లను పెంచేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ సన్నాహాలు ప్రారంభించింది. అయా మొక్కలను ఉపాధి హామీ పథకం నిధులతో పెంచాలని ఉత్తర్వులు జారీచేశారు. హస్త కళలను ప్రోత్సహించే దిశగా ఇప్పటికే పవన్ పలు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర అతిథులను గౌరవపూర్వకంగా సత్కరించే సందర్భంలో అందించే బహుమతులుగా ఆంధ్రప్రదేశ్ కళాకారులు తీర్చిదిద్దిన కళాకృతులనే ఇస్తున్నారు.

ఎక్సైజ్‌లో వాసుదేవరెడ్డి

మనుషులే

- ఆయనతో అంటకాగిన వారికి ముఖ్య స్థానాలు
- ఎమ్మెల్యేల సిఫారసులతో కీలక పోస్టులు
- సిఫారసు లేఖలివ్వడంపైనా అనుమానాలు
- ఇలా అయితే పనితీరులో మార్పెలా?

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన అధికారులకు ఎక్సైజ్ శాఖ సముచిత స్థానం కల్పించడం విమర్శలకు తావిస్తోంది. మద్యం కుంభకోణంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి సన్నిహితులుగా గుర్తింపు పొందిన అధికారులకు బదిలీల్లో కీలక స్థానాలు లభించాయి. కొందరు అధికారులకు అందరికీమించి మంచి పోస్టులు రావడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమైంది. నిజానికి గత వైసీపీ నేతలతో అంటకాగిన వారిని అప్రాధాన్య స్థానాలకు బదిలీ చేస్తారని లేదంటే అసలు పోస్టింగే ఇవ్వరని అందరూ భావించారు. కానీ, అనూహ్యంగా అలాంటి వారే మంచి స్థానాలు దక్కించుకోవడం ఆశ్చర్యానికి గురిచేసింది. గత ప్రభుత్వంలో నెల్లూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన కె. నాగమల్లేశ్వర్‌రెడ్డి.. వాసుదేవరెడ్డికి అత్యంత సన్నిహితుడనే పేరుంది. ఆయనపై ఓ ఎమ్మెల్యే సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా నాగమల్లేశ్వర్‌రెడ్డికి కీలకమైన తిరుపతి ఈఎస్‌గా పోస్టు దక్కింది. తిరుపతి జిల్లాలో ఓ ఎమ్మెల్యే సతీమణి ద్వారా సిఫారసు చేయించుకున్నట్లు తెలిసింది. సిఫారసు లేఖ అందగానే, ఈయనకు ఎక్సైజ్ శాఖ కీలక పోస్టు కట్టబెట్టింది. ఇక, వాసుదేవరెడ్డికి మరో సన్నిహితుడిగా పేరున్న ఈఎస్ గౌరీశ్వర్‌రావుకు విజయనగరం డిపో మేనేజర్ పోస్టు ఇచ్చారు. అది ఆయన సొంత జిల్లా. సిఫారసులతో ఆయనకు ఈ పోస్టు ఇచ్చినట్టు తెలుస్తోంది. అప్పటి ఎండీకి అత్యంత సన్నిహితుడిగా ఉన్న కె.వెంకట్రామిరెడ్డికి ఏలూరు డిపో మేనేజర్‌గా అవకాశం కల్పించారు. ఆయనకు అసలు పోస్టింగే ఇవ్వరనుకుంటే డిపో మేనేజర్‌గా నియమించడంతో అందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వాసుదేవరెడ్డి, కొంతకాలం అప్పటి ఎక్సైజ్ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవతో అంటకాగిన శౌరిని తెనాలి డిపో మేనేజర్‌గా బదిలీ చేశారు. అప్పట్లో బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీకి కూడా తెలియకుండా విజయవాడలో కొన్ని ప్రభుత్వ మద్యం షాపులను శౌరి.. రీలొకేట్ చేశారన్న ఆరోపణలున్నాయి. ఇలాంటి అధికారులకు సిఫారసులు లేఖలు ఇచ్చిన వారిపై అనుమానాలు పెరుగుతున్నాయి.

టీడీపీ 'పట్టభద్ర' అభ్యర్థులకు

జనసేన, బీజేపీ ఓకే

- అధికారికంగా ఆలపాటి, పేరాబత్తుల పేర్ల ప్రకటన

అమరావతి, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా-గుంటూరు, తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్ర ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్సీ అభ్యర్థులను టీడీపీ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కృష్ణా-గుంటూరు అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా), తూర్పు-పశ్చిమగోదావరి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం పేర్లును పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. వీరి పేర్లపై టీడీపీ నాయకత్వం జనసేన, బీజేపీ అగ్రనేతలతో చర్చించింది. వారి ఆమోదంతో అభ్యర్థులను ఖరారు చేసినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

జగన్ సర్కారు పాపం

పిల్లలకు శాపం



(మొదటి పేజీ తరువాయి)

ఫీజులు విడుదల చేయలేదని తెలిసినా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయి. జగన్ సర్కారు పాపాలు విద్యార్థులను ఇప్పటికీ వెంటాడుతున్నాయి.

ఒక్క విడతే విడుదల

2023-24 విద్యా సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం ఫీజులు విడుదలలో విద్యార్థులను మోసం చేసింది. ఏడాదికి నాలుగు క్వార్టర్లకు 4విడతలుగా ఫీజులు చెల్లించాల్సి ఉండగా, కేవలం ఒక్కసారే ఫీజులు ఇచ్చి చేతులు దులుపుకొంది. దీంతో గత విద్యా సంవత్సరంలో ఉన్నత విద్య విద్యార్థులకు మూడు క్వార్టర్ల ఫీజులు బకాయి పడిపోయాయి. రాష్ట్రంలో 9.44 లక్షల మంది విద్యార్థులు ఇంజనీరింగ్, డిగ్రీ ఇతర ఉన్నత విద్య కోర్సులు చదువుతున్నారు. వారికి ఒక క్వార్టర్‌కు ఫీజులు రూ.708 కోట్లు చెల్లించాలి. మూడు క్వార్టర్లకు మొత్తం రూ.2,124 కోట్లు విడుదల చేయాలి. ఇంత పెద్ద మొత్తంలో ఫీజులు ఆపేయడంతో ఆ భారం విద్యార్థుల తల్లిదండ్రులపై పడింది. మరోవైపు గత ప్రభుత్వం వసతి దీవెన కింద విద్యార్థులకు చెల్లించాల్సిన 1400 కోట్లు బకాయి పెట్టింది.

వచ్చే నెలలో పరీక్షలు

ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు ఏడో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 25న ప్రారంభం కానున్నాయి. మూడో సంవత్సరం విద్యార్థులకు ఐదో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 11న ప్రారంభమవుతాయి. సెకెండియర్ విద్యార్థులకు మూడో సెమిస్టర్ పరీక్షలు కూడా నవంబరు 11నే మొదలవుతాయి. సాధారణ డిగ్రీ కోర్సుల విద్యార్థులకు ఏడో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 4న ప్రారంభం కానున్నాయి. ఇతర ఉన్నత విద్య కోర్సుల పరీక్షలు కూడా అటూ ఇటూగా ఈ సమయంలోనే ఉన్నాయి. అయితే ప్రభుత్వం ఫీజులు విడుదల చేయకపోయినా సొంత డబ్బులు చెల్లించి రాయాలని యాజమాన్యాలు తెగేసి చెబుతున్నాయి. పరీక్షలు రాయనివ్వబోమని, సర్టిఫికెట్లు ఇవ్వబోమని, తరగతులకు కూడా రానీయమంటూ బెదిరింపులకు దిగుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు వేరే దారి లేక అప్పులు చేసి ఫీజులు చెల్లిస్తున్నారు.

ఈ ప్రభుత్వంపై ఫీజుల భారం

గత ప్రభుత్వం భారీగా ఫీజులు బకాయి పెట్టడంతో ఈ ప్రభుత్వంపై భారం పెరిగింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు వసతి దీవెన కలిపి వైసీపీ ప్రభుత్వం రూ.3,500 కోట్ల మేర బకాయిలు పెట్టింది. ఒకేసారి ఇవన్నీ చెల్లించడం కూటమి ప్రభుత్వానికి ఆర్థికంగా పెద్ద సమస్య కానుంది. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకపోతే ఫీజులు ఎప్పుడు విడుదల చేసినా తల్లిదండ్రులు పట్టించుకోరు. కాలేజీ యాజమాన్యాల వాదన మరోలా ఉంది. వేల కోట్లు పెండింగ్ పెడితే తాము కాలేజీలు ఎలా నడపాలని ప్రశ్నిస్తున్నాయి. విద్యార్థులకు సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు, పరీక్షలు రాయకుండా అడ్డుకోవడంపై కూటమి ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబించలేకపోతోంది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

జగన్ నిర్వాకంతోనే...

జగన్ సర్కారుకు ముందు విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం నేరుగా కాలేజీల యాజమాన్యాలకు చెల్లించేది. దీంతో ఫీజులు కట్టమని విద్యార్థులను యాజమాన్యాలు అడిగేవి కావు. విద్యార్థులకూ ఫీజులు చెల్లించాల్సిన బాధ ఉండేది కాదు. ప్రభుత్వం ఫీజులు చెల్లించడం ఆలస్యమైనా వెసులుబాటు ఉండేది. అయితే జగన్ సర్కారు ఈ విధానం మార్చేసింది. ఫీజులను విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలకు వేసేది. వారు కాలేజీల్లో చెల్లించాలి. దీనివల్ల ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయకపోయినా విద్యార్థులు మాత్రం తప్పనిసరిగా కాలేజీల్లో కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. యాజమాన్యాలు కూడా విద్యార్థులనే అడుగుతున్నాయి. జగన్ సర్కారు ఫీజు బకాయిలు పెట్టడంతో వారికి సమస్యలు తెచ్చిపెడుతోంది.

ఫిర్యాదు చేసినా

ఫీజులు చెల్లించలేదనే కారణంతో ఫైనలియర్ పూర్తయిన ఉన్నత విద్య విద్యార్థులకు ఆ మధ్య కాలేజీలు సర్టిఫికెట్లు ఆపేశాయి. రాజధాని కార్యకలాపాలు సాగుతున్న విజయవాడలోనే పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టింది. దీనిపై ఉన్నత విద్య కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. చివరికి సొంత డబ్బు చెల్లించి విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వచ్చింది.

ఏమడిగినా అదే జవాబు!

- తెలియదు.. గుర్తులేదు.. సంబంధం లేదు!!
- పోలీసు విచారణలో నందిగం సురేశ్ సమాధానాలు
- మరియమ్మ హత్య కేసులో ముగిసిన కస్టడీ..
- నేడు జిల్లా జైలుకు తరలింపు.. ఏ-1గా చేర్చే అవకాశం



గుంటూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలో జరిగిన మెండెం మరియమ్మ హత్య కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేశ్ పోలీసుల విచారణకు సహకరించడం లేదని తెలిసింది. పోలీసులు ఏమడిగినా తెలియదు.. గుర్తులేదు.. తనకు సంబంధం లేదంటూ తప్పించుకునే ధోరణిలో ఆయన సమాధానాలు చెప్పారు. 2020 డిసెంబరు 27న రాజధాని అమరావతిలోని వెలగపూడిలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మరియమ్మ అనే మహిళ హత్యకు గురైంది. ప్రస్తుతం ఆ కేసులో నిందితుడిగా జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు కోర్టు అనుమతితో రెండ్రోజులు కస్టడీకి తీసుకున్న విషయం విదితమే. శనివారం తొలి రోజు విచారణలో ఆయన ఆ హత్యతో తనకు సంబంధం లేదని, అప్పటి తాడికొండ వైసీపీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి తనను కేసులో ఇరికించారని చెప్పారు. ఆదివారం కూడా పోలీసులు వివిధ కోణాల్లో ఆయన్ను విచారించారు. ఏ ప్రశ్న అడిగినా తనకు తెలియదని, గుర్తు లేదని, తనకు సంబంధం లేదని చెప్పారు. అసలీ కేసులో తన పేరు ఉన్న విషయం కూడా తనకు తెలియదని తెలిపారు. అలాంటప్పుడు గత సార్వత్రిక ఎన్నికల అఫడవిట్‌లో ఈ కేసును ఎలా పొందుపరిచారని పోలీసులు ప్రశ్నించగా సూటిగా సమాధానం చెప్పలేకపోయారు. అయితే ఎఫ్ఐఆర్‌లో తన పేరు నమోదు చేశారని, అందువల్లే అఫడవిట్‌లో పేరు రాశానని తమ న్యాయవాది చెప్పినట్లు సురేశ్ పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న నాటి సీఎం జగన్ ఆ న్యాయవాదిపై ఆగ్రహం వ్యక్తం చేశారని చెప్పారు. మరియమ్మ హత్య కేసులో ప్రస్తుతం 78వ నిందితుడిగా ఉన్న సురేశ్‌ను పోలీసులు ఏ-1 నిందితుడిగా చేర్చే అవకాశం ఉంది. న్యాయ నిపుణుల అభిప్రాయం తెలుసుకున్న తర్వాత ప్రధాన నిందితునిగా చేరుస్తారని అంటున్నారు. ఈ కేసులో మరో 41 మందిని అరెస్టు చేయాల్సి ఉంది. త్వరలోనే వారి అరెస్టుల పర్వం కూడా ప్రారంభం కానుంది. ఆదివారంతో సురేశ్ కస్టడీ ముగిసిన నేపథ్యంలో సోమవారం ఉదయం వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను తిరిగి గుంటూరు జిల్లా జైలుకు తరలించనున్నట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

షర్మిలతో రాయ 'బేరం'!





(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర పీసీసీ పగ్గాలు చేపట్టి జగన్‌పై పదునైన విమర్శలతో ఆమె కత్తి దూయడంతో జగన్‌కు దిమ్మతిరగడం మొదలైంది. తనకు జరిగిన అన్యాయాన్ని ఆమె ఊరూవాడా ఎలుగెత్తి చెబుతూ, జగన్ నిజ స్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చేయగలిగారు. మరోవైపు చిన్నాన్న కుమార్తె సునీత విషయంలోనూ జగన్ అదే మొండి వైఖరితో వ్యవహరించి, బాబాయ్ హంతకులకే మద్దతిచ్చారు. దీంతో ఇద్దరు చెల్లెళ్లూ ఏకమయ్యారు. సొంత జిల్లాలో జగన్‌కు వ్యతిరేక పవనాలు ప్రారంభమవడం పరిస్థితి తీవ్రతను చెప్పకనే చెప్పింది.

ఆ దెబ్బతో వణుకు..

ఎన్నికల వేళ 'వైనాట్ 175' అన్న ధీమాతో ఉన్న జగన్‌కు ఎవరు ఎన్ని హితోక్తులు చెప్పినా చెవికెక్కలేదు. సొంత చెల్లెళ్లకు అన్యాయం చేయడం సరికాదన్న మాటలను ఏ మాత్రం పట్టించుకోలేదు. పైగా, తన కూలి మీడియాతో షర్మిలపై అసభ్యకరమైన దూషణలతో దాడి కూడా చేయించారు. తీరా ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోవడం, ఆ తర్వాతి పరిణామాలు జగన్‌కు వెన్నులో వణుకు పుట్టించాయి. ఓటమి తర్వాత సొంత పార్టీలోని కీలక నేతలందరూ ఒక్కొక్కరుగా దూరమవడం ప్రారంభించారు. భజన బృందం తప్ప మిగతా తటస్థులూ, కాస్తో కూస్తో పద్ధతిగా ఉండే వారు వెళ్లిపోవడం మొదలెట్టారు. మరోవైపు జగన్ ఉస్కో అనగానే రెచ్చిపోయి విచ్చలవిడిగా వ్యవహరించిన వారిపై చంద్రబాబు సర్కారు చర్యలకు శ్రీకారం చుట్టింది. దాంతో జగన్ దాదాపు ఏకాకి అయిపోవడం మొదలైంది. ఈ పరిస్థితిలో పార్టీ మనుగడ సాగించాలన్నా, తనకు రాజకీయ భవిష్యత్తు ఉండాలన్నా ఏదో ఒక జాతీయ పార్టీ సహకారం అవసరమన్న వాస్తవం జగన్‌కు అవగతమైంది.

కేసుల భయం..


గడచిన ఐదేళ్లూ జగన్‌కు మద్దతిచ్చిన బీజేపీ.. ఎన్నికల వేళ ఆయన్ను వదలి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి కట్టింది. కేంద్రంలో, రాష్ట్రంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి. దాంతో జగన్‌కు చుక్కలు కనిపించడం ఆరంభమైంది. మరోవైపు తన మీద ఉన్న కేసుల విషయంలో ఇన్నాళ్లూ కేంద్రంలోని ప్రభుత్వం అండతో ధిలాసాగా నెట్టుకొచ్చిన జగన్‌కు.. ఒక్కసారిగా సీన్ రివర్స్ అయింది. మొత్తంమీద రాష్ట్రంలో అధికారం పోయింది. పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలోనూ వ్యతిరేక ప్రభుత్వాలే అధికారంలో ఉన్నాయి. కేంద్రంలో పెద్దల అండా దూరమైంది. ఇక ఎవరూ కరుణించే పరిస్థితి లేదు. మిగిలింది.. కాంగ్రెస్‌తో కాళ్లబేరానికి వెళ్లడమే! కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వంటి వాళ్లు జగన్ విషయంలో కొంత సాఫ్ట్‌గా ఉన్నారన్న వాదన ఉంది. కానీ ప్రధాన సమస్య షర్మిలే. ఇప్పుడు ఆమె చిన్నా చితకా నాయకురాలేమీ కాదు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు. ఆమెతో ఘర్షణ కొనసాగిస్తే తనకు కాంగ్రెస్ వైపు చూసే చాన్స్ ఉండదని జగన్‌కు అర్థమైంది. కాంగ్రెస్ అండ లేకపోతే భవిష్యత్తు శూన్యమని ఆయన గ్రహించారు. దాంతో గత్యంతరం లేక చెల్లితో రాయబేరాలు నడపడం మొదలెట్టారు. గత కొద్దిరోజులుగా ఆయన తరచూ బెంగళూరు వెళ్లి, షర్మిలతో ఆస్తుల పంపకాలకు సంబంధించి మంతనాలు జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ చర్చలు దాదాపు కొలిక్కి వచ్చాయని, షర్మిల కోరిన విధంగా ఆస్తుల్లో వాటా ఇవ్వడానికి జగన్ ఓకే అన్నారన్నది సమాచారం. ఈ విషయంలో జగన్ మాట నిలబెట్టుకుంటే ఆయనను కాంగ్రెస్‌కు దగ్గర చేయడానికి షర్మిల కూడా సానుకూలంగా ఉన్నారని తెలుస్తోంది. వాస్తవానికి వైసీపీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తారన్న ప్రచారం కూడా ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి ఆ పార్టీతో సయోధ్యకే జగన్ పరిమితమయ్యే అవకాశముంది.

శ్రీశైలం నిండుకుండల్లా సాగర్

గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల

శ్రీశైలంలో 6, నాగార్జునసాగర్‌లో 20 గేట్లు ఎత్తివేత

కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి



శ్రీశైలం డ్యాం 6 గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

శ్రీశైలం, వీపీ సౌత్, నరసరావుపేట, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం శ్రీశైలం డ్యాం 6 క్రస్టుగేట్లను 10 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 1,25,641 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 884.80 అడుగులకు చేరింది. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 211.4250 టీఎంసీల నిల్వ ఉంది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,698 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. జలాశయం ఆరు క్రస్టు గేట్ల ద్వారా 1,67,898 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. అలాగే, సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 589.8 అడుగులకు చేరింది. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకుగాను ప్రస్తుతం 311.45 టీఎంసీలకు నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 1,72,712 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం సాగర్ 20 క్రస్ట్ గేట్లను ఎత్తి 1,89,312 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి పులిచింతలకు 1.71 లక్షల క్యూసెక్కుల వరద వస్తోంది. పులిచింతల పూర్తి స్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 173.72 అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను 43.79 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పులిచింతల నుంచి ప్రకాశం బ్యారేజీకి 1.71 కూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



నాగార్జునసాగర్ 20 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్న దృశ్యం

24 గంటల వ్యవధిలో తల్లి, కొడుకు మృతి

- ఇద్దరూ ఒకేవిధంగా విద్యుదాఘాతానికి బలి
- 'అమ్మ ఇక్కడే మరణించింది' అని చెబుతున్న కుమారుడికి కూడా విద్యుత్తు షాక్
- కనిపించకుండా ఉన్న తెగిపోయిన వైరు
- కాకినాడ జిల్లా సామర్లకోటలో విషాద ఘటన



చిట్టిమాని పద్మ(ఫైల్)



చిట్టిమాని విశ్వేస్(ఫైల్)

సామర్లకోట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. విద్యుత్తు షాక్‌తో తల్లి మరణించిన 24 గంటల వ్యవధిలోనే కుమారుడు కూడా అదేవిధంగా విద్యుదాఘాతంతో మృతిచెందాడు. విద్యుత్తు వైరు తెగిపడి ఉండి.. కనిపించకుండా పొంచివున్న మృత్యువు ఇద్దరినీ బలి తీసుకుంది. 'ఇదిగో అమ్మ ఇక్కడే మరణించింది' అని ఆ ప్రాంతాన్ని చూపిస్తూ బంధువులకు చెబుతున్న క్రమంలో కుమారుడు కూడా విద్యుత్తు షాక్‌తో మరణించడం అందరినీ కలచివేసింది. వివరాల ప్రకారం.. సామర్లకోట పట్టణ పరిధిలో వీర్రాఘవపురంలో చిట్టిమాని పద్మ(40), తన భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు విశ్వేస్(20)తో కలిసి నివాసం ఉంటోంది. భర్త అనారోగ్యం కారణంగా.. పద్మ చుట్టుపక్కల ఇళ్లలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తోంది. కుమారుడు విశ్వేస్ రోజువారీ కూలీ పనులకు వెళ్తుంటాడు. పద్మ ఇంటి సమీపంలో విద్యుత్తు స్తంభం నుంచి వచ్చే స్పేవైరు ఒకటి తెగిపోయింది. దీన్ని ఎవరూ గుర్తించలేదు. శనివారం బయటకు వెళ్లిన పద్మ ఆ విద్యుత్తు వైరు దగ్గర పడిపోయి, మృతిచెందింది. సాధారణ మరణంగా భావించి అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం పరామర్శకు వచ్చిన బంధువులకు విశ్వేస్ తల్లి చనిపోయిన ప్రాంతాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. ఇక్కడే అమ్మ పడిపోయి ఉందని చెప్తూ పొరపాటున జారిపడిపోతుండగా అక్కడి గోడపై ఆనుకోబోయాడు. అప్పటికే అక్కడ కరెంటు స్తంభం నుంచి వస్తున్న స్పేవైరు ఉంది. దాన్ని తాకి విద్యుదాఘాతానికి గురై అతడూ మృతిచెందాడు. దీంతో ఇద్దరూ విద్యుదాఘాతంతో మరణించారని బంధువులు నిర్ధారించుకున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ కృష్ణ భగవాన్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆదివారం పరామర్శించారు. ఘటనపై సమాచారం అందుకున్న విద్యుత్తు శాఖ అధికారులు స్పేవైరును తొలగించారు.

ఖరీదైన యంత్రాలున్నా.. క్యాన్సర్‌కు అందని వైద్యం!



కర్నూలులో నిర్మించిన స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్

- విభజనచట్టం కింద కర్నూలులో 120 కోట్లతో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు
- ఖరీదైన యంత్రాలపై 40 కోట్లకు పైగా వ్యయం
- కానీ, కూర్చోడానికి కుర్చీలు, రోగులకు మంచాలు కరువు
- కనీసం ఫోర్త్‌క్లాస్ సిబ్బందినీ నియమించని అధికారులు
- ఆక్సిజన్ పైప్‌లైన్, జనరేటర్ లేకుండా తామేం చేయాలంటున్న వైద్యులు
- తాత్కాలిక ఓపీతో సరి.. రోగులు ప్రైవేటు బాట..



స్టేట్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన లీనియర్ యాక్సిలరేటర్ యంత్రం

దేశంలో సంభవించే మరణాల్లో హృదయ సంబంధ వ్యాధులు (సీవీడీ), గుండెపోటు, మధుమేహం, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్ మరణాలు 60 శాతం వరకు ఉన్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో క్యాన్సర్ జబ్బు బారిన పడుతున్న బాధితుల సంఖ్య పెరగడమే కాకుండా మరణాల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. క్యాన్సర్ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించగలిగితే, మరణాలను తగ్గించే అవకాశం ఎక్కువ. ఇదే లక్ష్యంతో విభజన చట్టంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కర్నూలుకు క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌ను కేటాయించింది. ఇప్పుడు భవనాలు సిద్ధంగా ఉన్నాయి. కొన్ని యంత్రాలు కూడా అందుబాటులో ఉన్నాయి. కనీస వసతులు, సౌకర్యాలు, ఫర్నిచర్‌ను కల్పిస్తే క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌ను పూర్తిస్థాయిలో బాగా నడిపించవచ్చు. కానీ, అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పుడీ ఇనిస్టిట్యూట్ తాత్కాలిక ఓపీ సేవలకు మాత్రమే పరిమితమైంది. ఆస్పత్రి పరిశుభ్రత కోసం ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్‌ను నియమించకపోవడం వైద్య అధికారుల అలక్ష్యానికి పరాకాష్ఠ!

విభజన చట్టంలో భాగంగా...

దేశంలో పెరుగుతున్న క్యాన్సర్ కేసులు, మరణాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం 2010లో నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ క్యాన్సర్, డయాబెటిక్, కార్డియోవాస్కులర్ డిసీజెస్ అండ్ స్ట్రోక్ (ఎన్‌పీసీడీసీఎస్)ను ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా కర్నూలు జిల్లా కేంద్రంలో రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం చేశారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వం 2014లో రూ.120 కోట్లు మంజూరు చేసింది. ఇందులో రాష్ట్రం వాటా రూ.48 కోట్లు (40శాతం). అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇన్‌స్టిట్యూట్ నిర్మాణం కోసం కేఎంసీ ఆవరణలో తొమ్మిది ఎకరాలు కేటాయించింది. భవనాల డిజైన్, సాంకేతిక పరిజ్ఞానం కోసం టాటా కన్సల్టెన్సీ సేవలు తీసుకున్నారు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్ల పర్యవేక్షణలో..1.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ (జీ+1) 9 బ్లాకుల్లో లీనియర్ యాక్సిలరేటర్ (రోగి క్యాన్సర్ గుర్తించి రేడియేషన్ ట్రీట్మెంట్ ఇచ్చే కేంద్రం) సెంటర్ ఎల్ఏ-1, ఎల్ఏ-2 చాంబర్స్, 3 ఆపరేషన్ థియేటర్లు (ఓటీ), ఎమర్జెన్సీ వార్డు, జనరల్ వార్డులు, ఐసీయూ సహా వివిధ విభాగాల నిర్మాణాలకు 2019 జనవరి 8న అప్పటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న హైదరాబాద్‌కు చెందిన సాయి పవర్ కన్‌స్ట్రక్షన్ సంస్థ 15 నెలల్లో పూర్తి చేసేలా ఒప్పందం చేసుకున్నారు. 2019 జనవరిలో పనులు మొదలు పెట్టింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రెండేళ్లకు పైగా పురోగతి లేకుండా పోయింది. కరోనా కూడా ఓ కారణమే. తరువాత పనులు మొదలు పెట్టి సివిల్ పనులు మాత్రమే పూర్తి చేశారు. కాన్సర్ చికిత్సకు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలు, ఫర్నిచర్ లాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయకుండానే.. ఎన్నికల కోడ్ వస్తుందని హడావుడిగా నాటి ఆర్థిక ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఈ ఏడాది మార్చి 7న ప్రారంభించేశారు.

- కర్నూలు, ఆంధ్రజ్యోతి

రూ. 45 కోట్లు ఖర్చు చేసినా..!

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌పై దృష్టి సారించింది. రూ.30 కోట్లకు పైగా విలువైన లీనియర్ యాక్సిలరేటర్ ఆధునిక వైద్య యంత్రం, రూ.9.88 కోట్లతో సీసీ సెమిలేటర్, రూ.2కోట్లతో అల్ట్రాసౌండ్ స్కానర్, రూ.3కోట్లతో ఎక్స్‌రే యంత్రాలు, ఐసీయూ బెడ్స్. సమకూర్చారు. ఇప్పటికే రూ.45కోట్లకు పైగా ఖర్చు చేశారు. 60మంది వైద్యులు, 21మంది స్టాఫ్ నర్సులను నియమించారు. అయినా ఆక్సిజన్, జనరేటర్ సౌకర్యం లేకుండా రోగులకు వైద్యం అందించలేమని, ఏ చిన్న సమస్య తలెత్తినా ప్రాణాలకే ప్రమాదమని వైద్యులు అంటున్నారు. క్యాన్సర్‌కు మెరుగైన వైద్య సేవలు అందించాలంటే కావాల్సిన పరికరాలు, యంత్ర సామగ్రి, ఫర్నిచర్ కోసం 3నెలల క్రితమే ఏపీఎంఎస్ఐడీసీకి ఇండెంట్ పెట్టినా.. సంబంధిత సంస్థ అధికారుల నిర్లక్ష్యంతో అవి చేరుకోలేకపోయాయి. ఇక్కడ సేవలు పూర్తిగా అందుబాటులోకి రాకపోవడంతో క్యాన్సర్ బాధితులు కర్నూలు సహా హైదరాబాదులో ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ స్పందించి... సీఎం చంద్రబాబు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో చర్చించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



నేడు అల్పపీడనం

- రేపు వాయుగుండం, 23న తుఫాన్‌గా బలపడే చాన్స్
- 24న ఒడిశా, బెంగాల్ మధ్య తీరం దాటొచ్చని అంచనా
- గురువారం నుంచి ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం ఏర్పడనుంది. బుధవారం నాటికి అది తుపానుగా బలపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ తుఫాన్‌పై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నాలుగు రోజుల ముందే ఒడిశా, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. ఈ మేరకు ఆదివారం తుఫాన్‌పై ప్రీవాచ్ బులెటిన్ విడుదల చేసింది.

ఉత్తర అండమాన్ సముద్రంలో ఆవరించిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం తూర్పుమధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉత్తర అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి తూర్పుమధ్య బంగాళాఖాతంలోనే 22వ తేదీకి వాయుగుండంగా, 23 నాటికి తుఫాన్‌గా బలపడనుంది. తర్వాత వాయవ్యంగా పయనించి 24 నాటికి ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరం దిశగా వెళుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే అత్యధిక మోడళ్ల మేరకు తుఫాన్ బలపడి తీవ్ర తుఫాన్‌గా మారి ఈనెల 25న ఒడిశాలోని గోపాలపూర్, పూరి మధ్య లేదా.. గోపాలపూర్, జగత్సింగ్‌పూర్ మధ్య తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు. అమెరికాకు చెందిన నేవీ సంస్థ మాత్రం 25న పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటుతుందని పేర్కొంది. ఈనెల 23న ఏర్పడనున్న తుఫాన్‌కు ఖతర్ సూచించిన పేరు 'దానా' (డీఏఎన్ఏ) పెట్టనున్నారు.

ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

ఇదిలావుండగా వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరిక బులెటిన్ మేరకు ఉత్తరాంధ్రలో ఈనెల 23 నుంచి వర్షాలు ప్రారంభమవుతాయి. ఈ నెల 24, 25, 26 తేదీల్లో ఉత్తరాంధ్రలో పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. కాగా.. కోస్తా, తమిళనాడుకు ఆనుకుని పశ్చిమమధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమలో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, విపత్తుల నిర్వహణ సంస్థ కూడా ఈ నెల 24వ తేదీ వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని ఆదివారం హెచ్చరించింది. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరిగి రావాలని సూచించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరింది.

సాములోరికి స్టార్ హోటల్

(మొదటి పేజీ తరువాయి)

భారీ స్టార్ హోటల్ నిర్మించుకునేందుకు ఆయన సకల అనుమతులు పొందారు. తీసుకునే అనుమతి రికార్డుల్లో ఒకటి ఉంటుంది. ఆచరణలో దాన్ని మరో రేంజ్‌కు తీసుకెళ్లారు. ఇది ఆయన ఆచరణే. ఇలా సాములోరికి అడ్డగోలు మేలుచేయడానికి వీల్లేదని, ప్రజల ఆస్తులను సాములోరికి సమర్పించకూడదన్న కనీస స్పృహ నాటి రెవెన్యూ అధికారులకు లేకుండా పోయింది. నాటి ముఖ్యమంత్రి జగన్‌కు సాములోరు గురువు సమానులు కాబట్టి వారికి సందేహాలు వచ్చే చాన్స్ కూడా లేదు. అందుకే సాములోరు కోరినవన్నీ ఆనాడు అధికారులు చకచకా చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ మరో నెల రోజుల్లో రావచ్చన్న సంకేతాలుండటంతో రెవెన్యూశాఖ పోటీపడి సాములోరి సేవలో ఆనాడు తరించిపోయింది. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీన రెవెన్యూ శాఖ ఇచ్చిన జీఓ 47.

ఆధ్యాత్మికత ముసుగులో...

శారదాపీఠం శ్రీ శంకరచార్యుల బోధనలకు అనుగుణంగా సనాతన ధర్మ సూత్రాలు ప్రచారం చేస్తుందని, సంస్కృత పాఠశాలను ఏర్పాటుచేసి, ప్రజల్లో వేద విద్య, వేద సంస్కృతిని పెంపొందిస్తామని కారణాలు చెప్పి పీఠం ప్రభుత్వం నుంచి 2021లో 225 కోట్ల విలువైన 15 ఎకరాల భూమిని విశాఖ జిల్లా భీమిలీ మండలం కొత్తవలసలో పొందింది. ఇక భూ కేటాయింపులో రెవెన్యూశాఖ ఎన్నో ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని ఇదివరకే 'ఆంధ్రజ్యోతి' ఆధారాలతో సహా బయటపెట్టింది. ఇప్పుడు, కొత్త విషయం ఏమంటే, తమకు కేటాయించిన భూమిలో ముందు చెప్పినట్లుగా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణతోపాటు ఆదాయార్జన పనులు కూడా చేపడుతామని, కాబట్టి, అందుకు అనుమతి ఇవ్వాలని పీఠం 2023, నవంబరు 20న విశాఖ కలెక్టర్‌ను కోరింది. ఈ విషయాన్ని కలెక్టర్ సీరియస్‌గా తీసుకోలేదు. నాటి ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేసిన అధికారి విశాఖ కలెక్టర్‌పై ఒత్తిడి తీసుకురాగా, పీఠం రాసిన లేఖపై తన రిమార్క్‌లు ప్రస్తావిస్తూ ఈ ఏడాది జనవరి 19న రెవెన్యూశాఖకు నివేదిక పంపారు. అంతే, 24 గంటల వ్యవధిలో శారదాపీఠం పంపించిన లేఖను ఆంధ్రప్రదేశ్ భూ నిర్వహణా వ్యవస్థ (ఏపీ ల్యాండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ-ఏపీఎంఏ)లో ఆమోదించి, రెవెన్యూశాఖకు పంపించారు. ఆ తర్వాత ఫిబ్రవరి 6వ తేదీన రెవెన్యూ శాఖ సాములోరి విన్నపాలను ఆచరణలోకి తీసుకొస్తూ జీవో జారీచేసింది.

బోర్డింగ్ హౌస్ పేరిట...

బోర్డింగ్ హౌస్ పేరిట సాములోరు కొత్తవలసలో తనకిచ్చిన భూమిలో స్టార్ హోటల్ నిర్మించేందుకు సకల సన్నాహాలు చేస్తున్నట్లు అధికారవర్గాలు గుర్తించాయి. ఇటీవల ఈ ప్రాంతాన్ని ఓ సీనియర్ అధికారి సందర్శించారు. అక్కడ బోర్డింగ్ హౌస్ పేరిట భారీ స్టార్‌హోటల్ నిర్మాణానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నట్లు గుర్తించారు. నేరుగా హోటల్ అంటే అనుమతులు ఇవ్వరు కాబట్టి ఎనిమిది అంతస్తుల బోర్డింగ్ హౌస్ నిర్మాణానికి రెడీ అవుతున్నట్లుగా గుర్తించారు. బహుళ అంతస్తుల భవనం నిర్మాణానికి కూడా అనుమతి పొందారు. దీనికి బోర్డింగ్ హౌస్ అని పేరుపెట్టారు. ఈ విషయం తెలిసి ఓ రెవెన్యూ అధికారి పీఠం ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిసింది. మీరు స్టార్‌హోటల్ కట్టకూడదు. అది తప్పు అని వారించినట్లు తెలిసింది. "ఆదాయార్జనకు భూమిని వినియోగించుకోవచ్చని (జగన్) ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అలాంటప్పుడు ఆదాయం తెచ్చిపెట్టే ఏ మార్గాన్ని అయినా మేం అనుసరించవచ్చు కదా. ఇందులో ఉల్లంఘన ఏముంది?. మీరే అనుమతి ఇచ్చి, మీరే వద్దంటారా? ఇదెక్కడి న్యాయం?" అని పీఠానికి చెందిన ఓ వ్యక్తి... ఆ అధికారికి చెప్పినట్లు తెలిసింది. దీంతో అప్పటి కప్పుడు పీఠానికి ఇచ్చిన అనుమతుల ఉత్తర్వుల ఫైలు, వాటి కి సంబంధించిన నోట్‌ఫైల్స్‌ను తెప్పించి పరిశీలన చేశారు. ఇందులోనూ పెద్దగోల్‌మాలే నడిచినట్లు తెలిసింది.

గుట్టుగా కానిచ్చేశారు

ఆదాయార్జనకు అనుమతి ఇవ్వాలని తొలుత శారదాపీఠం ప్రతినిధులు నాటి సీసీఎల్ఏ జి.సాయిప్రసాద్‌ను కలిసి విన్నవించారు. ఇందుకు ఆయన తిరస్కరించారు. అనుమతి ఇవ్వలేమని తేల్చిచెప్పారు. ఆ తర్వాత ఎల్ఎమ్ఏలోనూ దీన్ని అజెండాగా చేర్చాల్సిన అవసరం లేదని తేల్చారని తెలిసింది. ఇదంతా ఈ ఏడాది జనవరి తొలివారంలో జరిగింది. అయితే, సాయిప్రసాద్ జనవరి రెండోవారంలో సెలవుపెట్టారు. దాన్ని అదేనెల 25 వరకు పొడిగించుకున్నారు. అప్పుడు ఓ జూనియర్ అధికారికి ఇన్‌చార్జి సీసీఎల్ఏ పదవిని కట్టబెట్టారు. సరిగ్గా ఇదే సమయం అనుకున్న పెద్దలు ఆ ఇన్‌చార్జి సీసీఎల్ఏ ద్వారా మంత్రాంగం నడిపించారు. జనవరి 19న కలెక్టర్‌తో లేఖ తెప్పించుకొని, 20వ తేదీన ఆదాయార్జనకు అనుమతి ఇవ్వాలన్న పీఠం డిమాండ్‌కు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వానికి ఫైలు పంపించారు. ఇది జరిగిన ఐదు రోజుల తర్వాత సాయిప్రసాద్ సెలవు ముగించుకొని వచ్చి ఉద్యోగంలో చేరారని తెలిసింది. ఇదంతా ఇప్పుడు బయటపడటంతో రెవెన్యూ అధికారులు విస్తుపోతున్నారు. ఇది పక్కా ప్రైవేటు వ్యాపారమేనని ముక్కున వేలేసుకుంటున్నారు!

కార్లలో వచ్చి నడిరోడ్డుపై కాల్పులు

- నలుగురు వ్యక్తులపై 3 రౌండ్ల కాల్పులు
- శ్రీసత్యసాయి జిల్లాలో కలకలం

పుట్టపర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అది శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం రామాపురం బస్టాండ్ ప్రాంతం. అనంతపురం-చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో రెండు బైక్‌లపై నలుగురు వ్యక్తులు వచ్చి అక్కడ ఆగారు. కొద్దిసేపటికే రెండు కార్లు వచ్చాయి. వాటిలో నుంచి ఐదుగురు వ్యక్తులు కిందకు దిగడం.. బైక్‌ల వద్ద ఉన్నవారిపై నడిరోడ్డుపైనే తుపాకీతో మూడు రౌండ్లు కాల్పులు జరపడం క్షణాల్లో జరిగిపోయాయి. దీంతో ద్విచక్రవాహనాల్లో వచ్చిన వారు భయంతో అక్కడి నుంచి పారిపోయారు. ఆ సమయంలో వారు ఓ మూటను అక్కడే వదిలేశారు. కాల్పులు జరిపిన వారు ఆ మూటను స్వాధీనం చేసుకుని వెళ్లిపోయారు. కార్లలో వచ్చిన వారు పోలీసు సఫారీ దుస్తుల్లో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో దొంగలపై పోలీసులు కాల్పులకు పాల్పడినట్లు గ్రామస్థులు భావించారు. కానీ, కార్లలో వచ్చిన వారు క్షణాల్లోనే అక్కడి నుంచి వెళ్లిపోవడంతో అనుమానం వచ్చి.. బత్తలపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు.. తన బృందంతో రామాపురం గ్రామానికి చేరుకుని, ఘటనపై విచారించారు. ఆ రెండు కార్లు తెలంగాణకు చెందినవిగా గుర్తించారు. నకిలీ బంగారంతో మోసం చేసే తెలంగాణ దొంగల ముఠానే కాల్పులకు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. డమ్మీ తుపాకులతో కాల్పులు జరిపినట్లు పోలీసులు భావిస్తున్నారు.

విశ్వసనీయత @ 459 కోట్లు

- నెలన్నర తర్వాతా వరదలా సాయం
- వరదలోనూ వెంట ఉండే నాయకుడికీ బురదలో దిగని నేతకీ తేడా చూసిన జనం
- అందుకే దాతల నుంచి ఇంతటి స్పందన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఓ వ్యక్తికి లేక ప్రభుత్వానికి విశ్వసనీయత చాలాముఖ్యం. ఆ విశ్వసనీయతను సంపాదించుకుంటే ఏదైనా సాధ్యమే. అదే దానిని కోల్పోతే అథోగతే!.. గత వైసీపీ ప్రభుత్వంలోనూ రాష్ట్రంలో వరదలు, తుపానులు వచ్చాయి. అప్పట్లో దాతలు స్పందించిన తీరును.. బుడమేరు వరదలు వచ్చిపోయిన నెలన్నర తర్వాత కూడా ప్రభుత్వానికి వరదలా అందుతున్న విరాళాలతో పోల్చినవారు అంటున్న మాట ఒక్కటే! అదే విశ్వసనీయత! 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విశాఖను హుద్‌హుద్ తుఫాన్ అతలాకుతలం చేసింది. ఆ సమయంలో చంద్రబాబు వెంట పారిశ్రామికవేత్తలు, దాతలు అండగా నిలిచారు. విశాఖపట్నం పునర్నిర్మాణం కోసం దాతల నుంచి రూ.425 కోట్ల విరాళాలు వచ్చాయి. అప్పట్లో ప్రభుత్వం, చంద్రబాబు తుఫాను బాధితులను ఆదుకునేందుకు, తిరిగి వారి బతుకులను నిలబెట్టేందుకు చూపిన తపనను చూసి అందిన సాయమిది. ఆ తర్వాత తితిలీ తుఫాన్ అప్పుడూ అంతే.. ఆ తుపానుకు అల్లాడిన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పరిస్థితులు మెరుగు పడేవరకు చంద్రబాబు అక్కడే ఉండిపోయారు. ఆయన పిలుపుతో దాతల నుంచి దాదాపు రూ.90 కోట్ల వరకు బాధితుల సహాయార్థం అందాయి. ఇక.. వైసీపీ హయాంలో 2020లో నివార్ తుఫాను, 2021లో గులాబ్ తుఫాన్, 2022లో మరికొన్ని తుఫాన్లు రాష్ట్రాన్ని ముంచెత్తాయి. 2022లో ఏకంగా అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయింది. పదుల సంఖ్యలో జనం మరణిస్తే, వందల సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. నాడు చంద్రబాబుకు ఉన్నంత యంత్రాంగమూ, ప్రభుత్వ బలగమూ.. జగన్‌కూ ఉన్నాయి. కానీ, లోపించిందల్లా విశ్వసనీయత.. సంకల్ప బలం. వరదలు, తుఫాన్ల సహాయ పనులను అధికారులను వదిలేసి, ఆయన తాడేపల్లి ప్యాలెస్‌కు పరిమితం అయ్యారు. నష్టపోయిన ప్రాంతాల్లోను, బురద చేరిన పొలాల్లో కనీసం కాలు పెట్టలేదు. ఏరియల్ సర్వే చేసి కేంద్రానికి నష్టం లెక్కలు పంపించారు. చివరకు.. ప్రాణనష్టం చోటుచేసుకున్న అన్నమయ్య జిల్లాకు కూడా చాలా రోజుల వరకు జగన్ వెళ్లలేదు. ఆయన స్పందనకు తగినట్టే అప్పట్లో దాతలు కూడా వ్యవహరించారు. దీంతో జగన్ హయాంలో విపత్తుపై దాతల సాయం రూ.100 కోట్లు ఎప్పుడూ దాటలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలకే బుడమేరు రూపంలో విజయవాడను వరద ముంచెత్తింది. చంద్రబాబు రంగంలోకి దిగారు. వరద నీటిలో జేసీబీలు ఎక్కి మరీ ప్రజలకు వద్దకు వెళ్లి వారికి భరోసా కల్పించారు. ఐఏఎస్ అధికారులను రంగంలోకి దించి వరద నీటిలోనే ఇంటింటికి పంపించి సహాయ చర్యలు చేపట్టారు. ప్రజలు సాధారణ జీవితం మొదలు పెట్టే వరకూ అక్కడే ఉండి పరిస్థితిని అదుపులో పెట్టారు. సీఎం స్థాయి వ్యక్తి వరద నీటిలో దిగి తిరుగుతుంటే.. స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వేత్తలు రంగంలోకి దిగారు. వరద బాధితుల కోసం రూ.459 కోట్ల విరాళాలు ప్రకటించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.